

ఒంగోలు కేశవస్వామి పేటలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో వెలిగించిన ఆకాశదీపం



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక శోభ

జిల్లావ్యాప్తంగా కార్తీక శోభ నెలకొంది. పరమేశ్వరుని ఆరాధనకు ఎంతో విశిష్టమైన మాసం కావడంతో తొలిరోజైన శనివారం తెల్లవారుజాము నుంచే శైవక్షేత్రాల వద్ద భక్తులు బారులు తీరారు. అభిషేకాలు చేసి దీపాలు వెలిగించి సర్వేశ్వరుడికి పూజలు చేశారు. ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ ఆలయాలైన మణికేశ్వరం, భైరవకోన, త్రిపురాంతకం, మార్కాపురం, జమ్ముల పాలెంలోని శివలింగాల వేదికతోపాటు శివాలయాల్లో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభి షేకాలు జరిగాయి. పలుచోట్ల రాత్రికి ఆకాశదీపాన్ని వెలిగించారు.

- ఒంగోలు కల్చరల్



కనిగిరిలోని బొడ్డుచావిడి వద్ద తొలగిస్తున్న ఆక్రమణలు

కనిగిరిలో రోడ్ల విస్తరణ

- ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు
- ఆక్రమణల తొలగింపునకు ఉపక్రమించిన అధికారులు
- తొలుత అభ్యంతరం వ్యక్తం చేసి ఆతర్వాత సహకరించిన వ్యాపారులు
- మూడు దశాబ్దాల తర్వాత బయల్పడిన నాగశిలలు

7



ఎమ్మెల్యే దామచర్లను కలిసేందుకు ఒంగోలులోని ఆయన కార్యాలయానికి వచ్చిన సహకార శాఖ ఉద్యోగులు

సహకారంలో కలకలం

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఉద్యోగుల్లో విస్తృత చర్చ
- ఉలిక్కిపడిన జిల్లా, రాష్ట్ర అధికారులు
- బ్యాంకు ఉద్యోగులతో మంతనాలు
- సెక్షన్ 51 విచారణ ఆపాలంటూ దామచర్లను కలిసిన ఉద్యోగులు
- తిరస్కరించిన ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో కదలిక మొదలైంది. అవినీతి, అక్రమాలపై విచారణ సమయంలో సహకార శాఖ అధికారులు వ్యవహరించిన తీరుపై 'అక్కడంతే' శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం ఆయా వర్గాల్లో కలకలం రేపింది. సహకార అధికారులు కలవరపాటుకు గురయ్యారు. ఆశాఖ ఉద్యోగులు, అలాగే జిల్లాలోని సహకార సంఘాల పరిధిలోని రైతుల్లో విస్తృత చర్చకు దారితీసింది. గత వైసీపీ పాలనలో డీసీసీబీలో అనేక అవినీతి, అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదులపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన విషయం విదితమే. అయితే ఆ విచారణ జరిగే సమయంలో ప్రస్తుత బ్యాంకు సీఈవో కోటిరెడ్డి అదేస్థానంలో ఉండటంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. రికార్డులు తారుమారయ్యే అవకాశం ఉంటుంది కనుక ఆయనను ఆ బాధ్యతల నుంచి

మిగతా 6వ పేజీలో

గుంతలు లేని రోడ్లే లక్ష్యం

జిల్లాలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వ నిర్ల క్ష్యమే అందుకు కారణం. ఐదేళ్లుగా కొత్త రోడ్లు వేయడం అటుంచి పాత వాటి మరమ్మతులను కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో గజానికో గతుకు, పర్లాంగుకు పది గోతులు అన్న చందంగా తయారయ్యాయి. రోడ్లపై రాకపోకలు సాగించే వాహనాలు ధ్వంసం కావడంతోపాటు వందలకొద్దీ జరిగిన ప్రమాదాలలో అనేక మంది మృత్యువాతపడ్డారు. రోజూ జిల్లాలో ఎక్కడోచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈనేపథ్యంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రోడ్ల దుస్థితిపై దృష్టి సారించింది. వెంటనే మరమ్మతులు చేయాలని నిర్ణయించింది. గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టింది. జిల్లాలోనూ శనివారం రోడ్ల మరమ్మతు పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. రెండు నెలల్లో మొత్తం రోడ్లు బాగుచేయాలన్నదే సర్కారు సంకల్పం.

మిషన్ పాట్ హోల్‌ఫ్రీ పేరుతో మరమ్మతు పనులకు శ్రీకారం



మద్దులూరులో రోడ్డు మరమ్మతులను ప్రారంభించి పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్



కురిచేడు-పొట్లపాడు రోడ్డు మరమ్మతులను ప్రారంభించి రోలర్ నడుపుతున్న టీడీపీ దర్శి ఇన్‌చార్జి లక్ష్మి

- రెండు నెలలపాటు కార్యక్రమం
- జిల్లావ్యాప్తంగా పనులు ప్రారంభం
- మద్దులూరులో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్
- ఆర్అండ్‌బీలో వంద పనులకు రూ.13.76 కోట్లు మంజూరు
- పంచాయతీరాజ్, మునిసిపల్ రహదారులకూ మరమ్మతులు
- ఉత్సాహంగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు



ఐటీవరంలో చిప్స్‌తో గుంతను పూడుస్తున్న టీడీపీ వై.పాలెం. ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఒంగోలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంతల రహిత రోడ్లే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన మిషన్ పాట్ హోల్‌ఫ్రీ (గుంతల రహిత ఆంధ్రప్రదేశ్) కార్యక్రమం శనివారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమైంది. సంతనూతలపాడు నియోజకవర్గ పరిధి మద్దులూరు గ్రామంలోని ఆర్అండ్‌బీ రహదారికి రూ.20లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులను స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌తో కలిసి కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రారంభించారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్ల నిర్వహణను గాలికొదిలేశారు. కనీస మరమ్మతులకు కూడా నిధులు ఇవ్వకుండా ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, మునిసిపల్ ఇలా ఏశాఖకు సంబంధించిన రోడ్లు చూసినా దారుణంగా తయారయ్యాయి. కొద్ది నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రహదారుల బాగుపై దృష్టి సారించింది. అన్ని రోడ్లకు నిధులు కేటాయించడంతోపాటు రెండు నెలల లోపు పూర్తిచేయాలంటూ అధికార యంత్రాంగానికి లక్ష్యం నిర్దేశించింది. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పనులను టీడీపీ నేతలతో కలిసి అధికారులు ప్రారంభించారు.

భారీగా నిధులు మంజూరు

అన్ని విభాగాల్లోని రోడ్లను పరిశీలించి తక్షణ మరమ్మతులు అవసరమైన పనులకు తొలి ప్రాధాన్యం ఇచ్చారు. ప్రధానంగా గోతులు, గుంతలను పూడ్చి రోడ్లను సరిచేసే పనులను ముందుగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ పనులు ఏప్రాంతానికి ఆ ప్రాంతంలో ఎవరు తోచిన సమయంలో ఆశాఖల అధికారులు చేపట్టడం కాకుండా రాష్ట్రం మొత్తం ఒకేసారి

మిగతా 6వ పేజీలో

ఆక్రమిత భూమి పరిశీలన

- ఉన్నతాధికారులకు నివేదిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దర్శి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు కొండ పోరంబోకు భూమిలో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. 'యథేచ్ఛగా కొండభూమి కబ్జా' శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై వారు స్పందించారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు, వీఆర్వో మీరాబీ, సర్వేయర్ సాయి.. ఆక్రమిత కొండభూమిని పరిశీలించారు. గుంటూరు జిల్లాకు చెందిన వ్యక్తి సుమారు 50 ఎకరాల భూమిని ఆక్రమించి బోర్లు వేసి దీర్ఘకాలిక పంటలు వేసేందుకు గుంతలు తీసిన విషయం విదితమే. చందలూరు గ్రామస్థులు అడ్డుకొని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు ఆ భూమిని పరిశీలించి ఆక్రమణలను గుర్తించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ స్పష్టం చేశారు.



ఆక్రమిత భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పోలీసు శాఖలో బదిలీలు

- కానిస్టేబుళ్లు, హెచ్‌సీలు, ఏఎస్ఐలకు అవకాశం
- ఐదేళ్లు నిండిన వారికి స్థానచలనం
- 5న కౌన్సెలింగ్



ఒంగోలు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో కీలకమైన కింది స్థాయి ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఈనెల 5న కౌన్సెలింగ్ నిర్వహించి స్థానచలనం కల్పించనున్నారు. ఈమేరకు ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదేశాలు ఇచ్చారు. కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలను మార్చనున్నారు. ఐదేళ్లపాటు ఒకేచోట పనిచేసిన వారిని కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా బదిలీ చేయనున్నారు. అయితే విద్యా సంవత్సరం మధ్యలో ఉండటంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికిప్పుడు బదిలీలు అయితే ఆయా ప్రాంతాలకు తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తుందని చర్చించుకుంటున్నారు. మొత్తంగా ఐదేళ్ల నుంచి ఒకేచోట

మిగతా 6వ పేజీలో

ఉద్యోగులకు జీతాలు పడ్డాయ్

టీచర్లకు మినహా మిగిలిన అందరి ఖాతాల్లో జమ



ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జీతాలు ఎప్పుడు అందుతాయో కూడా తెలియని పరిస్థితి ఉండేది. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్కువ శాతం మంది ఉద్యోగులకు ఒకటి, రెండు తేదీల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు 50వేల మందికిపైగా ఉన్నారు. శనివారం మధ్యాహ్నానికి ఉపాధ్యాయులు మినహా మిగిలిన శాఖల్లోని ఉద్యోగులకు జీతాలు పడినట్లు తెలుస్తోంది. విశ్రాంత ఉద్యోగులకు కూడా శనివారం ఉదయమే వారి పెన్షన్లు పడ్డాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 30వేల మందికిపైగా జీతాలు అందగా, మిగిలిన వారి ఖాతాలకు విడతల వారీగా జమ అవుతున్నాయి. ఉపాధ్యాయులకు మాత్రం కొంత జాప్యం జరుగుతోంది. వారి జీతాల బిల్లులు సమర్పించడంలో ఆలస్యం కావడం వల్లనే ఈ పరిస్థితి నెలకొందని చెప్తున్నారు. ఏదిఏమైనా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేతనాలు సకాలంలో వస్తుండటంతో ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

రేషన్ పంపిణీ ప్రారంభం

ఈసారి నాలుగు రకాల సరుకుల అందజేత

6



రైళ్లంటేనే కోపం.. అందుకే దాడి

వందేభారత్‌పై రాళ్లు రువ్విన యువకుడు అరెస్టు

ఒంగోలుక్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వందే భారత్ రైలుపై రాళ్లు రువ్విన యువకుడిని ఒంగోలు ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. అయితే అతను చెప్పిన విషయం విని వారు అవాక్కయ్యారు. తన సోదరులు రైళ్ల కిందపడి ఆత్మహత్య చేసుకున్నారని, దీంతో తనకు రైళ్లంటేనే కోపమని.. అందువల్లే దాడి చేశానని తెలపడం కొసమెరుపు. ఒంగోలు ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హీరాసింగ్ శనివారం వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. గతనెల 19న

మిగతా 6వ పేజీలో

నెట్టింట్లో నేరగాళ్లు

- సైబర్ కేటుగాళ్ల ఉచ్చుతో బ్యాంకు ఖాతాలు ఖాళీ
- ఫేక్ కాల్స్, అపరిచిత యాప్‌లతో నగదు స్వాహా
- బాధితుల్లో ఎక్కువ మంది విద్యావంతులే
- జిల్లాలో ఆరేళ్లలో 414 కేసులు

6

నెట్టింట్లో నేరగాళ్లు

మద్దిపాడు మండలంలో ఒక గ్రామ సర్పంచి పంచాయతీ కార్యాలయంలో నిధులు దుర్వినియోగం చేశారని అధికారులు సస్పెండ్ చేశారు. ఆ వార్తా కథనాన్ని సైబర్ నేరగాళ్లు పేపర్లలో చూసి పథకం వేశారు. ఆ గ్రామానికి చెందిన ఉపసర్పంచి ఫోన్ నంబర్‌ను గూగుల్‌లో పరిశీలించి తీసుకున్నారు. సర్పంచి కదలికలను ఉపసర్పంచి ద్వారా తెలుసుకుంటున్నారు. తరువాత సర్పంచికి ఫోన్ చేసి అతని కదలికలు చెప్పడంతో నిజంగా డీజీపీ కార్యాలయం నుంచి అనుకొని భయపడ్డాడు. 'మీరు గ్రామంలో అనేక భూ కుంభకోణాల్లో ఉన్నారు, ఆ కేసు లేకుండా చేస్తాం. రూ.10 లక్షలు పంపించండి' అని ఫోన్‌లో డిమాండ్ చేశారు. తొలుత రూ.10 వేలు పంపించిన సర్పంచి, కొద్దిరోజుల తరువాత వారిని అనుమానించి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సైబర్ నేరగాళ్లను పట్టుకున్నారు. నిందితులు తండ్రీ కొడుకు లని గుర్తించారు. కుమారుడు సినిమాలు తీయాలని మోజులో హైదరాబాద్‌లో ఉంటూ ఉన్న డబ్బు కాజేసుకొని ఇలా నేరాలకు పాల్పడుతున్నట్టు నిర్ధారించారు.



యూనియన్ బ్యాంక్ నుంచి వచ్చినట్లు చూపుతున్న ఫేక్ మెసేజ్

టంగుటూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇటీవల ఓ కంపెనీలో ఉద్యోగం మానేసి మరో కంపెనీలో చేరేందుకు ఇంటి దగ్గర ఉంటూ ప్రయత్నాలు చేస్తున్నాడు. అదే సమయంలో ఆన్‌లైన్‌లో ఓ యాప్ పట్ల ఆకర్షితుడయ్యాడు. వెయ్యి రూపాయలు పెట్టుబడి పెడితే రూ.1500 వచ్చాయి. ఇలా అత్యధికంగా నగదు వస్తుందని ఆశపడి రూ.23 లక్షలు పెట్టాడు. అతని అకౌంట్‌లో రూ.46 లక్షలు కనిపించాయి. అయితే డ్రా చేసుకునేందుకు రావడం లేదు. ఆదే యాప్‌కు సంబంధించిన ట్రోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాడు. మీరు సెబీకి ట్యాక్స్ చెల్లించాలని, అది చెల్లిస్తే మీఖాతాలో నగదు రిలీజ్ అవుతుందని చెప్పారు. దీంతో కొంత మొత్తం చెల్లించాడు. 'మీరు చెల్లించిన సొమ్ము సరిపోలేదు, మరికొంత వేయాలి' అని అవతల నుంచి సలహాఇచ్చారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు అనుమానం వచ్చింది. పోలీసులను ఆశ్రయించాడు.

కందుకూరుకు చెందిన భార్యభర్తలు ఇద్దరూ టీచర్లు. ఫేక్ యాప్‌కు ఆకర్షితులై అందులో పెట్టుబడి పెట్టారు. మీ పెట్టుబడి రెట్టింపు అవుతుందనే సరికి సుమారుగా రూ.90 లక్షలు పెట్టారు. అయితే పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాలేదు. దీంతో ఆ దంపతులు పోలీసులను ఆశ్రయించారు. ఇవేకాదు తాము ముంబై పోలీసులమనీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేటు నుంచి ఫోన్ చేస్తున్నామని సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేస్తున్నారు. జిల్లాలో ఈజీ మనీకి అలవాటుపడి కొందరు, అత్యాశకుపోయి మరికొందరు, అమాయకత్వంతో ఇంకొందరు ఈ నేరగాళ్ల వలలో పడి విలవిల్లాడుతున్నారు.


డిజిటల్ అరెస్టు ఉండదు

'చట్టంలో డిజిటల్ అరెస్టు వంటి ప్రక్రియ లేనేలేదు. ఇది నేరగాళ్ల ముఠా చేసే మోసం. ఏ ప్రభుత్వ సంస్థా మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేయదు. ఫోన్లు చేసి డబ్బులు చెల్లించాలని బెదిరించదు. ప్రశాంతంగా ఆలోచించండి. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దు. వీలైతే స్ర్కీన్ షాట్ తీసుకోండి. ఆ కాల్‌ను రికార్డు చేయండి. ప్రభుత్వ సంస్థలు ఎవరినీ బెదిరించవని గుర్తుంచుకోండి.

- సైబర్‌నేరాలపై 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ ఇటీవల చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలివి

● ఆరేళ్లలో 414 కేసులు నమోదు

జిల్లాలో గడిచిన ఆరేళ్లలో 414 సైబర్ క్రైం కేసులు నమోదు అయ్యాయి. దాదాపుగా రూ.15.29 కోట్లు సైబర్ నేరగాళ్లు లూటీ చేశారు. అందులో పోలీసులు రూ.6.23 లక్షలు మాత్రమే రికవరీ చేశారు. 2019లో 65 కేసులు నమోదు కాగా 2020లో 52, 2021లో 48, 2022లో 87, 2023లో 95, 2024 అక్టోబరు వరకు 65 కేసులు నమోదు అయ్యాయి.


నేరగాళ్లు కొట్టేసిన నగదు అకౌంట్‌ల వివరాలు

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకొని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. సామాన్యుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. వాట్సప్ లింక్‌లతో బ్యాంక్ అకౌంట్‌లలో నగదును లాగేస్తున్నారు. క్రిప్టోకరెన్సీ పేరుతో తొలుత తక్కువ డబ్బు ఎరగా వేసి లక్షల రూపాయలు దోచేస్తున్నారు. తాము సీఐడీ కార్యాలయం, డీజీపీ కార్యాలయం నుంచి కాల్ చేస్తున్నామని బెదిరించి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. ఇలా మోసపోయిన వారిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎక్కువ మంది ఉన్నారు. సైబర్ నేరాలపై జిల్లా పోలీసులు రోజూ అవగాహన కోసం వీడియోలు విడుదల చేస్తున్నారు. మోసపోయినవారు 1930కి కాల్ చేస్తే వెంటనే ఆన్‌లైన్‌లో కేసు నమోదు చేస్తారు. - ఒంగోలు క్రైం (ఆంధ్రజ్యోతి)

కొండపి నియోజకవర్గంలో ఇలా..

కొండపి, ఆంధ్రజ్యోతి : కొండపి మండలంలోని కె.ఉప్పలపాడు, జరుగుమల్లి మండలంలోని కామేపల్లి గ్రామాల్లో యూనియన్ బ్యాంకుల ఖాతాదారులకు పరిచయం ఉన్న వ్యక్తి నుంచి యూనియన్ బ్యాంకు లోగో ఉన్న లింక్ వస్తోంది. తెలిసిన వ్యక్తి కదా ఏదో విషయం తెలియజేస్తున్నాడని ఆ లింక్‌ను క్లిక్ చేయగానే డబ్బులు పోయాయి. కానీ నిజానికి నేరగాళ్లు ఆ లింక్‌లో బ్యాంకు సమాచారానికి సంబంధించి యూపీఐ నంబర్, ఏటీఎం కార్డులపై ఉండే నంబర్లు, ఓటీపీలు పంపించి ఆ సమాచారం అప్‌లోడ్ చేయిస్తున్నారు. ఆ తర్వాత అకౌంట్లలో డబ్బులు పోతున్నాయి. బాధితులు విషయం చెబితే ఎక్కడ పరువు పోతుందోనని తాము సమాచారం అప్‌లోడ్ చేసిన విషయాన్ని చెప్పడం లేదు. క్లిక్ చేసిన వెంటనే డబ్బులు పోయాయని మాత్రమే వాపోతున్నారు. కొండపిలోని యూనియన్ బ్యాంకులో పనిచేసే సిబ్బందిలో ఒకరు మన బ్యాంక్ లోగోనే కదా అని క్లిక్ చేసి వివరాలు అందించడంతో రూ.25 వేలు నేరగాళ్లు కొట్టేశారు. కామేపల్లి గ్రామానికి చెందిన వంకాయలపాటి రాజశేఖర్‌కు పచ్చవ గ్రామానికి చెందిన స్నేహితుడు పంపినట్లుగా యూనియన్ బ్యాంకు లోగోతో లింక్ రావడంతో సమాచారం అందించి రూ.2,35,000 పోగొట్టుకున్నాడు. ఇలా ఆయా బ్రాంచ్‌ల పరిధిలో అనేక మంది రైతులు డబ్బులు ఇటీవల పోగొట్టుకున్నారు.





ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరగాళ్లు ప్రజలను భయపెట్టి లక్షల రూపాయలు దోచేస్తున్నారు. ఇటీవల వాట్సప్ కాల్స్‌లో కోర్టు సీన్‌లు క్రియేట్ చేసి మీరు పలానా కేసులో నిందితులుగా ఉన్నారని చెప్పి బెదిరింపులకు పాల్పడుతున్నారు. వాట్సప్ కాల్స్‌లో ఎవ్వరినీ అరెస్టు చేయడం జరగదు. సీఐడీ, ఈడీ పేర్లతో వచ్చే ఫేక్ కాల్స్‌ని నమ్మొద్దు. మీరు పోర్న్ చూశారని, మీపై కేసు నమోదు అయిందని సైబర్ నేరగాళ్లు భయపెడుతున్నారు. ఇలాంటి వాటిని అస్సలు మ్మొద్దు. ఇన్‌స్ట్రాగ్రామ్, ఎక్స్, మెసెంజర్‌లలో తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ నగదు వస్తుందని చెప్పి మోసాలు చేస్తున్నారు. ఇలాంటి సైబర్ మోసగాళ్ల బారిన పడొద్దు.

- ఏఆర్ దామోదర్, ఎస్పీ



తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- తెలియని వారికి ఆధార్, పాన్‌కార్డు లాంటి వివరాలు చెప్పకూడదు.
- ఏపీకే లాంటి లింక్స్‌ను టచ్ చేయకూడదు.
- బ్యాంక్ అకౌంట్ నంబర్లు, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, సీవీవీ కార్డుల నంబర్లకు సంబంధించిన ఓటీపీ ఎవ్వరికీ చెప్పకూడదు.
- ఆన్‌లైన్‌లో పోలీసులు అరెస్టు చేశామని బెదిరిస్తే ఎవ్వరూ మోసపోకూడదు. ఆన్‌లైన్‌లో పోలీసులు అరెస్టు చేయరు.
- సోషల్ మీడియాలో తమ వ్యక్తిగత సమాచారం ఉంచకూడదు.
- బ్యాంక్ అకౌంట్‌లు, మొబైల్ ఫోన్‌లకు స్ట్రాంగ్ పాస్‌వార్డు పెట్టుకోవాలి.

కార్తీక దామోదర నమస్తుభ్యం


దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఆరంభమైన కార్తీకమాసం
దేవాలయాలలో ఆకాశదీపాలకు అంకురార్పణ
పలు దేవాలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు
దీపారాధనలో పాల్గొన్న మహిళలు

ఒంగోలు(కల్చరల్), నవంబరు 2(ఆంధ్రజ్యోతి):పరమేశ్వరుని ఆరాధనకు ఎంతో విశిష్టమైనదిగా చెప్పుకునే కార్తీకమాసం ప్రారంభం కావటంతో శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు, కార్తీక దీపారాధన వంటి కార్యక్రమాలలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్తీకమాసం ఆరంభం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని మణికేశ్వరం, భైరవకోన, త్రిపురాంతకం, మార్కాపురం వంటి ప్రదేశాలలో ఉన్న ప్రముఖ శివాలయాలతో పాటు గ్రామాలు, పట్టణాలలోని పలు శివాలయాలలో శనివారం ప్రత్యేక మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు జరిగాయి. అదేవిధంగా శనివారం తెల్లవారుజామునుంచే మహిళలు తమకు అందుబాటులో ఉన్న శివాలయంలో కార్తీక దీపాలను వెలిగించి కార్తీక దామోదరుని పూజలో పాల్గొన్నారు. ఇక ఒంగోలు నగరంలోని కేశవస్వామిపేట శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా శనివారం రాత్రి ఆకాశదీపాన్ని ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీకదీపారాధనలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.



ఆలయాల్లో మొదలైన అభిషేకాలు

అటు స్థానిక విజయదుర్గా దేవి దేవస్థానంలో పరమేశ్వరుని వాయులింగానికి భక్తులు స్వయంగా ఆవుపాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు జొన్నలగడ్డ వేదసాయి శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఇక స్థానిక కొత్తపట్నం బస్టాండు శ్రీ గంగా పార్వతీ సమేత రాజరాజేశ్వరి స్వామి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆమంచి మణికంఠ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన జరిగాయి. దేవస్థాన కార్య నిర్వహణాధికారి బోడపాటి శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. శ్రీగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి ఆకాశదీపాన్ని వెలిగించారు. నగరంలోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం, అంజయ్యరోడ్ పంచముఖ శివాలయం, అయ్యప్ప స్వామి దేవస్థానం, సంతపేట సాయిబాబా మందిరంలోని శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, లాయర్‌పేట సాయిబాబా మందిరంలోని శ్రీ మరకత శివాలయం మొదలైన పలు ఆలయాలలో సైతం కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి.


ఆకాశదీపాన్ని తిలకిస్తున్న మహిళా భక్తులు

సహకారంలో కలకలం

(5వ పేజీ తరువాయి)

తప్పించాలని, అలాగే బ్యాంకులో అక్రమాలపై సహకార శాఖ పరంగా సెక్షన్ 51 విచారణ చేయాలని ఆ శాఖ కమిషనర్, అప్కాబ్ ఎండీలను కోరుతూ గతనెల 21న కలెక్టర్ అన్సారియా ప్రత్యేకంగా లేఖ రాశారు. తదనుగుణ చర్యలు పైస్థాయి నుంచి లేకపోగా.. బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి అయిన జేసీకి కూడా ఆ లేఖ పంపాల్సి ఉన్నా జిల్లా సహకారశాఖ అధికారులు కలెక్టర్‌ను తప్పుదారి పట్టించారన్న విమర్శలు ఉన్నాయి.

విచారణ ఆపే ప్రయత్నాలు

'ఆంధ్రజ్యోతి కథనం'తో ఈ వ్యవహారం బయటకు రావడంతో సీఈవోను ఇక్కడి నుంచి తొలగించడం మాట ఎలా ఉన్నా బ్యాంకుపై సెక్షన్ 51 విచారణ వేస్తే అనేక అక్రమాలు వెలుగుచూసి ఇబ్బంది పడతామన్న ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమైంది. ఈక్రమంలో సెక్షన్ 51 విచారణకు ప్రభుత్వం ఆదేశించకుండా అడ్డుపడే ప్రయత్నాలు ప్రారంభించారు. బ్యాంకు వ్యవహారంలో భాగస్వామ్యం ఉండే ప్రస్తుతం జిల్లా సహకారశాఖలోని ఇద్దరు అధికారులు శనివారం ఉదయం తమకు అనుకూలంగా ఉండే పీడీసీసీబీ మెయిన్ బ్రాంచిలోని ఉద్యోగులతో మంతనాలు జరిపారు. అధికార పార్టీ కీలక నేత ద్వారా ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తే తప్ప 51 విచారణ ఆపడం సాధ్యం కాదని వారికి చెప్పారు. విచారణ కొనసాగితే బ్యాంకుపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుందని కనుక ఉద్యోగులు తదనుగుణ ప్రయత్నాలు చేపట్టాలని సూచించారు.

విచారణ జరగాల్సిందే : దామచర్ల

ఈనేపథ్యంలో కొందరు ఉద్యోగులు శనివారం మధ్యాహ్నం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిశారు. సెక్షన్ 51 విచారణ నిలుపుదల చేయాలని సహకారశాఖ అధికారులకు చెప్పాలని ఒత్తిడి తెచ్చారు. అయితే ఎమ్మెల్యే జనార్దన్ అందుకు తిరస్కరించారు. బ్యాంకులో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదులపై విచారణకు తాను కూడా సంబంధిత మంత్రికి గతంలో లేఖ రాశానని తెలిపారు. విచారణలో అన్ని విషయాలు బయటపడుతాయి కదా ఎందుకు వద్దంటున్నారని ప్రశ్నించడంతో వారు ఉసూరుమంటూ వెనుతిరిగారు. మరోవైపు బ్యాంకు ప్రస్తుత పాలకవర్గంగా ఉన్న ఉన్నతాధికారులు, ఆప్కాబ్, సహకార శాఖ కమిషరేట్‌లోని కొందరు అధికారులు కూడా పీడీసీసీ బ్యాంకులో ఏమి జరిగిందన్న దానిపై వివిధ మార్గాల్లో ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాలతో విచారణ చేపట్టిన విజిలెన్స్ విభాగం అధికారులు తమ విచారణను కొనసాగిస్తున్నట్లు సమాచారం.

గుంతలు లేని రోడ్లే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమాన్ని రూపొందించింది. శనివారం నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం అనకాపల్లి జిల్లాలో ప్రారంభించారు. తదనుగుణంగా అన్ని ప్రాంతాల్లో ప్రారంభమయ్యాయి. కాగా జిల్లాలో ఆర్‌అండ్‌బీ పరిధిలో రూ.13.76 కోట్లతో వంద పనులను ఈ కార్యక్రమం కింద చేపట్టారు.

జిల్లావ్యాప్తంగా పనుల ప్రారంభం

అధికారపార్టీ ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్యనేతలు, అధికారులు రోడ్ల పనులను శనివారం లాంఛనంగా ప్రారంభించారు. సంతనూతలపాడు మండలం మద్దులూరులో కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పాల్గొన్నారు. కనిగిరి పట్టణ పరిధిలోని శంఖవరంలో రోడ్డు మరమ్మతుల పనులను అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ప్రారంభించారు. కొమరోలు మండలంలో గిద్దలూరు శాసనసభ్యుడు ముత్తుముల అశోక్‌రెడ్డి పనులను ప్రారంభించగా దర్శి పట్టణంతోపాటు కురిచేడులలో దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి స్వయంగా పాల్గొని రోడ్డు రోలర్ నడిపారు. పుల్లలచెరువు మండలంలో టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే ఇతర ప్రాంతాల్లోనూ స్థానిక అధికారులు, అధికారపార్టీ కీలక నేతలు పాల్గొన్నారు. ఆర్‌అండ్‌బీలో మరో రూ.11 కోట్లతో 80 పనులు మంజూరు చేయనున్నారు. ప్రధానంగా రోడ్లపై గుంతలు పూడ్చడం, రోడ్డు పక్క మార్జిన్లు పటిష్టం, జంగిల్ క్లియరెన్స్, అత్యవసరమైన కల్వర్టుల నిర్మాణం తదితర పనులు ఈ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్నారు.

విశాఖలో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి

జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి విశాఖనగరంలో గుంతలు పూడ్చే కార్యక్రమంలో పాల్గొన్నారు. విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న స్వామి శనివారం అక్కడ పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలో విశాఖ నగరంలోని శిరిపురం జంక్షన్ వద్ద గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణతో కలిసి ప్రారంభించారు.

రైళ్లంటే కోపం.. అందుకే దాడి

(5వ పేజీ తరువాయి)

తిరుపతి నుంచి హైదరాబాద్ వెళుతున్న వందేభారత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌పై ఒంగోలు సూరారెడ్డిపాలెం మధ్యలో ఎవరో రాళ్లు వేశారు. సాయంత్రం 5.15 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీ2 బోగీ అద్దం పగిలింది. ప్రయాణికులెవ్వరికీ గాయాలు కాలేదు. దీంతో కేసు నమోదు చేసి విచారించిన అనంతరం రాళ్ల దాడి చేసింది ఒంగోలులోని ప్రగతినగర్‌కు చెందిన చప్పిడి ప్రవీణ్‌కుమార్‌గా గుర్తించామని సీఐ పేర్కొన్నారు. అతను గొర్రెలు కాచుకుంటూ వందేభారత్‌పై రాళ్లు విసరడం సీసీ పుటేజీలో కనిపించిందని తెలిపారు. దీంతో ప్రవీణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించి అరెస్టు చేశామన్నారు.

రైళ్లంటే ద్వేషం పెంచుకుని..

వందేభారత్ రైలుపై రాళ్లు రువ్వడానికి కారణం ఏమిటి అని విచారించిన పోలీసులకు నిందితుడు ప్రవీణ్‌కుమార్ ఆసక్తికరమైన విషయం తెలిపాడు. తనకు ఇద్దరు సోదరులు ఉన్నారని వారిరువురూ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ప్రేమ విఫలమైందని ఏడాది క్రితం ఒకరు, భార్య కాపురానికి రాలేదని మరొకరు వేర్వేరుగా రైలు కింద పడి మృతిచెందడంతో తనకు రైళ్లను చూస్తేనే కోపం అని తెలిపాడు.

పోలీసు శాఖలో బదిలీలు

(5వ పేజీ తరువాయి)

పనిచేస్తున్న వారు 230 మంది, ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న వారు 35మందితో కలిపి 265 మంది బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరు కానున్నారు.

నిబంధనలు ఇలా..

పోలీసు శాఖలో ఐదేళ్లు ఒకేచోట పనిచేస్తున్న వారికి స్థానచలనం తప్పదు.
సర్కిల్ ప్రాతిపదికగా బదిలీలు చేస్తారు
సొంత గ్రామం ఉన్న సర్కిల్‌కు అవకాశం లేదు.
ఒంగోలులో ఉన్న మూడు పోలీసు స్టేషన్‌లను కలిపి ఒక సర్కిల్‌గా పరిగణిస్తారు
ప్రస్తుతం ఒంగోలులో ఉన్న మూడు స్టేషన్లలో పనిచేస్తున్నవారు ట్రాఫిక్, సీసీఎస్, దిశ పోలీసు స్టేషన్‌లను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది.
ప్రస్తుతం పనిచేస్తున్న సర్కిల్ నుంచి మరో సర్కిల్‌కు బదిలీ చేస్తారు.
కౌన్సెలింగ్‌లో వారు కోరుకున్న ప్రాంతాల్లో ఖాళీ ఉంటేనే బదిలీ చేసే అవకాశం ఉంది.

రేషన్ పంపిణీ ప్రారంభం

● ఈసారి వాహనాల ద్వారా నాలుగు రకాల వస్తువుల అందజేత

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రేషన్ పంపిణీ ప్రారంభమైంది. ఈసారి కార్డుదారులకు నాలుగు రకాల వస్తువులను అందజేస్తున్నారు. ఇప్పటివరకు బియ్యంతోపాటు పంచదార మాత్రమే ఇస్తూ వచ్చారు. ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసర ధరలతో సామాన్య ప్రజానీకం ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు నెలకొంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టిసారించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ షాపుల ద్వారా ప్రజలకు ఏవిధంగా సరుకులు అందించారో అదేవిధంగా ఇప్పుడు కూడా ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లాకు అవసరమైన బియ్యంతోపాటు పంచదార, కందిపప్పు, జొన్నలను సరఫరా చేశారు. పౌరసరఫరాల శాఖ గోడౌన్ల నుంచి వాటిని రేషన్ షాపులకు తరలించారు. అక్కడి నుంచి ఎండీయూల(మొబైల్ వాహనాల) ద్వారా కార్డుదారులకు పంపిణీ చేసే ప్రక్రియను చేపట్టారు. ఒక్కో కార్డుదారునికి మూడు కిలోల జొన్నలను అందిస్తున్నారు. జొన్నలు తీసుకుంటే ఆమేకు బియ్యాన్ని మినహాయిస్తున్నారు. మరోవైపు బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధరలు చుక్కలు చూపిస్తుంటడంతో రేషన్ షాపుల ద్వారా తక్కువ ధరకే కేజీ ఇస్తున్నారు. దీంతో కార్డుదారులు రేషన్‌షాపుల ద్వారా ఇస్తున్న జొన్నలు, పంచదార, కందిపప్పును తీసుకుకునేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు.



మూగచింతల-ఏలూరు రోడ్డుకు మరమ్మతులు

కొండపి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'గుంతలు లేని రోడ్ల సాధనగా ప్రభుత్వం ముందడుగు' కార్యక్రమంలో భాగంగా మండలంలోని మూగచింతల-ఏలూరు రోడ్డు మరమ్మతులను శనివారం ప్రారంభించారు. 15 కిలోమీటర్ల మేర పనులు చేపట్టనున్నారు. అందుకోసం ప్రభుత్వం రూ.39 లక్షలు కేటాయించింది. పనుల ప్రారంభం సందర్భంగా కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని రోడ్లపై తట్టెడు మట్టి పోయలేదన్నారు.

ప్రధాన రహదారులతోపాటు గ్రామాల్లోని డొంక రోడను పూర్తిగా విస్మరించిందన్నారు. దీంతో గడచిన ఐదేళ్లు వాహనదారులు, ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నదన్నారు. ప్రాధాన్యతా క్రమంలో రోడ్లను బాగుచేసే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ ఆనందరావు, ఏఈ లక్ష్మీ దీప్తి, కామేపల్లి మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు, జరుగుమల్లి టీడీపీ నాయకుడు దగ్గుమాటి సుబ్బారెడ్డి, కొండపి మండల నాయకులు తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, చాగంరెడ్డి నరసారెడ్డి పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

కనిగిరిలో రోడ్ల విస్తరణ

- ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు
- ఆక్రమణల తొలగింపునకు ఉపక్రమించిన అధికారులు



నాగశిలలు ఉన్న ప్రదేశంలో కూరగాయల షెడ్డును తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

కనిగిరి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలో ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. అందులోభాగంగా శనివారం పట్టణంలోని బొడ్డుచావిడికి నాలుగువైపులా ఉన్న రోడ్లలో చేపట్టారు. బొడ్డుచావిడి నుంచి నగరికంటి బసవయ్యసెంటర్ వరకు, బొడ్డుచావిడి నుంచి రామాలయం వీధిలో ఆక్రమణలను తొలగించారు. అలాగే, బొడ్డుచావిడికి చుట్టూ ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న కూరగాయల దుకాణాలను తొలగించారు. ముందస్తుగా ఆయా వీధుల్లోని షాపుల యజమానులకు మున్సిపల్ అధికారులు తగు సూచనలు చేశారు. వారం రోజుల తర్వాత శనివారం ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. తొలుత ఆయా షాపుల యజమానులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు నచ్చజెప్పటంతో స్వచ్ఛందంగా రోడ్డు విస్తరణ పనులకు సహకరించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో సమస్య సద్దుమణిగింది. అయితే, బొడ్డుచావిడి నుంచి నగరికంటి బసవయ్య సెంటరు వరకు వెళ్ళే రోడ్డు మార్గంలోని కుడివైపున ఉన్న మూడు షాపుల యజమానులు అంగీకరించలేదు. దీంతో ఆయా షాపుల యూనియన్ నాయకులు, పెద్దమనుషులతో అధికారులు సంప్రదింపులు జరిపారు. పెద్ద మనుషుల సమక్షంలో వారు కూడా రోడ్డు విస్తరణ పనులకు సహకరిస్తామన్నారు. దీంతో శనివారం రెండు రోడ్లలోని డ్రైనేజీ కాలువలను, కాలువల పైకి వచ్చిన స్లాబ్‌లను తొలగించారు. ఆదివారం వ్యాపారస్థుల అభ్యర్థనను పరిగణలోకి తీసుకోవటంతో పాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఆక్రమణలు తొలగించనున్నారు. పట్టణం విస్తరించడంతో ట్రాఫిక్ రద్దీ మరింత పెరిగింది. బొడ్డుచావిడి, నగరికంటి బసవయ్య సెంటరు, తీగెలగొంది, పామూరు బస్టాండు సెంటరులో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు.



బొడ్డుచావిడి సమీపంలో బయల్పడిన నాగశిలలు

మూడు దశాబ్దాల తర్వాత బయల్పడిన నాగశిలలు

బొడ్డుచావిడి వద్ద పురాతన నాగశిలలు ఉన్నాయి. రెండు దశాబ్దాల క్రితం అక్కడ పూజలు చేసేవారు. కాలక్రమేణా నాగశిలలు ఉన్న స్థలాన్ని కొంతమంది ఆక్రమించి కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించటంతో నాగశిలలు బయటపడ్డాయి. కార్తీకమాసంలో ఇది శుభసూచకంగా ప్రజలు భావిస్తున్నారు.



దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే విజయ్‌కుమార్

జిల్లావ్యాప్తంగా రోడ్ల మరమ్మతులకు శ్రీకారం

కలెక్టర్ అన్సారియా

సంతనూతలపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గుంతలరహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా రోడ్ల మరమ్మతులకు శ్రీకారం చుట్టినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. జిల్లాలో ముందుగా మండలంలోని మద్దులూరు గ్రామంలో గుంతలరహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా రోడ్ల మరమ్మతులకు స్థానిక ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్‌తో కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో తొలివిడతగా అనకాపల్లిల్లో గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ప్రారంభించారని, ముఖ్యమంత్రి ఆదేశాలమేరకు రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిపారు. పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ రోడ్డు, జాతీయ రహదారులకు సంబంధించి ఎక్కడెక్కడ గుంతలు పడ్డాయో వాటికి బాగు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బి రోడ్లకు సంబంధించి 100 పనులకు సంబంధించి రూ.13కోట్లు మంజూరుచేసినట్లు తెలిపారు. అదేవిధంగా పంచాయతీ రోడ్లకు సంబంధించి రెండు నెలల కాలంలో మిషన్‌మోడ్‌లో మరమ్మతులు చేపట్టి పనులు పూర్తి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే బీఎస్ మాట్లాడుతూ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించినట్లు ప్రత్యేక కార్యక్రమం రూపొందించడం అభినందనీయమన్నారు. ఈక్రమంలోనే మద్దులూరులో దెబ్బతిన్న రోడ్లకు రూ.20లక్షల వ్యయంతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అదేవిధంగా చీమకుర్తిలో దెబ్బతిన్న రోడ్లకు రూ.1.10కోట్లతో పది రోజుల్లో మరమ్మతులు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ దేవానందం, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఈఈ గోపీనాయక్, సర్పంచ్ శైలజ, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి దోహదపడేలా నివేదికలు

ఒంగోలు(కలెక్టరేట్) నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టులు, వాటి స్థితిగతులు, ప్రభుత్వం నుంచి కావాల్సిన ఆర్థిక సహాయాన్ని తెలియజేసేలా డీఆర్సీ సమావేశానికి నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టర్ చాంబర్‌లో శనివారం ఈనెల 4న డీఆర్సీ సమావేశం జరగనున్న నేపథ్యంలో ఆయా అంశాలపై అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న శాఖల్లో జరుగుతున్న పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రధానంగా వెలిగొండ ప్రాజెక్టు పునరావాసం, జలజీవన్‌మిషన్, విత్తనాలు, ఎరువులు, ఇరిగేషన్ మరమ్మతులు, ఇతర నిర్మాణాలు, పెండింగ్ బిల్లులు, కొత్త ప్రతిపాదనలతో కూడిన వివరాలను సమగ్రంగా అజెండాలో పొందుపర్చాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో చిన్నఓబులేషు, సీపీవో వెంకటేశ్వర్లు, అధికారులు దేవానందం, అబూత్‌సలీం, వరలక్ష్మి, శ్రీనివాసరావు, గోపీచంద్, వీవీ.రమణ, డాక్టర్ సురేష్‌కుమార్, సూరిబాబు, ఉపేంద్ర, రాజశేఖర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.



పంచారామక్షేత్ర దర్శిని పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్ఎం

ఆర్టీసీ ఆధ్వర్యంలో పంచరామక్షేత్ర దర్శిని

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో ఒంగోలు నుంచి శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం బి.సుధాకర్‌బాబు శనివారం తెలిపారు. ఈనెల 3వ తేదీ, 10, 17, 24 తేదీలలో ఒంగోలు నుంచి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని పుణ్య క్షేత్రాల సందర్శనకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సులు పైన తెలిపిన తేదీలలో రాత్రి 8గంటలకు బయలుదేరుతాయని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిపో మేనేజరు శ్రీనివాసరావు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ప్రతి పౌర్ణమికి ఒంగోలు నుంచి తిరువణ్ణామలై (అరుణాచలం)కు ఒంగోలు నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం సుధాకర్‌బాబు తెలిపారు. కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా బస్సులు వెళతాయన్నారు. అరుణాచలం, భూతల కైలాసం, పరమేశ్వరుడి దివ్యరూపం సౌకర్యాలను ఆర్టీసీ కలిపిస్తుందని తెలిపారు. ఈ బస్సులు ఈనెల 3, 10, 17, 24 తేదీలలో బయలుదేరుతాయని చెప్పారు. ఈ ప్రత్యేక బస్సులలో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం ఏర్పాటు చేశామని, వివరాలకు సెల్ : 9959225704, 08592220733, 9959225695 ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.

బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం

- ఎమ్మెల్యే దామచర్ల
- రూ.3.7 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడేవారికి అండగా ఉండేందుకు, ఆపదలో ఉన్నవారికి చేయూత నిచ్చేందుకు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఆరుగురికి రూ.3,70,544ను ముఖ్యమంత్రి సహాయ నిధిని చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ పలు ఆర్థిక పరిస్థితులు లేక, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తుందన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చి పేదల ఆరోగ్యం కోసం పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రైవేటు వైద్యశాలలో వైద్యం పొందేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నవారికి సైతం సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుందని దామచర్ల తెలిపారు.



బాధితులకు సీఎంఎఫ్ఆర్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

అనంతరం కావూరి భాస్కర్‌రెడ్డి, కొణిదెల కోటేశ్వరి, కఠారి శ్రీనివాసులు, జల్లిపల్లి సుభాషిణి, దండూరి సునీత, మండవ గణేష్‌లకు మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ ఛైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మెట్లు ఎక్కలేక, చుట్టూ తిరిగి రాలేక పట్టాలు దాటి ప్లాట్‌ఫాం ఎక్కుతున్న మహిళలు



రైలు వస్తుండటంతో ప్లాట్‌ఫాం దిగి పట్టాలపై వస్తున్న ప్రయాణికులు

ప్రమాదం అని తెలిసినా..!

- ఫ్లాట్‌ఫాంపై ఫీట్లు



ప్రమాదకర స్థితిలో రెంటు ట్రాకులు దాటి ప్లాట్‌ఫాంపైకి ఎక్కి వస్తున్న ప్రయాణికులు

ప్రమాదం అని తెలుసు.. ఆదమరిస్తే అంతే అనే విషయమూ తెలుసు కానీ.. వెళ్ళాల్సిన గమ్యం చేరుకోవాలనే తొందరపాటు ప్రాణాలమీదకు తెస్తుంది. సురక్షితమైన ప్రయాణం శ్రేయస్కరమంటూ ఒకవైపు రైల్వే అధికారులు పదే పదే హెచ్చరిస్తున్నారు. కొందరి తొందరపాటు ప్రమాదాలకు కారణంగా కనిపిస్తున్నాయి. ఒంగోలులో రైల్వేస్టేషన్‌లో ప్రతి రోజు ఇలాంటి దృశ్యాలు సర్వసాధారణం అయ్యాయి. రైలు ఎక్కేందుకు, దిగేందుకు అందరూ కాకపోయిన కొందరు తొందరగా వెళ్ళాలనే ఆతృతతో పట్టాలు దాటి ప్లాట్‌ఫాం మీదకు రావడం మరింత దారుణంగా కనిపిస్తుంది. అందనంత ఎత్తులో ఉండే ప్లాట్‌ఫాంపై ఫీట్లు మానుకోవడం లేదు. యువకులే కాకుండా మహిళలు, బిడ్డలను చంకనేసుకుని మరీ పట్టాలు దాటే ప్రయత్నాలు చేస్తుండగా, మరోవైపు మగవారు చేతినిండా మోయలేని బరువు లగేజీతో పాట్లు పడుతున్నారు. ఒకవైపు ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నా, పదే పదే హెచ్చరికలు చేస్తున్నా పలువురు ప్రయాణికులు వ్యవహరిస్తున్న తీరుపై చూసేవారిలో ఆందోళన కనిపిస్తుంది. ఇప్పటికైనా రైల్వే అధికారులు ఇలాంటి వాటికి ఫుల్‌స్టాప్ పెట్టి ప్రమాదాలు నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

టంగుటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలకూరపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సింగరాయకొండ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 తన్నీరు బాలాజీ మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవలను కొనియాడారు. క్లబ్ అధ్యక్షుడు మాలే రంగారెడ్డి మాట్లాడుతూ బాలికల విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యదర్శి పంతగాని వెంకటేశ్వర్లు చైల్డ్‌లైన్, హెల్ప్‌లైన్ నంబర్లు : 1098, 100 గురించి తెలియజేశారు. హెచ్ఎం వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ కోశాధికారి నాగసూరి వెంకటసుబ్బారావు, డీకేడీ ప్రసాద్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం

- ప్రిన్సిపాల్‌కు అందజేసిన ఎన్ఆర్ఐ దంపతులు

టంగుటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరులోని పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి అయిన ఎన్ఆర్ఐ బెజవాడ శ్రీనివాసరావు, కోటేశ్వరమ్మ దంపతులు రూ.లక్ష విరాళం ప్రకటించారు. కళాశాల ప్రిన్సిపాల్ తొట్టెంపూడి చక్రపాణికి ఆ మొత్తాన్ని శనివారం అందించారు. ఈసందర్భంగా విద్యార్థులనుద్దేశించి శ్రీనివాసరావు మాట్లాడారు. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. అనంతరం కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎన్ఆర్ఐ శ్రీనివాసరావు దంపతులను అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

పొగాకుకు ప్రత్యామ్నాయంగా రైతులు ఇతర పంటల సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి జి.స్వర్ణలత సూచించారు. మండలంలోని ఎం.నిడమలూరు, పొందూరు, మర్లపాడు గ్రామాలలో శనివారం పంటల మార్పిడిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా స్వర్ణలత పలు సూచనలు చేశారు. ప్రస్తుతం పొగాకు పంట గిట్టుబాటుగా ఉందని రైతులు ఏటా అదే సాగు చేయడం వలన భూమి సారం తగ్గుతుందన్నారు. తెగుళ్లు, పురుగుల ఉధృతి ఎక్కువవుతుందన్నారు. అందుకే ప్రత్యామ్నాయంగా మినుము, శనగ పంటల సాగు చేయడం ద్వారా అధిక రాబడి పొందవచ్చన్నారు.

పరిశ్రమలు పెరగాలి..

- ఏపీ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డ్ ఛైర్మన్ కృష్ణయ్య
- చీమకుర్తి మైనింగ్ ప్రాంతంలో ఎమ్మెల్యే బీఎన్‌తో కలిసి పర్యటన
- క్వారీల్లో పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోకపోవటంపై అసంతృప్తి
- సమస్యలు పరిష్కరించాలని ఓనర్ల వినతులు

చీమకుర్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : వేల మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలు బాగా ఎదగాలని, అదే సమయంలో పర్యావణ పరిరక్షణకు పాటుపడటంలో రాజీ పడకూడదని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మన్ కృష్ణయ్య ఆకాంక్షించారు. ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌తో కలిసి ఆయన శనివారం చీమకుర్తి పరిసరప్రాంతాల్లో విస్తరించిన గ్రానైట్ క్వారీలను, ఫ్యాక్టరీలను పరిశీలించారు. ఎక్కువగా దుమ్ము, ధూళితో పరిసర ప్రాంతాలు ఉండటం, నిబంధనలకు విరుద్ధంగా డంప్‌ల వద్ద పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టకపోవటాన్ని గుర్తించారు. తదుపరి రామతీర్థం వద్ద ఉన్న వీటీసీలో సమావేశమయ్యారు. క్వారీ యజమానులు తప్పనిసరిగా కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాల్సిందేనని కృష్ణయ్య తెలిపారు. పరిశ్రమలు ఎదగటానికి అండగా ఉంటామని, కాలుష్య నివారణ విషయంలో రాజీపడబోమని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా గ్రానైట్ వ్యర్థాలు పడిఉండటాన్ని గమనించారు. దీనిపై ఫ్యాక్టరీ ఓనర్లు కృష్ణయ్యకు తమ వెతలు చెప్పుకున్నారు. స్లర్రీ డంపు చేయటానికి స్థలం కేటాయిస్తే వ్యర్థాల సమస్య తలెత్తదన్నారు. అదేవిదంగా ఈ స్లర్రితో బ్రిక్స్ తయారీకి గల మార్గాలపై పరిశీలిస్తామని, అలా తయారైన ఇటుకులను అమరావతి నిర్మాణానికి వినియోగించుకోవచ్చనే ఆలోచన చేశారు. జిల్లా ఖనిజ నిధులు ఉపయోగించి పరిశ్రమ విస్తరించిన ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఓనర్లు కృష్ణయ్యను కోరారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సహకారంతో అన్ని విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిశ్రమ ఎదుగుదలకు సహకారం అందజేస్తామని, అదేవిధంగా ఓనర్లందరూ కాలుష్యాన్ని నియంత్రించటానికి పటిష్ఠ చర్యలు చేపట్టాలని కోరారు. పలు అంశాలపై ఎమ్మెల్యే బీఎన్‌తో చర్చించారు. కార్యక్రమంలో ఓనర్లు అజీమ్, ఆర్‌పీ.రవి, చంద్రారెడ్డి, కాట్రగడ్డ రమణయ్య, మలినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వీటీసీలో ఓనర్లతో మాట్లాడుతున్న కృష్ణయ్య, పక్కన ఎమ్మెల్యే బీఎన్

బెల్టుషాపులు నిర్వహించే వారిపై రౌడీషీట్లు

కొండపి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కొండపి సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహించే వారిపై రౌడీషీట్లు తెరుస్తామని సీఐ సోమశేఖర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తుంటే ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు.

స్కూటీని ఢీకొట్టిన కారు

ఒంగోలుక్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో నిత్యం రద్దీగా ఉండే గాంధీరోడ్డులో శనివారం పార్కింగ్ చేసిన ఓ స్కూటీని కారు ఢీకొంది. దీంతో స్కూటీ యజమానురాలు కారును ఆపి డ్రైవింగ్ చేస్తున్న యువకుడిని కిందకు దిగాలంటూ చొక్కా పట్టుకుంది. అయితే అతను కారు దిగకుండా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు విచారిస్తున్నారు.


గోతులమయంగా మారిన గద్దలగుంట రోడ్డు


హైదరీక్లబ్ వద్ద ఏర్పడిన గోతులు


బాలాజీరావుపేట రోడ్డులో శనివారం గోతిలో ఇరుక్కున్న ఆటో చక్రం, పైకి లేపుతున్న యువకులు


గంటాపాలెం రోడ్డులో..

ప్రమాదాలకు 'దారులు'

గత ఐదేళ్ల వైసీపీ పాలకుల నిర్లక్ష్యం.. నేడు నగరానికి శాపం ● పట్టించుకోవాలని కోరుతున్న నగరవాసులు

ఒంగోలు నగరంలో ఏ వీధి చూసినా ఏమున్నది గర్వకారణం అన్న చందంగా మారింది. ప్రత్యేకించి గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో నెలకొన్న నిర్లక్ష్యం..నేడు నగరానికి శాపంగా మారింది. రహదారులు మరీ అధ్వానంగా మారాయి. గోతుల మయం. చినుకుపడితే చెరువులుగా మారుతున్న నగర రహదారులకు మోక్షం కల్పించాలని, పాడైన రోడ్లు, నిర్లక్ష్యానికి గురైన వాటిని గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా టీడీపీ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రహదారుల మరమ్మతుల పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం లాంఛనంగా ప్రారంభించగా, అదేక్రమంలో ఒంగోలులోనూ రోడ్లలోని గుంతలు పూడ్చే కార్యక్రమానికి శ్రీకారం పలికారు. బాలాజీరావుపేట, బండ్లమిట్ట, కొత్తపట్నం బస్టాండ్‌రోడ్, గద్దలగుంట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమీపంలో, కొప్పోలురోడ్, గంటాపాలెం ఇలా ఒకటేమిటి.. ఏ వీధిలో చూసినా రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు ఆయా రహదారుల్లో గుంతలు పూడ్చి ప్రమాదాలు నివారించాలని, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

ఇంట్లోకి చొరబడి దోపిడీ

● వృద్ధురాలి మెడలో బంగారం గొలుసు అపహరణ

ఒంగోలు క్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టపగలు ఇంట్లోకి చొరబడి వృద్ధురాలిపై దాడి చేసి నాలుగు సవర్ల బంగారం గొలుసు లాక్కెళ్లింది ఓ మహిళ. ఈ సంఘటన శనివారం మధ్యాహ్నం ఒంగోలు నగరం గాంధీనగర్ నాల్గోలైన్‌లో జరిగింది. వివరాల్లోకి వెళితే.. కామేపల్లి సుబ్బరత్నం అనే వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉంటుంది. అయితే ఓ మహిళ బురఖా వేసుకొని ఇంట్లోకి వచ్చింది. ఆ సమయంలో సుబ్బరత్నం నిద్రపోతోంది. దీంతో ఆమె మెడలో బంగారం గొలుసు లాగే ప్రయత్నం చేయగా అడ్డుకుంది. దీంతో వృద్ధురాలిని గట్టిగా కొట్టి గొలుసు లాక్కొని దుండగురాలు ఉడాయించింది. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు. బురఖా వేసుకొని దోపిడీకి పాల్పడిన మహిళను పోలీసులు గుర్తించారు. ఈమేరకు కేసు విచారణ చేస్తున్నారు.

చిరువ్యాపారిపై చేయి చేసుకున్న ట్రాఫిక్ ఏఎస్ఐ

ఒంగోలు క్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన చిరువ్యాపారం చేసుకునే చిరు వ్యాపారిపై ట్రాఫిక్ విధుల్లో ఉన్న ఏఎస్ఐ చేయి చేసుకున్నాడు. ఒంగోలు నగరం పాత గుంటూరురోడ్డులోని ఇస్లాంపేట వద్ద శనివారం ఈ సంఘటన జరిగింది. వివరాలలోకి వెళితే.. ఇస్లాంపేటలో కాలువలు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అడ్డుగా ఉన్నటైర్లు, ఇతర సామగ్రి తీసే క్రమంలో గాలి మిషన్ వద్ద టైర్లు అడ్డుగా ఉన్నాయి. అందుకు సంబంధించి చిరువ్యాపారి కరిముల్లా టైర్లు తీస్తుండగా ట్రాఫిక్ ఏఎస్ఐ వచ్చారు. మూడు రోజులుగా చెబుతున్నా టైర్లు ఎందుకు తీయలేదంటూ అతనిపై చేయిచేసుకున్నారు. దీంతో అక్కడ ఉన్న చిరువ్యాపారులు అంతా కలిసి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

7న మండల సమావేశం

మద్దిపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.జ్యోతి శనివారం తెలిపారు. ఎంపీపీ వాకా అరుణ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అధికారులు సమగ్రమైన నివేదికతో హాజరుకావాలని ఎంపీడీవో ఓ ప్రకటనలో కోరారు.

ఒడా చైర్మన్ పదవిని ముస్లింలకు ఇవ్వాలి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం కూటమి గెలుపు కోసం కష్టపడి పనిచేసిన ముస్లింలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో ముస్లింలకు స్థానం కల్పించలేదన్నారు. అయితే ఒడా చైర్మన్ పదవిని ముస్లింలకు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్ మహ్మద్ రఫీ, ప్రెసిడెంట్ జిలాని, కోశాధికారి షేక్ ఇంతియాజ్, నగర అధ్యక్షులు షేక్ రెహ్మాన్, పఠాన్ రెహ్మాన్, హుస్సేన్, అబ్దుల్లా కరిముల్లా పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో సెక్టోరల్ పోస్టు అభ్యర్థుల వివరాలు

ఒంగోలు విద్య, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఐదు సెక్టోరల్ పోస్టులు, ఒక అసిస్టెంట్ సెక్టోరల్ అధికారి పోస్టుకు దరఖాస్తు చేసిన వారి వివరాలు ప్రకాశం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు మొత్తం 58 మంది దరఖాస్తులు చేశారు. వీరి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన తర్వాత వారికి వచ్చిన మార్కులు, అర్హులు, అనర్హుల వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టామన్నారు. అభ్యర్థుల విద్యార్హతలు, సర్వీసు ఇతర వివరాలకు 85 మార్కులు, 15 మార్కులు ఇంటర్వ్యూలకు కేటాయించారు. ఈ మార్కులపై అభ్యంతరాలు ఉంటే తగు ఆధారాలతో ఆదివారం సాయంత్రంలోపు సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు.

పశుగణనకు సహకరించాలి : జేడీఏ


పశుగణనను పరిశీలిస్తున్న జేడీఏ బేబీరాణి

నాగులుప్పలపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన పశుగణనకు ప్రజలు సహకరించాలని పశుసంవర్ధకశాఖ జేడీఏ బేబీరాణి కోరారు. మండలంలోని ఉప్పుగుండూరు, చదలవాడ గ్రామాల్లో జరుగుతున్న పశుగణనను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో పశుగణన కార్యక్రమం పశువైద్యాధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పశుగణనలో భాగంగా ఎద్దులు, ఆవులు, గేదెలు, కుక్కలు, గుర్రాలు, గాడిదలు, మేకలు, గొర్రెలు ఇతరత్రా వివరాలు యాప్‌లో నమోదు చేస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం రూపకల్పన చేసే పశుగణాభివృద్ధి పథకాల రూపకల్పనలో ఈ వివరాలు ఉపకరిస్తాయని తెలిపారు. అందువల్ల పశుపోషకులు సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మేస్త్రీ వ్యవస్థ కొనసాగించాలి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో మేస్త్రీ వ్యవస్థను కొనసాగించాలని పలువురు కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఆవరణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదిహేను సంవత్సరాల నుంచి కొంతమంది ఎలాంటి రాజకీయ ప్రభావం లేకుండా జీవనం కోసం మేస్త్రీలుగా పనిచేస్తున్నారని చెప్పారు. అయితే ఇటీవల పలు రాజకీయ కారణాలతో మేస్త్రీలను తొలగించి కార్మికులుగా వెళ్ళాలని కార్పొరేషన్ అధికారులు ఆదేశించడం అన్యాయమన్నారు. అందులో భాగంగా అక్టోబరు నెలలో మస్టర్ వేయకుండా వేతనాలు నిలిపివేశారని చెప్పారు. అయితే దీనిపై అధికారులు దృష్టి సారించి, పదిహేను సంవత్సరాల నుంచి పనిచేస్తున్న మేస్త్రీలను కొనసాగించాలని, వారి కుటుంబాలు వీధినపడకుండా చూడాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహేష్, ఆదినారాయణ, శ్రీనివాసరెడ్డి, సీహెచ్.వెంకటేశ్వర్లు, నవీన్, గోపి, మనోహర్, వెంకట్రావు, రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మద్దిపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): త్రోవగుంటలోని ఆటోనగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. ఒంగోలు వైపు నుంచి ఆటో చీరాల వెళ్తుండగా బ్రేక్ ఫెయిలై అదుపు తప్పి మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో పర్చూరుకు చెందిన ఎస్‌కే.ఖాసింపీరాకు గాయాలు కాగా ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

మద్దిపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు నటరాజ కళా కేంద్రంలో ఆదివారం ఒంగోలు యామిని కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కంటి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు.

5న బండారు వర్ధంతి సభ

ఒంగోలు(కల్చరల్), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల నటులు బండారు రామారావు 48వ వర్ధంతి సభను ఈ నెల 5వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్థానిక నెల్లూరు బస్టాండ్ శ్రీరామ నాట్య మండలి ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు శ్రీపతి ప్రకాశం తెలిపారు. శనివారం స్థానిక అంబేద్కర్‌భవన్‌లో ఇందుకు సంబంధించి కరపత్రాన్ని సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి యాదాల రాజశేఖర్ మాట్లాడుతూ 2025వ సంవత్సరంలో బండారు రామారావు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయటానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ విగ్రహ ఏర్పాటుకు తనవంతు సహకారాన్ని అందజేస్తానని జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో నాయకులు కండే శ్రీనివాసరావు, ఉలిచి బాబూరావు, బత్తుల శేషయ్య, గడ్డం కృష్ణయ్య, బాబు పాల్గొన్నారు.

పేస్‌లో విదేశీ విద్యపై సదస్సు

ఒంగోలు విద్య, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శనివారం విదేశీవిద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్లోబల్ డిగ్రీస్ కన్సల్టెన్సీ ప్రతినిధి మినాకుమార్ విదేశీ విద్యకు కావాల్సిన అర్హతలు, అవకాశాలు, బ్యాంకు రుణాలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, కళాశాలకెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ రూప అక్కేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి డీఈఎల్ఈడీ పరీక్షలు

ఒంగోలు విద్య, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) మొదటి సంవత్సరం ఫెయిలైన విద్యార్థులకు సెకండ్ సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 4నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించి విద్యార్థుల హాల్ టిక్కెట్లను ప్రభుత్వ పరీక్షల బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మొదటి సంవత్సరం ఫెయిలైన వారు ఒంగోలు నగరం రామనగర్‌లోని మునిసిపల్ హైస్కూలు, దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మార్కాపురం జడ్పీ బాలుర హైస్కూలు, రెండో సెమిస్టర్ విద్యార్థులకు ఒంగోలు నగరం బండ్లమిట్టలోని ప్రభుత్వబాలికల హైస్కూలులో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉప కులాల అభివృద్ధి వర్గీకరణతో సాధ్యం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీలోని 59 ఉప కులాలు అభివృద్ధి చెందాలంటే వర్గీకరణే మార్గమని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ అన్నారు. విద్యార్థి యువజన జాగృతి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్‌భవనంలో శనివారం జరిగిన మాల, మాదిగ విద్యార్థి యువజన ఆత్మీయ సమావేశంలో ఆయన మటాడారు. రెబ్బవరపు ప్రేమ్‌కుమార్, బత్తుల సుబ్రహ్మణ్యంల అధ్యక్షతన జరిగిన సభలో జగదీష్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 59 ఉప కులాలకు 15శాతం రిజర్వేషన్ పంచుకొని 25శాతం రిజర్వేషన్ పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల ముఖ్యమంత్రులు వర్గీకరణ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ రిజర్వేషన్లు వల్ల మాల, మాదిగలు తప్ప ఉప కులాలకు న్యాయం జరగలేదన్నారు. రిజర్వేషన్ల షెడ్యూల్డ్ కులాల్లో అట్టడుగు వర్గాలకు అందినప్పుడు అంబేద్కర్ కలు కన్న రాజ్యాధికారం చేరువ అవుతుందన్నారు. కార్యక్రమంలో కొమ్ము రాజీవ్, పిల్లి మురళి, బత్తుల వెంకట్రావు, బండారు శేషగిరి, గంధం బెంజిమెన్, కరుణాకర్, కృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు

● మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు ధ్వజం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుపుతూ రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్.సుధాకర్‌బాబు ఆరోపించారు ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత సిలెండర్ల పేరుతో మహిళలను దారుణంగా మోసం చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రశాఖ ఆదేశాల మేరకే విధుల్లో చేరిక

● జిల్లా ఖజానాశాఖ అధికారి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఖజానా, లెక్కల సంచాలకులు ఇచ్చిన ఆదేశాల మేరకే సస్పెన్షన్‌లో ఉన్న అధికారులను విధుల్లోకి తీసుకున్నట్లు జిల్లా ఖజానా, లెక్కల అధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సస్పెన్షన్‌లో ఉన్న ఉప ఖజానాధికారి కె.భాగ్యలక్ష్మి, ఎగువశ్రేణి గణికులు పి.కోటిసుధీర పెండింగ్ విచారణ కింద తిరిగి విధుల్లోకి తీసుకుంటూ రాష్ట్రశాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆ ఆదేశాల మేరకు వారిని విధుల్లో తీసుకున్నామని, ఎవరి ప్రలోభాలకు, ఒత్తిడిలకు తలొగ్గలేదని పేర్కొన్నారు.

బీఎస్పీ నేత సంగీతరావు మృతి

చీమకుర్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్‌వాది పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు జగన్నాథం సంగీతరావు(95) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. చీమకుర్తి పట్టణంలోని ఆయన గృహంలో సంగీతరావు భౌతికకాయం వద్ద పలువురు ఘనంగా నివాళులర్పించారు.

ఘనంగా గోవర్ధన పూజ

ఒంగోలు(కల్చరల్), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో శనివారం ఉదయం గోవర్ధన పూజ ఘనంగా జరిగింది. శ్రీకృష్ణభగవానుడు తన చిటికెన వేలితో గోవర్ధన గిరిని ఎత్తిన పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ పూజా కార్యక్రమాన్ని స్థానిక మంగమూరు రోడ్డు శ్రీరాధా గోవింద ఆశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ అనంతరం గోవర్ధనునికి అన్నకూట మహోత్సవం కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో అళగిరి శ్రీనివాసు దాసుస్వామి, శ్రీదేవి మాతాజీ, సుదేవి మాతాజీ, జాహ్నవి మాతాజీ, భక్తులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలపై విచారణ

నాగులుప్పలపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా అనుమతులు లేకుండా ఉప్పుగుండూరులో టపాసులు విక్రయించడంపై ఆంధ్రజ్యోతిలో లైసెన్స్‌లు లేకుండానే టపాసులు విక్రయం అనే కథనం ప్రచురించడంతో శనివారం రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు స్పందించారు. ఎస్పీ ఆదేశాలతో అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసిన వ్యక్తులు, వారి వివరాలు నమోదు చేశారు.

రైస్ కళాశాలలో సదస్సు

ఒంగోలు క్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గత నెల 28 నుంచి ప్రారంభమైన విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కులశేఖర్ ఒంగోలులోని రైస్ కృష్ణసాయి కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిచారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. నగరంలోని ముఖ్యకూడళ్లలో బ్యానర్లు ఏర్పాటు చేయంచారు. అలాగే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కార్యలయం వద్ద ఆయన ప్రతిజ్ఞ చేయించారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభసభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 8 గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. పది గంటలకు స్థానిక కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నిర్వహించే జిల్లా సమీక్షా మండలి సమావేశానికి హాజరవుతారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

రేషన్ వాహనం పరిశీలన

సంతనూతలపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మద్దులూరు గ్రామంలో పంపిణీ చేస్తున్న రేషన్‌సరుకుల వాహనాన్ని శనివారం ఆర్డీవో లక్ష్మీప్రసన్న పరిశీలించారు. అనంతరం డీలర్, కార్డుదారులతో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రం తనిఖీ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక గద్దలగుంటలోని పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని రాష్ట్ర ఎన్‌వీబీడీసీపీ కన్సల్టెంట్ ఇకోండారెడ్డి శనివారం పరిశీలించారు. వైద్యశాలలో రికార్డులతో పాటు మందులను తనిఖీ చేశారు. అనంతరం ఇందిరాకాలనీలో డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ హాస్పటల్‌లోని ల్యాబ్‌ను, అక్కడ చేసిన టెస్టులను పరిశీలించారు. అనంతరం జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులతో సమావేశమై వెక్టార్ బార్న్ డీసీజెస్‌పై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి వెంకటరెడ్డి, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చుండూరి సుబ్బారావుకు నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎన్

సంతనూతలపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కొనగానివారిపాలెంలో శనివారం జరిగిన టీడీపీ నాయకుడు చుండూరి సుబ్బారావు పెదకర్మ కార్యక్రమానికి ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, ఎన్.ఆంజనేయులు, సీహెచ్.శ్రీనివాసరావు, ఎన్.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతతోనే అభివృద్ధి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమని వయోజన విద్యా ఉపసంచాలకులు పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాలులో శనివారం ఉల్లాస్ జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ వసుంధర, ఐసీడీఎస్ పీడీ మాధురి మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధించేలా చూడాలన్నారు. జీఎస్‌డబ్ల్యూఎస్ టి.ఉషారాణి, రిసోర్స్ పర్సన్లు రంజిత్‌బాబు, సురేఖ, సుబ్బారావు, ఆదిశేషులు శిక్షణ ఇచ్చారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

నాగులుప్పలపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పొగాకు సాగు చేసే రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని ఏడీఏ రమేష్‌బాబు సూచించారు. చేకూరపాడులో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనగ, మినుము, జొన్న, మొక్క జొన్న పంటలను సాగు చేసుకోవాలన్నారు. ఏవో వెంకట్రావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కనిగిరిలో రోడ్ల విస్తరణ

- ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

- ఆక్రమణల తొలగింపునకు ఉపక్రమించిన అధికారులు



నాగశిలలు ఉన్న ప్రదేశంలో ఎక్స్‌కవేటర్‌తో కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

కనిగిరి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలో ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. అందులోభాగంగా శనివారం పట్టణంలోని బొడ్డుచావిడికి నాలుగువైపులా ఉన్న రోడ్లలో చేపట్టారు. బొడ్డుచావిడి నుంచి నగరికంటి బసవయ్యసెంటర్ వరకు, బొడ్డుచావిడి నుంచి రామాలయం వీధిలో ఆక్రమణలను తొలగించారు. అలాగే, బొడ్డుచావిడికి చుట్టూ ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న కూరగాయల దుకాణాలను తొలగించారు. ముందస్తుగా ఆయా వీధుల్లోని షాపుల యజమానులకు మున్సిపల్ అధికారులు తగు సూచనలు చేశారు. వారం రోజుల తర్వాత శనివారం ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. తొలుత ఆయా షాపుల యజమానులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు నచ్చజెప్పటంతో స్వచ్ఛందంగా రోడ్డు విస్తరణ పనులకు సహకరించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో సమస్య సద్దుమణిగింది. అయితే, బొడ్డుచావిడి నుంచి నగరికంటి బసవయ్య సెంటరు వరకు వెళ్ళే రోడ్డు మార్గంలోని కుడివైపున ఉన్న మూడు షాపుల యజమానులు అంగీకరించలేదు. దీంతో ఆయా షాపుల యూనియన్ నాయకులు, పెద్దమనుషులతో అధికారులు సంప్రదింపులు జరిపారు. పెద్ద మనుషుల సమక్షంలో వారు కూడా రోడ్డు విస్తరణ పనులకు సహకరిస్తామన్నారు. దీంతో శనివారం రెండు రోడ్లలోని డ్రైనేజీ కాలువలను, కాలువల పైకి వచ్చిన స్లాబ్‌లను తొలగించారు. ఆదివారం వ్యాపారస్థుల అభ్యర్థనను పరిగణలోకి తీసుకోవటంతో పాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఆక్రమణలు తొలగించనున్నారు. పట్టణం విస్తరించడంతో ట్రాఫిక్ రద్దీ మరింత పెరిగింది. బొడ్డుచావిడి, నగరికంటి బసవయ్య సెంటరు, తీగెలగొంది, పామూరు బస్టాండు సెంటరులో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు.



బొడ్డుచావిడి సమీపంలో బయల్పడిన నాగశిలల వద్ద పూజ చేస్తున్న మహిళలు

బయల్పడిన నాగశిలలు

బొడ్డుచావిడి వద్ద పురాతన నాగశిలలు ఉన్నాయి. రెండు దశాబ్దాల క్రితం అక్కడ పూజలు చేసేవారు. కాలక్రమేణా నాగశిలలు ఉన్న స్థలాన్ని కొంతమంది ఆక్రమించి కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించటంతో నాగశిలలు బయటపడ్డాయి. కార్తీకమాసంలో ఇది శుభసూచకంగా ప్రజలు భావిస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలి

● జిల్లా గృహ నిర్మాణశాఖ ప్రధాన అధికారి శ్రీనివాసప్రసాద్



కాలనీలను పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారులు

గిద్దలూరు టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణంలో ఆగిపోయిన గృహాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని జిల్లా గృహ నిర్మాణశాఖ ప్రధాన అధికారి పెరుగు శ్రీనివాసప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం కింద నిర్మాణంలో ఉన్న కాలనీలను ఆయన పరిశీలించారు. నిర్మాణంలో ఆగిపోయిన అన్ని ఇళ్లను ఈ ఏడాది చివరిలోపు పూర్తి చేయాలన్నారు. ఆ తరువాత పూర్తి చేసినప్పటికీ వారికి బిల్లులు మంజూరు చేసే అవకాశం ఉండదన్నారు. మంజూరైన గృహాలకు నూతన యూనిట్ విలువ వర్తించదని, 1.80 లక్షలు మాత్రమే వర్తిస్తుందన్నారు. నిర్మాణాలకు అవసరమయ్యే స్టీల్, సిమెంటు, ఇసుక అందుబాటులో ఉందని, వాటిని ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. త్వరలో ప్రారంభం కానున్న పీఎంఏవై-2 గ్రామీణ పథకం గురించి సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్, హౌసింగ్ డీఈ కదీర్‌భాషా, ఆరు మండలాల ఏఈలు వర్క్ ఇన్స్‌పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

చిన్నదోర్నాలలో రెండు గృహాల్లో చోరీ
బంగారు వస్తువులు అపహరణ

పెద్దదోర్నాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నదోర్నాల గ్రామంలోని రెండు గృహాల్లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పొదిలి అనంతరాయుడు గృహం పసుపుల చినకోటేశ్వరరావు గృహంలో చోరీ చోటుచేసుకొంది. పొదిలి అనంతరాయుడు నూతనంగా కొత్త భవనం నిర్మించుకుని అక్కడ నిద్రిస్తున్నారు. పాత గృహంలో వస్తు సామగ్రి ఉంది. శనివారం ఉదయం పొదిలి అనంతరాయుడు పాత ఇంటి వద్దకు వచ్చాడు. ఇంటి తలుపుకున్న తాళం పగుల గొట్టి ఉండడం గమనించాడు. ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువా తాళం కూడా పగుల గొట్టి అందులోని బంగారు ఉంగరం, జత కమ్మలు అపహరించినట్లు గుర్తించాడు. బయటకు వచ్చి చూడగా ఎదురిల్లు పసుపుల చిన్నకోటేశ్వరరావు ఇంటికి కూడా తాళం పగలగొట్టి ఉన్నాయి. దీంతో ఇరుగుపొరుగు వారికి విషయం ఆయనకు చేరవేశారు. చిన్నకోటేశ్వరరావు కుటుంబం వివాహ వేడుకల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లింది. ఆయన బంధువులు ఆ ఇంటిలోని వెళ్లి పరిశీలించగా, బీరువా కూడా పగుల గొట్టి ఉంది. ఆ బీరువాలో బంగారు ఉంగరం, రెండు జతల మాటీలు, 2వెండి ఉంగరాలు ఉన్నట్లు బాధితుడు కోటేశ్వరరావు తెలిపాడు. చోరీపై దోర్నాల పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. ఎస్సై మహేశ్ పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచుతాం

● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ● కస్తూర్బా పాఠశాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కొమరోలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచుతామని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని శనివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సందర్శించి విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. పాఠశాలలో లెక్కలు, ఫిజిక్స్ ఉపాధ్యాయులు లేరని దీంతో తాము ఆయా సబ్జెక్టులో వెనుకబడ్డామన్నారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి ఉన్నాతాధికారులతో మాట్లాడారు వారంలోపు భర్తీ చేయిస్తామని అధికారులు తెలిపారన్నారు. పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారని ప్రత్యేకాధికారి మందా రోజ్ సులోచన తెలిపారు. కానీ విద్యార్థులకు క్రీడామైదానం సరిగా లేదని ఎమ్మెల్యేకు చెప్పడంతో ఎంపీడీవో మాట్లాడి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా క్రీడామైదానాన్ని అభివృద్ధి చేయిస్తామన్నారు. సోమవారం నుంచి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో వీధిలైట్లు సరిగాలేవని విద్యార్థులు, తెలిపారు. వెంటనే స్పందించి గ్రామ పంచాయతీ ద్వార లైట్స్‌నే వెంటనే వేయాలని కార్యాదర్శి తిరుమలరెడ్డిని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యాప్రమాణాలు పెంచేందుకు ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నామ న్నారు. కార్యాక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ అనిల్ కుమార్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి, నాయకులు గోడి ఓబుల్‌రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షులు పులకుర్తి వెంకటేశ్వర్లు, కాంట్రాక్టర్ వి.కృష్ణమోహన్‌రెడ్డి, బీసీ నాయకులు అనపా వీరశేఖర్, బిజ్జం రవీంద్రారెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ఆక్రమణదారులకు నోటీసులు

గిద్దలూరు టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జాతీయ రహ దారికి ఇరువైపులా రోడ్డును ఆక్రమించుకుని రేకులషెడ్లు, బంకులు ఏర్పాటు చేసిన వారికి తొలగించాలని నోటీసులను మున్సిపల్ అధికారులు జారీ చేశారు. గత కొంతకాలంగా జాతీయ రహదారికి ఇరువైపులా కాలవలు, రోడ్డుపై ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకోవడం ద్వారా వాహనదారులకు, పాదాచారు లకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, అంతేకాక కాలువలు శుభ్రం చేసే సమయంలో పారిశుధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందిన 7 రోజులలోపు ఆక్రమణలను తొలగించాలన్నారు.

రోడ్లపై ఆవులను వదిలితే చర్యలు

● అర్బన్ సీఐ సురేష్

గిద్దలూరు టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా పశుపోషకులు రోడ్లపైకి ఆవులను, గేదెలను వదిలితే చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ కె.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆవులను రోడ్లపైకి వదలడంతో అవి రోడ్లపై ఉండి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల వరకు వారికి సమయం ఇస్తున్నట్లు, ఆతరువాత రోడ్లపై పశువులు వస్తే గోశాలకు తరలిస్తామని తెలిపారు.





రూ.5 నాణెం మింగిన బాలుడు

గిద్దలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కొమరోలుకు చెందిన అబ్దుల్‌బాషా అనే వ్యక్తి కుమారుడు షేక్ తాజ్ (8) అనే బాలుడు నాణేలతో ఆడుకుంటూ పొరపాటున 5 రూపాయల నాణెం మింగాడు. గాలి ఆడక ఇబ్బంది పడుతుండగా గిద్దలూరులోని రామరత్న ఆసుపత్రికి తీసుకుని రాగా డాక్టర్ బి.వి.కిరణ్‌కుమార్ ఎండోస్కోపి సహాయంతో అన్నవాహికలో ఇరుక్కున్న 5 రూపాయల నాణెంను సురక్షితంగా బయటకు తీశాడు. దీంతో ఆ బాలుడికి ప్రాణాపాయం తప్పింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గిద్దలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ సైకిళు ఢీకొన్నాయి. ఒకరికి తీవ్రంగా గాయాలుకాగా ముగ్గురికి స్వల్పంగా గాయాలయ్యాయి.

పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి

గిద్దలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) :రాచర్ల మండలం అనుమలపల్లి గ్రామానికి చెందిన కిలారి పెద్దిరాజు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన బి.ఆదిరంగయ్య, ఆయన కుటుంబీకులు దాడి చేశారు. పెద్దిరాజుకు గాయాలు కాగా కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పాతకక్షల నేపథ్యంలో ఘర్షణ జరిగినట్లు తెలిసింది.

అనారోగ్యంతో మంగళకుంట సర్పంచ్ మృతి


శారద (ఫైల్)

తర్లుపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళకుంట గ్రామ సర్పంచ్ పిన్నిక శారద హైదరాబాద్ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతిచెందారు. ఈమె కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈమె భర్త పిన్నిక హరికుమార్ పోలీస్ అధికారిగా(ఐజీ)గా పనిచేసి నాలుగేళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. మంగళకుంట గ్రామ అభివృద్ధికి వీరు శాయశక్తుల కృషి చేస్తున్నారు. శారద మృతదేహాన్ని ఆదివారం మంగళకుంట గ్రామానికి తీసుకురానున్నట్లు బంధువులు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

తర్లుపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి వ్యక్తి మృతిచెందిన ఘటన తర్లుపాడు నుంచి మార్కాపురం వెళ్లే మార్గంలో సూరెపల్లి రైల్వేగేటు సమీపంలో చోటుచేసుకొంది. శనివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. రైల్వే ట్రాక్‌మెన్ మృతదేహాన్ని గుర్తించి తర్లుపాడు స్టేషన్ మాస్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఆయన నంద్యాల రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు తెల్లచొక్కా ధరించి ఉన్నట్లు ఈ వ్యక్తి ఏ ప్రాంతానికి చెందిన వారో తెలియాల్సి ఉంది. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చెరుకుని మృతదేహాన్ని మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు.

కారు-ద్విచక్ర వాహనం ఢీ - ఒకరు మృతి

కంభం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. ఈ ఘటన కంభం మండలం కందులాపురం కూడలిలో శనివారం చోటుచేసుకొంది. కంభం ఎస్సై నరసింహారావు కథనం ప్రకారం, మండలంలోని కందులాపురం గ్రామానికి చెందిన చేగిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి (65) ద్విచక్ర వాహనంపై కంభం వైపు వస్తున్నాడు. కంభం నుంచి మార్కాపురం వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు ఈశ్వర్‌రెడ్డిని చికిత్స కోసం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. ఈశ్వర్‌రెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాల్యమిత్రుడికి ఆర్థికసాయం

తర్లుపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తోటిమిత్రుడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో మిత్రబృందం ఆర్థిక సాయం చేసింది. 1996-97 తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి బ్యాచుకు చెందిన చెన్నారెడ్డిపల్లికి చెందిన గట్లా బాలకాశిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో నాటి బాల్య మిత్రులు జి.బాలకాశిరెడ్డికి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. మిత్రబృందం బాలకాశిరెడ్డికి ఆర్థిక సాయం అందించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి అభినందించారు. తోటిమిత్రుడు ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోవడమే మిత్రుల గొప్పతనం అన్నారు. కార్యక్రమంలో పలువురు మిత్రులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులో మద్యం సీసాల స్వాధీనం

పెద్ద దోర్నాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద బొమ్మలాపురం గ్రామంలో శుక్రవారం బెల్ట్‌షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. నిర్వాహకుల వద్ద నుంచి 21 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలు గ్రామానికి చెందిన తిరుపతమ్మ అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

పోస్టాఫీస్‌లో ప్రత్యేక ఆధార్ క్యాంప్

పొదిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం స్థానిక పోస్టాఫీస్ కార్యాలయంలో ప్రత్యేక ఆధార్ క్యాంప్ సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. అపార్ ప్రక్రియ వేగవంత చేయడానికి విద్యార్థులకు ఆధార్ సమస్యలు ఉన్నాయని అందకోసం ప్రత్యేక ఆధార్ ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. కనుక ఇబ్బందులు ఉన్న పాఠశాలల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్తీకమాస పూజలు ప్రారంభం

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● తెల్లవారుజాము నుంచే బారులు తీరిన భక్తులు ● అయ్యప్ప దీక్షలు తీసుకున్న పలువురు భక్తులు


మార్కాపురంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలో కార్తీక మాసం పూజలు శనివారం నుంచి భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జగదాంబసమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ఏలూరి అంజనేయశర్మ, రెంటచింతల వరుణ్‌తేజ శర్మలు మార్కండేశ్వర స్వామి, జగదాంబ మాతలకు ప్రత్యేక అలంకరణ, అర్చనలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచి స్వామి దర్శనానికి బారులుతీరారు. పూజలు చేసి నాగదేవతలకు పాలు పోసి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి నోములు నోచారు. పట్టణంలోని వివిధ ఆలయాలలో కార్తీక దీపాలు వెలిగించారు. మార్కండేశ్వర స్వామి ఆలయంలో ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

గిద్దలూరు : కార్తీకమాస పూజలు పలు దేవాలయాలలో ప్రారంభమయ్యాయి. కార్తీక మాసంలో తొలిరోజు అయిన శనివారం తెల్లవారుజాము నుంచే శివాలయాలకు భక్తులకు పోటెత్తారు. పట్టణంలోని శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవాలయంలో ముఖ్యంగా మహిళ భక్తులు కార్తీక దీపాలు వెలిగించి శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో కార్తీక మాస పూజలు ప్రారంభమయ్యాయి. శ్రీ కుసుమ హరనాథ మందిరంలో నెలరోజులపాటు జరిగే కార్తీక మాస ప్రత్యేక పూజలను మందిరం అధ్యక్షులు నటుకుల శ్రీనివాసులు ప్రారంభించారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం, షరాఫ్ బజారులోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గంగమ్మ, గౌరమ్మల ను ప్రతిష్ఠించారు. నెలరోజులపాటు గంగమ్మ, గౌరమ్మ లకు కుంకుమ పూజలు అనంతరం కార్తీక మాస చివరి రోజు నిమజ్జన కార్యక్రమం చేస్తామని దేవస్థాన కమిటీ ప్రతినిధులు తెలిపారు. కెఎస్‌పల్లి, పలుపులవీడు, పలు గ్రామాలలోని శివాలయాలలో కార్తీకమాస పూజలతో పాటు ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.

త్రిపురాంతకం : కార్తీకమాస పూజలు ప్రసిద్ధ పుణ్య క్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో శనివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం పూజలను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు భక్తులు అయ్యప్ప మాల ధరించారు. ఆలయ ప్రధానార్యకులు విశ్వన్నారాయణశాస్త్రి సాయంత్రం సమయంలో ప్రత్యేక పూజల అనంతరం రాత్రికి కార్తీక దీపాన్ని వెలిగించి ఆకాశదీపం ఏర్పాటు చేశారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులకు స్వామివారి ఆలయం వద్ద అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

కోలాహలంగా అయ్యప్ప దీక్షల స్వీకరణ

పొదిలి: అయ్యప్పస్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీకమాసం ప్రారంభం కావడంతో శనివారం స్థానిక అయ్యప్ప దేవాలయంలో భక్తులు కోలాహలంగా దీక్షలు స్వీకరించారు. శనివారం తెల్లవారుజామునుండే భక్తులు మాల వేసుకొని దీక్ష తీసుకొనేందుకు బారులు తీరారు. శనివారం 105 మంది దీక్ష తీసుకున్నట్లు పూజారి మురళీస్వామి తెలిపారు. ఇప్పటి వరకు 600లకుపైగా భక్తులు దీక్ష తీసుకు న్నారన్నారు. అదే విధంగా పార్వతీసమేత నిర్మామహేశ్వరస్వామి దేవాలయంలో కార్తీకమాసం ప్రారంభం రోజున మహిళలు దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు.


మార్కాపురంలోని మార్కండేశ్వర్య స్వామిని దర్శించుకుంటున్న భక్తులు, మార్కాండేశ్వరస్వామి, త్రిపురాంతకేశ్వరుడు, అయ్యప్ప దీక్ష తీసుకుంటున్న భక్తులు

వర్షపు నీరు వెళ్లే దారేది?

అడ్డగోలు వెంచర్ల ఏర్పాటుతో మూసుకుపోయిన నాళాలు


నీట మునిగిన జొన్న చేను

మార్కాపురం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రియల్ ఎస్టేట్ వ్యాపారుల స్వలాభం కోసం అడ్డగోలుగా ప్రైవేటు వెంచర్లను ఏర్పాటు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. స్థలాలు కొనాలనుకొనే అమాయక ప్రజలను మాయ యాటతో పాట్లు కట్టబెట్టేస్తున్నారు. అయితే వర్షపునీరు వెళ్లే మార్గం లేక పలు వెంచర్లు సముద్రాన్ని తలపిస్తున్నాయి.


జాతీయ రహదారి సమీపంలో నదిని తలపిస్తున్న వెంచర్

మార్కాపురంలోని బోడపాడు వెళ్లే దారిలో, జాతీయ రహదారి 565 సమీపంలో కొత్తగా వెంచర్లు వేశారు. ఈ ప్రాంతంలో భవిష్యత్తులో ఇంటి నిర్మాణాలు చేపట్టినా ఇళ్లు నీట మునిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిర్మాణాలు చేసిన వారు భవిష్యత్తులో ఎప్పుడైనా వర్షపు నీటితో ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు.

ఈ ప్రాంతంలో రైతులు సాగు చేసిన జొన్న పంట 15 రోజులుగా వర్షపు నీటిలోనే మునిగి పోయింది. 15 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు వర్షపు నీరు ఎటూ వెళ్లే మార్గంలేక పోవడంతో జొన్నపంటలో, ప్లాట్‌లలో నీరు నిలిచింది. దాదాపు పదిహేను రోజులుగా జొన్న పంట నీటి మునిగి ఉండటంతో పంట పూర్తిగా దెబ్బతింటోందని రైతు వాపోతున్నారు. సుమారు 15 రోజులుగా మార్కాపురం - బోడపాడు రోడ్డు జాతీయ రహదారికి ఆనుకొని వర్షపు నీరు నిల్వ ఉండటంతో రోడ్డు కుంగే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వర్షపు నీరు పోయే మార్గాన్ని చూపి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నీరు వెళ్లే మార్గాన్ని మూసేశారు

వర్షపు నీరు వెళ్లే మార్గాన్ని వెంచర్లు వేసి మూసి వేయడంతో వర్షపు నీరు ఎటూ వెళ్లే మార్గం లేకుండా పోయింది. దీంతో జొన్న పంట గత పదిహేను రోజులుగా నీటిలోనే మునిగి పోయింది. వర్షం ఆగిపోయి పదిహేను రోజులు గడుస్తున్నా నేటికి జొన్న చేలోనికి వెళ్లే పరిస్థితి కనిపించడంలేదు. సంబంధిత అధికారులు చొరవ చూపి వర్షపు నీటిని బయటకు పంపే మార్గం చూపించాలి.

గుర్రం వెంకటేశ్వర్లు, రైతు

వర్షపు నీరు వెళ్లే మార్గాన్ని ఏర్పాటు చేయాలి

గతంలో మాదిరిగా వర్షపు నీరు వెళ్లేందుకు మార్గాలు మూసుకుని పోవడంతో వెంచర్లలో పంట పొలాల్లో నీరు నిల్వ ఉంటోంది. భారీ వర్షాలు పడిపోయి సుమారు పదిహేను రోజులు కావస్తున్నా, ప్లాట్లు పంటపొలాలు నీటి కుంటలా మారిపోయాయి. నీరు నిల్వ ఉండడంతో రోడ్డు కుంగి పోయే ప్రమాదం ఉంది. పొలంలోకి దిగే అవకాశం కూడా రైతులకు కనిపించడంలేదు. వర్షపు నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండటం వలన ఈ ప్రాంత ంలో ఉండే వారికి, నివాసం ఉండే వారికి దోమల ప్రభావం అధికంగా ఉండి అనారోగ్యం భారిన పడే అవకాశం ఉంది. వీలైనంత త్వరగా సంబంధిత అధికారులు చొరవ చూపి వర్షపు నీరు బయటకు పంపే మార్గాలను చూపించాలి.

మారంరెడ్డి సత్యనారాయణరెడ్డి

మున్సిపాలిటీ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడం లేదు

విలేకర్ల సమావేశంలో డీఎస్పీ నాగరాజు వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొండేపల్లి రోడ్డులోని సర్వేనంబరు 343ఏలోని 224.79 చదరపు గజాల విస్తీర్ణంలోని మున్సిపాలిటికీ చెందిన స్థలంలో ఏ మతానికి సంబంధించిన నిర్మాణాలు చేపట్టడం లేదని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు తెలిపారు. స్థానిక ఎస్‌డీపీవో కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయన వివరాలు వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్ నారాయణ రావుతో కలిసి స్థలాన్ని పరిశీలించి హిందూ, ముస్లిం పెద్దలతో మాట్లాడామన్నారు. కొన్ని రోజులుగా అక్కడ ఏవో నిర్మాణాలు జరుగుతున్నాయని పుకార్లు వ్యాపించి పలు మతాలకు చెందిన వాళ్లు ఆందోళన చేస్తున్నారన్నారు. ఆ స్థలంలో ఏ విధమైన ప్రార్థనా మందిరాలు, ఇతర కట్టడాలు నిర్మించడం లేదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన నిర్మాణాలకు మాత్రమే అనుమతి ఇస్తామని మున్సిపల్ కమిషనర్ నారాయణరావు తెలిపారు. ప్రభుత్వేతర కార్యకలాపాలకు ఎలాంటి తావులేదని స్పష్టం చేశారు. పుర ప్రజలు ఎలాంటి ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని అన్నారు. విలేకరుల సమావేశంలో మార్కాపురం సీఐ పి.సుబ్బారావు, పట్టణ ఎస్సై సైదుబాబులు పాల్గొన్నారు.

స్వప్నికకు మాదిగ సంఘం నాయకుల సన్మానం


స్వప్నికను సన్మానిస్తున్న మాదిగ ఉద్యోగుల సంఘ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణానికి చెందిన కొండెపోగు స్వప్నిక అల్లికలలో గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించింది. దీంతో ఆమెను మాదిగ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సన్మానించారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యాక్షులు జీవరత్నం, పట్టణ శాఖ అధ్యక్షులు ఏలియా, కార్యదర్శి సంజీవరావు, కోశాధికారి ప్రసాద్, రాష్ట్ర సభ్యులు కుమార్, కాశీరావు, గౌరవ అధ్యక్షులు అనోజ్‌రావు, ఉపాధ్యక్షులు కొండయ్య, విశ్రాంత తహసీల్దార్ జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం


బహుమతులు అందజేస్తున్న మేనేజర్ కార్తీక్

పెద్దారవీడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ జాతీయ స్థాయిలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ నిర్వహించారు. ఈ వారోత్సవాలలో భాగంగా మండలంలోని హనుమాన్ జంక్షన్‌లోని ఆంధ్రప్రగతి బ్యాంక్ ఆధ్వర్యంలో ఓబులక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'కరప్షన్ ఫ్రీ ఇండియా' అనే అంశంపై క్విజ్ నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలైన విద్యార్థులకు శనివారం బ్యాంక్ మేనేజర్ కార్తీక్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు ఎం.కోటేశ్వరరావు, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ ధనకిశోర్, బ్యాంక్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

పొదిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పృదులపురి గ్రామంలో వెలసిన(పొదిలి) శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకస్వాములు దీవి శ్రీకాంత్ బట్టర్, మురళీకృష్ణమా చార్యులు, రుషికేశవాచార్యులు తెలిపారు. నేటి నుంచి 9వతేదీ వరకు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చకస్వాములు తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థును పరీక్షిస్తున్న వైద్యులు

పెద్ద దోర్నాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా గురుకుల ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. చింతల వైద్యాధికారి యగ్నీక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్తపరీక్షలు, పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలని, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టిసారించండి

● ఎంపీడీవో శోభన్‌బాబు సూచన

పొదిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పారిశుద్యం మెరుగుపరిచేందుకు గ్రామాల్లో అధికారులు దృష్టి సారించాలని, ఎంపీడీవో శోభన్‌బాబు కోరారు. పారిశుద్య కార్యక్రమాల్లో భాగంగా పలు గ్రామాలను సందర్శించి కార్యక్రమాలను చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామస్థుల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు, వాతావరణంలో మార్పులకు విషజ్వరాలు వచ్చే ప్రమదం ఉందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో కార్యదర్శి శేషగిరి ఉప్పలపాడు గ్రామం మొత్తం ఎక్స్‌కవేటర్ సాయంతో సైడుకాలువలు, ప్రధాన రహదారికి ఇరువైపుల ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించారు. ఉప్పలపాడు పంచాయతీలోని గోగినేనివారిపాలెం గ్రామంలో కూడా పారిశుద్య పనులు చేపట్టి మురుగునీరు పారేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి శేషగిరి చెప్పారు. కనుక ప్రతి ఒక్కరు చొరవతీసుకొని ప్రతి గ్రామంలో పారిశుద్యం కుంటుపడకుండా చూడాలని ఎంపీడీవో కోరారు.

గుంతలు లేని రోడ్ల ఏర్పాటుకు కృషి

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి


తర్లుపాడులో పనులు ప్రారంభిస్తున్న రామిరెడ్డి

కొమరోలు, నవంబరు2(ఆంధ్రజ్యోతి): గిద్దలూరు నియోజకవర్గం పరిధిలో గుంతలు లేని రోడ్ల ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో గుంతలనూ పూడ్చేందుకు రూ.3.14కోట్లు మంజూరయ్యాయన్నారు. మండలంలోని గిద్దలూరు నుంచి రాజుపాలెం వరకు రోడ్ల మరమ్మతులు నిర్వహించేందుకు 'మిషన్ పాట్ హోల్ ఫ్రీ' కార్యక్రమాన్ని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు రెండు కళ్లవంటివన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని స్మరించి, రోడ్లపై ఒక తట్ట మట్టిని పోసి ఒక గుంటను పూడ్చిన పాపానపోలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా రోడ్లు గుంతలతో దర్శనమిస్తున్నాయన్నారు. కొమరోలు మండలంలోని తాటిచర్ల మోటు నుంచి తిమ్మారెడ్డిపల్లి వరకు, కొమరోలు నుంచి రెడ్డిచర్ల వరకు, కొమరోలు నుంచి గిద్దలూరు, కొమరోలు నుంచి చింతలపల్లి రోడ్డులోని సుమారు 32కిలోమీటర్లు దూరంలో రూ.42లక్షలతో గుంతలు పూడ్చి రోడ్డును వేయనున్నామని చెప్పారు. అదేవిధంగా మహిళలను ఉచిత గ్యాస్ అందజేస్తు న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ అనిల్ కుమార్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి, నాయ కులు గోడి ఓబుల్‌రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షులు పులకుర్తి వెంకటేశ్వర్లు, కాంట్రాక్టర్ వి క్రిష్ణమోహన్‌రెడ్డి, బీసీ నాయకులు అనపా వీరశేఖర్, బిజ్జం రవీంద్రారెడ్డి, బాలిరెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు : గుంతలు లేని నియోజకవర్గంగా వైపాలెంను తీర్చి దిదద్దమే తన లక్ష్యం అని వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. శనివారం పుల్లలచెరువు మండలంలోని ఐటివరంలో గుంతలేని రోడ్లు కార్యక్రమంలో భాగంగా రోడ్డు మరమత్తుల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతముగా తీర్చిదిద్దేందుకు రూ.15 కోట్లతో సీసీ రోడ్డులు మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. వైపాలెం నియోజకవర్గంలో రోడ్డు గుంతలు పూడ్చేందుకు రూ.1.46 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని అన్నారు. గ్రామాల్లో ఉపాధి పనుల ద్వారా అభివృద్ధి పనులు, పండ్ల తోటల పెంపకం చేపట్టి రైతులకు చేయూత నివ్వాలని అన్నారు. గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేసి ప్రభుత్వానికి చంద్రబాబునాయుడికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. మాటలతో కాకుండా చేతల్లో పనులు చేసి రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. నియోజవర్గంలోని ప్రాధాన్యత కలిగిన ప్రతి రోడ్డుకు త్వరలోనే శాశ్వతంగా పనులు చేపట్టి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వసంతరావు నాయక్, టీడీపీ మండలాధ్యక్షులు పయ్యావుల ప్రసాద్,టీడీపీ మండల నాయకులు కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి,జనసేన మండలాధ్యక్షుడు కోటారి అచ్చయ్య, పోట్ల గోవిందు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తర్లుపాడు : ఇటీవల కురిసిన వర్షాలకు గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రోడ్లన్ని గుంతల మయంగా మారాయి. ఈ గుంతలను పూడ్చి ప్రజలకు సౌకర్యాలు అందించడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి అన్నారు. మండలంలోని గానుగపెంటలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని రామిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలన్ని నిర్వీర్యం అయ్యాయని, రోడ్ల మరమ్మతుల గురించి పట్టించుకోకపోవడంతో అస్థవ్యస్తంగా మారాయన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో 2025 జనవరి చివరిలోపు మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ తర్లుపాడు మండలంలో రూ.1.35కోట్లతో గుంతలు పూడ్చేందుకు నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, కౌన్సిలర్ నాలి కొండయ్య, మాలపాటి వెంకటరెడ్డి, చలువాది వెంకటేశ్వర్లు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న అశోక్‌రెడ్డి

ముఖాముఖి

సీసీ కెమెరాల ద్వారా నేరాల అడ్డుకట్టకు చర్యలు

వై.నాగరాజు, ఎస్‌ఐ, ముండ్లమూరు



ప్రశ్న: మండలంలో నేరాల అదుపునకు ఎలాంటి చర్యలు చేపట్టారు?

జవాబు: మండలంలో చిన్నపాటి నేరం కూడా జరగకుండా ఉండేందుకు ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలతో ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. అందులోభాగంగా పసుపుగల్లు, ముండ్లమూరు, పెదఉల్లగల్లు, శంకరాపురం, మారెళ్ళ ఈదర గ్రామాల్లో ఏర్పాటుచేశాం.

ప్ర: ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి, ఏ విధంగా నివారిస్తారు?

జ: ప్రతిరోజు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నాం. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ ఉండేవిధంగా చూస్తున్నాం, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి మందుబాబులపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నాం. మారెళ్ల, తమ్మలూరు వద్ద, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం వద్ద మలుపు, కల్లంపల్లి వద్ద మలుపు, వేముల మలుపులు వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించాం. త్వరలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తాం

ప్ర: మండలంలోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫారాల చోరీ ఎక్కువయ్యాయి?

జ: మండలంలో ట్రాన్స్‌ఫారాల చోరీలు ఎక్కువైన మాట వాస్తవమే. ఇటీవల దొంగలను పట్టుకొని కోర్టులో హాజరుపర్చాం.

ప్ర: మండలంలో బెల్టుషాపులు విచ్చలవిడిగా ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి, ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: మండలంలో నాలుగు ప్రభుత్వ షాపులు ఉన్నాయి. ఎక్కడా కూడా బెల్టు షాపులు నిర్వహించకుండా ప్రతిరోజు తమ సిబ్బందితో పరిశీలించి చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: చిన్నారి ఆరుష్‌రెడ్డి అదృశ్యం కేసు కొలిక్కి వచ్చేనా?

జ: మండలంలోని రెడ్డినగర్ గ్రామానికి చెందిన మేడం ఆరుష్‌రెడ్డి అనే చిన్నారి అదృశ్యం కేసులో పల కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం. సాధ్యమైనంత త్వరలోనే నిందితులను గుర్తించి కిడ్నాప్ మిస్టరీని ఛేదిస్తాం.



భైరవకోనలోని త్రిముఖ దుర్గాంబమాత

నేటి నుంచి అఖండజ్యోతి ఉత్సవాలు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పర్యాటక శైవక్షేత్రమైన భైరవకోనలో త్రిముఖ దుర్గాంబ భక్త కమిటీ ఆధ్వర్యంలో కార్తీకమాస అఖండజ్యోతి ఉత్సవాలు ఆదివారం నుంచి 30వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు దుగ్గిరాల కోటయ్యస్వామి తెలిపారు. ఈ కార్యక్రమాలు దేవస్థాన ఈవో డి.వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యామసుందరరాజు ఆధ్వర్యంలో జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

గుంతల రోడ్లు.. గత పాలకుల పాపమే!

- తట్ట మట్టిపోసింది లేదు!
- కూటమి ప్రభుత్వంలో మరమ్మతులు
- నరకయాతన నుంచి ప్రజలకు విముక్తి
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకుల అసమర్థతతోనే రోడ్లు అధ్వానంగా మారాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజమెత్తారు. గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం దర్శి గడియారస్తంభం సెంటర్‌లో రోడ్ల మరమ్మతులను ఆమె ప్రారంభించారు. రోడ్లపై పడిన గుంతలలో స్వయంగా మట్టి పోశారు. ఎక్స్‌కవేటర్‌తో చదును చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలో వైసీపీ ప్రభుత్వం తట్ట మట్టిపోసిన పాపానపోలేదన్నారు. రోడ్లన్నీ గుంతలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చే జనవరిలోగా పూర్తిగా మరమ్మతులు చేసి గుంతలరహిత రాష్ట్రంగా అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. దర్శి నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులకు తొలివిడతగా రూ.2కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. రెండో విడతగా రూ.3.5 కోట్లు విడుదలవుతాయని చెప్పారు. నిర్ణీత సమయంలో రోడ్ల మరమ్మతులను పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, దర్శి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కెచంద్రశేఖర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సూచించారు. గడియారస్తంభం సెంటర్‌లో ట్రాఫిక్ రద్దీని గుర్తించి పోలీసులతో చర్చించారు. అన్నీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రామారావు, ఎస్సై మురళీ, తదితరులు పాల్గొన్నారు.



దర్శి గడియారస్తంభం సెంటర్‌లో గుంతలు పూడ్చే కార్యక్రమం ప్రారంభిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

త్వరలో గుంతలులేని రోడ్లు

కురిచేడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో గుంతలు లేని రోడ్లను త్వరలో చూస్తారని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శనివారం కురిచేడు - పొట్లపాడు రోడ్డులో గుంతలను పూడ్చే కార్యక్రమం చేపట్టారు. రో డ్డుపై ఏర్పడిన గుంతలలో కంకర, తారువేసి రోలర్‌తో తిప్పి పూడ్చారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమలో డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వం రోడ్లు బాగు చేసేందుకు తట్ట మట్టి కూడా పోయలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి ఎంతో శ్రమిస్తున్నారన్నారు. సంక్రాంతి నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాపారావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, టీడీపీ మండల అధ్యక్షుడు పిడతల నెమిలయ్య, కాట్రాజు నాగరాజు, మొఘల్ మస్తాన్ వలి, మేరువ పెద్దిరెడ్డి, నాగిరెడ్డి, గడ్డం బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో రోడ్లన్నీ అస్తవ్యస్తం

కనిగిరి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన రోడ్డు రవాణా ఏర్పాటుచేయటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని శంఖవరం రోడ్డులో గుంతలకు శనివారం తాత్కాలిక (ప్యాచ్ వర్క్) పనులు చేపట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయన్నారు. ఐదేళ్ళ వైసీపీ పాలనలో ప్రజలు నరకం చవిచూశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగైదు నెలలు అయినప్పటికీ ప్రజల ఇబ్బందులు దృష్ట్యా యుద్ధప్రాతిపదికన ప్యాచ్ వర్క్ పనులు చేపట్టినట్టు చెప్పారు. అందులోభాగంగా కనిగిరి నియోజకవర్గ పరిధిలోని ఆర్‌అండ్‌బీ రోడ్ల పనులకు రూ1.05 కోట్లు ప్రభుత్వం కేటాయించి విడుదల చేసినట్లు తెలిపారు. వీటితో పనులు చేస్తుండగానే అనతికాలంలోనే మరికొన్ని నిధులు విడుదల కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ సమర్పణరావు, డీఈ షఫీ, జేఈ ఫిరోజ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



శంఖవరం రోడ్డులో తారువేసి కంకరు వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

- రూ.3.25 లక్షలు అవకతవకలు జరిగినట్టు గుర్తింపు

దర్శి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ జి.జోసఫ్ స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలో గత ఏడాది 1437 పనులకు రూ.17,36,49,924 ఖర్చు చేశారు. గత అక్టోబరు 14 నుంచి నవంబరు 1వ తేది వరకు తనిఖీ బృందాలు గ్రామాల్లో పనులను పరిశీలన చేసి నివేదికలు సమర్పించారు. తనిఖీ బృందాలు అందించిన నివేదిక ప్రకారం రూ.3,25,610 తేడా ఉన్నట్లు గుర్తించారు. అనేకచోట్ల కొలతల్లో తేడా, మస్టర్లల్లో తేడా ఉన్నట్లు నివేదికలు ఇచ్చారు.

ప్రధానంగా వెంకటచలంపల్లి, రాజంపల్లి, రామచంద్రాపురం, సామంతపూడి తదితర గ్రామాల్లో ఎక్కువగా అక్రమాలు జరిగినట్లు తనిఖీ బృందాలు ఇచ్చిన నివేదికల్లో పేర్కొన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ తేడాలను గుర్తించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ జోసఫ్ మాట్లాడుతూ తనిఖీ బృందాలు ఇచ్చిన నివేదికల ప్రకారం లెక్కల్లో తేడా వచ్చిన మొత్తాన్ని రికవరీ చేయటంతో పాటు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీ రాణి, అంబుడ్స్‌మెన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ జి.సుధారాణి, ఎంపీడీవో కృష్ణమూర్తి, ఏపీవో కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్ తదితరులు

నిఘా నీడలో పీసీపల్లి

- నేరాల నియంత్రణకు పోలీసుల ప్రత్యేక చర్యలు
- గ్రామ కూడళ్లు, ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాల ఏర్పాటు

పీసీపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు పీసీపల్లి పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎస్పీ దామోదర్ సూచనల మేరకు మండలంలోని ప్రధా న రహదారులు, గ్రామల్లోని ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. వీటిని ఉపయోగించుకుని నేరాల నియంత్రణకు పీసీపల్లి పోలీసులు కట్టుదిట్ట చర్యలు చేపడుతున్నారు. కనిగిరి సీఐ షేక్ ఖాజావలి పర్యవేక్షణలో పీసీపల్లి ఎస్సై జి.కోటయ్య మండల కేంద్రమైన పీసీపల్లి ప్రధాన కూడ లి అయిన బ్యాంకుసెంటరులో ఒకటి, ప్రభుత్వ వైద్యశాల సెంటరులో ఒకటి, పెదయిర్లపాడు బ స్టాండు సెంటరులో ఒకటి, హైస్కూల్ సమీపంలో ఒకటి డిజిటల్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. గతంలో ఉన్న సీసీ కెమెరాల్లో కేవలం వీడియో ఫుటేజీ మాత్రమే వచ్చేది. ఇప్పుడు కొత్తగా బిగించిన సీసీ కెమెరాలలో వీడియోతో పాటు వాయిస్‌ను కూడా రికార్డు చేస్తాయని ఎస్సై కోటయ్య తెలిపారు. వాహనాల నెంబర్లను సైతం క్షుణ్ణంగా తీస్తుందని ఆయన చెప్పారు. ఈ కెమెరాలను స్టేషన్‌లోని ప్రత్యేకగదిలో మానిటర్ ఏర్పాటుచేసి దానికి అనుసంధానం చేసిన పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఈసందర్భంగా ఎస్సై కోటయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సేఫ్టీ 2013చట్టం ప్రకారం వంద మందికంటే ఎక్కు వ జనసంచారం ఉండే వ్యాపార సముదాయాలు, రెస్టారెంట్లు, హోటల్స్, టీస్టాల్స్ పెట్రోల్ బంకులు, మద్యం షాపులు తదితర ప్రదేశాలలో ఆయా సంస్థల యజమానులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.



సీసీ కెమెరా పనితీరును పరిశీలిస్తున్న ఎస్సై కోటయ్య

'ప్రజాపోరు'ను జయప్రదం చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్

సీఎస్‌పురం (పామూరు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఈనెల 8 నుంచి 15వ తేది వరకు సీపీఎం ఆధ్వర్యంలో జరిగే ప్రజాపోరు కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసరాల వస్తువుల ధరలు ఆకాశానంటాయన్నారు. దాంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టడంలోనూ వైఫల్యం చెందిందన్నారు. నూతన మద్యం పాలసీ ద్వారా మద్యాన్ని నియంత్రించాల్సిందిపోయి ఏరులై పారిస్తున్నారని ఆరోపించారు. ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు ఇచ్చి పేదల ఇళ్లలో కాంతులు నింపామంటునే ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.20 వేల కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపి వారి జీవితాల్లో చీకట్లను నింపే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

వెలిగొండ నిర్వాసితులకు తక్షణమే పునరవాస నిధులు మంజూరు చేయాలన్నారు. జమిలి ఎన్నికలను అడ్డుకోవాలని, తదితర సమస్యలపై ఈనెల 15న జిల్లా కలెక్టరేట్‌ల వద్ద జరిగే ధర్నా కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీఎస్‌పురం, పామూరు మండల కార్యదర్శులు వెంకటేశ్వర్లు, కొమ్మలపాటి మాల్యాద్రి, ఎం.రత్నారెడ్డి, బి.ఏసుదాసు, ఊసా రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్

వైభవంగా కార్తీకమాస పూజలు

కనిగిరి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా శనివారం మహిళలు భక్తిశ్రద్ధలతో పూజల నిర్వహించారు. వేకువ జామునుంచే కనిగిరి పట్టణంలోని వివిధ దేవాలయాల్లో మహిళలు దీపారాధనలు చేసి పూజలు ప్రారంభించారు. పట్టణంలోని కొండదిగువ శివాలయంలో మహిళలు స్వామి వారిని దర్శించుకున్నారు. 108 శివలింగాల వద్ద, ఆలయ ప్రాంగణంలో ప్రమిదలతో దీపాలు వెలిగించారు. బాబా మందిరంలోని నాగశిలల వద్ద భక్తులు పూజలు చేసి దీపారాధన చేశారు. గార్లపేట రోడ్డులోని దొంతులమ్మ దేవస్థానం, శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి దీపాలు వెలిగించి దూప, దీప నైవేద్యాలు సమర్పించారు.

పామూరులో..

పామూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీమాసం ప్రారంభం కావడంతో శైవ క్షేత్రాలన్నీ శివనామస్మరణంతో మారుమ్రోగుతున్నాయి. శివాలయాల్లో కార్తీక శోభ సంతరించుకొంది. పట్టణంలోని శీపార్వతి సమేతశ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం కార్తీక మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో భక్తులు దీపాలు వెలిగించి స్వామివార్లను దర్శించుకొన్నారు. ఈసందర్భంగా మహాశివునికి అర్చకులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా, మండలంలోని పడమరకట్టకిందపల్లి, దాదిరెడ్డిపల్లి, బొట్లగూడూరు, మోపాడు గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక మాసం పూజలు ప్రారంభమయ్యాయి.



కనిగిరి: బాబా మందిరంలో నాగశిలలకు పూజలు చేసి దీపాలు వెలిగిస్తున్న మహిళా భక్తులు

అవీ ఇవీ



స్వాధీనం చేసుకున్న బియ్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

రేషన్ దుకాణంపై కేసు నమోదు

కురిచేడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని 12వ నంబరు రేషన్ దుకాణంలో ఉండవలసిన సరుకులు కంటే ఎక్కువగా ఉన్నాయని గుర్తించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కేసు నమోదు చేశారు. ఒంగోలు-1 ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి, దర్శి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ప్రసన్నలు శుక్రవారం సాయంత్రం రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. దుకాణంలో ఉండవలసిన సరుకులు కన్నా అధికంగా ఉన్నట్లు గుర్తించారు. 51 కేజీల బియ్యం, రెండు కేజీల జొన్నలు, 21 ప్యాకెట్ల కందిపప్పు, 31 కేజీల పంచదార అధికంగా ఉన్నట్లు గుర్తించారు. 6ఏ కేసు నమోదు చేసినట్లు డీటీ రాజ్యలక్ష్మి తెలిపారు. దుకాణంలో ఉన్న సరుకును కురిచేడు వీఆర్వో నాగరాజుకు స్వాధీనం చేశారు.

బ్రహ్మంగారి ఆలయంలో హుండీ చోరీ

కురిచేడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగదొనకొండ గ్రామంలో గల బ్రహ్మంగారి దేవాలయంలో హుండీని శుక్రవారం రాత్రి దొంగలు తీసుకెళ్ళి సొమ్ము తీసుకెళ్లారు. గత మూడు సంవత్సరాలుగా హుండీలో సొమ్మును ఆలయ కమిటీవారు లెక్కించలేదు. ఆలయ అర్చనలకు, ఆరాధనలకు హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఆర్థిక వనరులు సమకూరుస్తున్నారు. దీంతో హుండీలోని సొమ్ము అవసరం లేకపోవడంతో హుండీని గత మూడేళ్ళుగా తెరవలేదు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ తలుపులకు ఉన్న తాళం పగులకొట్టి హుండీని ఆలయానికి దూరంగా పొలాల్లోకి తీసుకెళ్లారు. హుండీ తాళం పగులకొట్టి అందులోని నగదును అపహరించారు. సుమారు రూ.60 వేలకు పైగా హుండీలో సొమ్ము ఉండవచ్చునని గ్రామస్థులు అంటున్నారు. ఎస్‌ఐ శివ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

దొనకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కుటుంబంలో మృతిచెందిన వారిని స్మరించుకునే సమాధుల పండుగ వేడుకలను దొనకొండలో శనివారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ కుటుంబాలకు చెందిన వారు గత రెండు రోజులుగా శ్మశానంలో మృతి చెందిన వారికి నిర్మించిన సమాధులను శుభ్రంచేసి అలంకరించారు. ఆర్సీఎం, సీఎస్ఐ, లూతరన్ చర్చీలకు సంబంధించిన పాస్టర్లు ప్రతి సమాధిని సందర్శించి కుటుంబసభ్యులతో కలిసి ప్రార్థనలు చేశారు.

పొగాకుకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలి

తాళ్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పొగాకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు రైతులకు సూచించారు. విఠలాపురం గ్రామంలో శనివారం పొగాకు సాగు నియంత్రణపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పొగాకు సాగుకు బదులు అపరాలు, చిరుధాన్యాలు సాగు చేయాలన్నారు. వాటి సాగువల్ల ఖర్చు తగ్గి అధిక దిగుబడులు పొందవచ్చునని చెప్పారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్గించారు. కార్యక్రమంలో వీఏఏ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలి

పామూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ విలువ ప్రకారం తమ భూములకు నష్ట పరిహారం ఇప్పించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలంటూ పలువురు బాధితులు శనివారం పనులను అడ్డుకుంటున్నారు. సింగరాయకొండ - మైదుకూరు 167-బి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పామూరులోని ఉత్తరబైపాస్ ఎన్‌హెచ్ 565, జంక్షన్‌లో 167కలిసే రహదారి నిర్మణంలో పలువురు తమ భూములను కోల్పోతున్నారు. ఆ ప్రాంతంలో రిజిస్ట్రేషన్ ప్రకారం ఎకరా భూమి విలువ రూ.కోటి 35లక్షల ఉందని బాధితులు పేర్కొన్నారు.

అయితే, జాతీయ రహదారి కాంట్రాక్టర్లు మాత్రం రూ.8 లక్షలు ఇస్తామంటున్నారని తెలిపారు. ముందుగా రోడ్డు నిర్మాణం కోసం గ్రావెల్ పరుస్తామని ఆ తరువాత నష్టపరిహారం చెల్లిస్తామని చెబుతున్నారని తెలిపారు. లేదంటే కేసులు నమోదు చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణ పనుల్లో భూములు కోల్పోతున్న ఎ.పెదనారాయణ, చప్పిడి మాలకొండరాయుడు, పరుచూరి మాల్యాద్రి చలం, సుర్తినేని మస్తానయ్య, ఏలూరి రంగారావు, కె.ఆదినారాయణ తదితరులు రైతులు హైవే పనులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకొన్న ఎంఆర్‌ఐ బి.మల్లి కార్జునరావు సంఘటనా స్థలానికి చేరుకొని పనులు జరిగేలా సహకరించకపోతే కేసులు పెడతామని హెచ్చరించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి భూములు, ప్లాట్లు కోల్పోతున్న బాధితులకు మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

పామూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సభ్యత్వాలు నమోదు చేశారు.

అనంతరం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్‌ఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా మాజీ కార్యదర్శి కె.ప్రభాకర్, నాయకులు తాహిద్, శశిధర్, సిద్దూ పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ బహూకరణ

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గంటిమడుగు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రుద్రరాజు మహేష్‌రాజు కంప్యూటర్, ప్రింటర్‌ను శనివారం బహూకరించారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఏ.సురేష్, ఉపాధ్యాయులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా వెంకటకృష్ణారెడ్డి

తాళ్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ దర్శి నియోజకవర్గ సమన్వయకర్తగా తాళ్లూరు మండలం విఠలాపురం గ్రామానికి చెందిన కైపు వెంకట కృష్ణారెడ్డిని నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృష్ణారెడ్డి గత ఎన్నికల ముందునుంచి విస్తృత స్థాయిలో కృషి చేశారు. నియోజకవర్గంలో వెంకట కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని గుర్తించి సమన్వయకర్తగా నియమించారు. ఈసందర్భంగా వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనకు కీలక పదవి ఇచ్చిన షర్మిలారెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు, డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదాకు కృతజ్ఞతలు తెలిపారు.



కైపు వెంకట కృష్ణారెడ్డి

నేడు యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ సీఎస్‌పురం మండల కౌన్సిల్ సమావేశం ఆదివారం స్థానిక వడ్డిపాలెంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరుగుతుందని అధ్యక్ష, కార్యదర్శులు జె.వెంక ట్రావు, షేక్ పాదుషా, జిల్లా కార్యదర్శి ఆరియారం సురేష్ తెలిపారు. సమావేశంలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.





- జీతం రూ.13200.. కటింగ్ రూ.9400
- హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాల్లో కోతలే కోతలు
- గగ్గోలు పెడుతున్న వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు
- నవంబరు నుంచి మిగిలిన సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ లింకు

సోలార్ కార్యాలయాల్లో.. కాంతులు

సోలార్ పవర్.. సూర్యుడి వెలుగులను వృథా కానీయకుండా కరెంట్ ఉత్పత్తి. తద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వినియోగదారులపై బిల్లుల భారం తగ్గుతుంది. ఈ క్రమంలో సోలార్ పవర్ ద్వారా కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు ప్రభుత్వం కూడా సిద్ధమైంది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు కూడా సోలార్ పవర్‌ను సద్వినియోగం చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇందుకు సంబంధించి ఎన్‌టీపీసీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసి వాటి నిర్వహణ బాధ్యతను ఎన్‌టీపీసీకి అప్పగించింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 260 ప్రభుత్వ కార్యాలయాల్లో ఇక నుంచి సోలార్ కాంతులు ప్రసరించనున్నాయి. తద్వారా ప్రభుత్వానికి ఏడాదికి రూ.50 కోట్ల వరకు విద్యుత్ బిల్లుల భారం తగ్గనున్నది.



- నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో సోలరైజేషన్
- నిర్వహణకు ఎన్‌టీపీసీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం
- ఏడాదికి లక్ష యూనిట్లు వచ్చే కార్యాలయాలకు ప్రాధాన్యం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 260 కార్యాలయాల్లో ప్యానల్స్ ఏర్పాటు
- ఏడాదికి సుమారు రూ.50 కోట్లకుపైగా తగ్గనున్న విద్యుత్ బిల్లుల భారం
- సోలరైజేషన్ వల్ల వాయు కాలుష్యం పూర్తిగా తగ్గుతుందంటున్న అధికారులు

- (గుంటూరు సిటీ - ఆంధ్రజ్యోతి)


- ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి గతంలో నెలకు రూ.30 లక్షల వరకు కరెంటు బిల్లు వచ్చేది. ఇప్పుడు అది రూ.3 లక్షలకు పరిమితమైంది. కారణం ఏమిటంటే అక్కడ 2 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్స్ అమర్చారు.
- గుంటూరు నగరానికి తాగునీటిని అందించే సంగం జాగర్లమూడి పంపు హౌస్ వద్ద 500 కిలో వాట్ సామర్థ్యం కలిగిన ఫ్లోటింగ్ సోలార్ అమర్చారు. అప్పటి నుంచి విద్యుత్ బిల్లు తగ్గింది.
- గుంటూరు కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయం, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి తదితర ప్రధాన కార్యాలయాలకు గతంలో రూ.వేలల్లో కరెంటు బిల్లులు వచ్చేవి. ఆయా కార్యాలయాలకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆ కార్యాలయాలకు గణనీయంగా విద్యుత్ బిల్లులు ఆదా అవుతున్నాయి.

పలు ప్రభుత్వ కార్యాలయాలకు నెలనెలా రూ.వేలల్లో కరెంటు బిల్లులు వచ్చేవి. వాటిని కట్టడం ఆయా కార్యాలయాలకు గగనంగా మారుతుంది. ఇప్పటికీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో ట్రాన్స్‌కోకు ఉన్న పెండింగ్ బిల్లుల్లో ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల వాటానే అధికం. కొన్ని సందర్భాల్లో కరెంటు బిల్లులు కట్టలేదని ట్రాన్స్‌కో అధికారులు ఆయా కార్యాలయాలకు విద్యుత్ ఫీజులు తీసిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం విద్యుత్ బిల్లుల భారం తగ్గించడంపై దృష్టి సారించింది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు ఆంధ్రప్రదేశ్ నూతన మరియు పునరుద్ధరణ ఇందన వనరుల అభివృద్ధి సంస్థ(నెడ్ క్యాప్) ఆధ్వర్యంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి సొమ్మును ఆదా చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ భవనాల సోలరైజేషన్‌కు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కొన్ని కార్యాలయాలకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి వినియోగిస్తుంది. ఆయా కార్యాలయాలకు గణనీయంగా విద్యుత్ బిల్లులు తగ్గిపోయాయి.

ఎన్‌టీపీసీదే మొత్తం బాధ్యత

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముక్త బిజిలీ యోజన కింద ప్రభుత్వ కార్యాలయాల సోలరైజేషన్‌కు శ్రీకారం చుడుతున్నది. ఈ క్రమంలో ఈ బాధ్యతను ప్రభుత్వం ఎన్‌టీపీసీకి అప్పగించింది. రెస్కో సిస్టంలో ఎన్‌టీపీసీ ఈ బాధ్యతను నిర్వర్తిస్తుంది. ఏడాదికి లక్ష యూనిట్లు విద్యుత్ వినియోగించే ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి వాటి నిర్వహణ బాధ్యత 25 ఏళ్ల వరకు ఎన్‌టీపీసీ చూసుకుంటుంది. ప్యానల్స్ ఏర్పాటు మొత్తం ఖర్చును ఎన్‌టీపీసీ భరిస్తుంది. అందుకు ప్రతిగా ప్రభుత్వ శాఖల నుంచి అతితక్కువ విద్యుత్ చార్జీలను వసూలు చేస్తుంది. ఉదాహరణకు ప్రస్తుతం యూనిట్ చార్జి రూ.4 వరకు ఉంటే, సోలరైజేషన్ తర్వాత ఎన్‌టీపీసీ యూనిట్ చార్జి రూ.2 మాత్రమే తీసుకునేలా ప్రభుత్వంతో ఒప్పందం జరిగింది. సోలరైజేషన్‌కు మొదట ఏడాదికి లక్ష యూనిట్లు విద్యుత్ వాడుతున్న ప్రభుత్వ కార్యాలయాలను ఎంపిక చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 260 ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నట్లు నెడ్ క్యాప్ తేల్చింది. గుంటూరు సమీపంలోనే ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వాడకం ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఒక్కొక్క కార్యాలయం, స్థానిక సంస్థలకు నెలనెలా లక్షల్లో కరెంట్ బిల్లు వస్తుంది. సోలరైజేషన్ జరిగితే ఆ భారం చాలా వరకు తగ్గుతుంది. ప్రస్తుతం గుంటూరుకు తాగునీరు అందించే సంగంజాగర్లమూడి పంపు హౌస్‌కు ఫ్లోటింగ్ సోలార్(నీటిపై) ప్యానల్స్ ఏర్పాటు చేశారు. దానివల్ల ఆ పరిసర ప్రాంతాల్లో కాలుష్యం బాగా తగ్గినట్లు తేలింది. సోలార్ పని తీరును తెలియజేసే యాప్‌లో 2023 డిసెంబరులో సంగంజాగర్లమూడి పంపు హౌస్‌కు ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటు చేయడం వల్ల ఇప్పటి వరకు 169.8 టన్నుల కార్బన్‌డయాక్సైడ్ ఉత్పత్తి తగ్గిందని, 169.8 టన్నుల బొగ్గు ఆదా అయినట్లు నిర్ధారణ అయ్యింది. ప్రభుత్వ కార్యాలయాల సోలరైజేషన్ వల్ల వాయు కాలుష్యం పూర్తిగా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. బొగ్గు నిల్వలు పెరుగుతాయని, ప్రభుత్వంపై విద్యుత్ భారం తగ్గుతుందంటున్నారు.

అద్భుతమైన పరిష్కారం



విద్యుత్ సమస్యను అధిగమించేందుకు సోలార్ విద్యుత్ అద్భుతమైన పరిష్కారం. సోలరైజేషన్ వల్ల ప్రభుత్వ సొమ్ము చాలా వరకు ఆదా అవుతుంది. గృహాలకు కూడా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రభుత్వం గరిష్ఠంగా రూ.78వేల వరకు ఒక్కొక్కరికి సబ్సిడీ ఇస్తుంది.

- ఉడుముల బ్రహ్మరెడ్డి, పీడీ, నెడ్ క్యాప్



రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం

హాజరు లింకు.. జీతం కోత

గుంటూరు సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆ ఉద్యోగులకు పని కాదు.. హాజరు ముఖ్యం అంట. హాజరు ఆధారం గానే వారికి జీతం ఇస్తారంట. ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం) పేరుతో ఉద్యోగులకు భారీగా జీతాల్లో కోత పడుతుంది. దీంతో ఆయా ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నా అధికారులు ఆలకించడంలేదు. నేషనల్ హెల్త్ మిషన్‌లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు అక్టోబరు నెల జీతంలో భారీగా కోత పడింది. గుంటూరు జిల్లా పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటిజెంట్ వర్కర్‌గా పనిచేసే ప్రత్తిపాటి పద్మ జీతం రూ.13200 కాగా ఎఫ్ఆర్ఎస్ పేరుతో అక్టోబరు జీతంలో రూ.9400 కోత విధించారు. గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న 70 మంది రెండో ఏఎన్ఎంలకు నెలకు రూ.23 వేలు జీతం కాగా వారిలో ఎక్కువ మందికి రూ.6 వేలు చొప్పున కోత విధించారు. ఇక డాక్టర్లు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు జీతాల్లో కూడా కోత పడినట్లు సమాచారం. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు కొంతమంది ప్రతి రోజు ముఖ ఆధారిత హాజరు వేసినా అది డేటా బేస్‌కు వెళ్లక పోవడంతో గైర్హాజరుగా చూపిస్తున్నట్లు చెబుతున్నారు. ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న అన్ని స్థాయిల్లోని ఉద్యోగులకు ఇక మీదట ఎఫ్ఆర్ఎస్ ఆధారంగానే జీతాలు చెల్లింపు జరుగుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఎఫ్ఆర్ఎస్‌కు సంబంధించి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. నవంబరు నుంచే ఎఫ్ఆర్ఎస్ ఆధారంగా జీతాల చెల్లింపులు జరుగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అక్టోబర్ నెలలో ఇదే ఉత్తర్వులను నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు అమలు పరిచారు. ఇప్పుడు వైద్య, ఆరోగ్య శాఖలో మిగిలిన ఉద్యోగులకు దాన్ని విస్తరించారు.

వైసీపీ హయాంలో అమలు..

గత ప్రభుత్వం వైద్యఆరోగ్య శాఖలో ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానం ప్రవేశ పెట్టింది. అంతకు ముందు ఎన్నడూ లేని విధంగా ఉద్యోగి రోజుకు మూడు సార్లు హాజరు వేయాలన్న నిబంధనను గత వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఎఫ్ఆర్ఎస్ విధానంలో వైద్య శాఖ లో పనిచేస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది నిర్దేశించిన సమయంలో, నియమించిన ప్రదేశంలో ఉండి ముఖం చూపిస్తూ హాజరు వేయాలి. ఉదయం 9 గంటలకు ఇన్ పంచ్, మధ్యాహ్నం 1 గంట నుంచి 2 మధ్య మిడ్ పంచ్, సాయంత్రం 4 గంటల ఔట్ పంచ్ వేయాలి. ఉదయం 9 నుంచి 9.10 నిమిషాల వరకు ఇన్ పంచ్ పడుతుంది. సమయం దాటితే హాజరు నమోదుకి సంబంధిత డ్రాయింగ్ అధికారి అనుమతి(అప్రూవల్) ఇవ్వాలి. వాస్తవానికి క్షేత్ర స్థాయి సిబ్బంది ఈ విధమైన హాజరు విధానం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు ప్రస్తుత ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. సమయంతో పని లేకుండా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించే క్షేత్రస్థాయి సిబ్బందిని ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయించాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై నిర్ణయం వస్తుందని ఎదురు చూస్తున్న తరుణంలో వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఎఫ్ఆర్ఎస్‌ను ఏకంగా జీతాలకు లింకు చేయడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.



సమయంతో ముడిపెట్టలేని ఉద్యోగం

వైద్య, ఆరోగ్య శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బంది సమయంతో పనిలేకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఉదాహరణకు ఓ గర్భిణీ నొప్పులు పడుతుంటే అది అర్ధరాత్రి అయినా సరే ఏఎన్ఎం, ఆశా కార్యకర్త బాధితురాలితో కలిసి ఆస్పత్రికి వెళ్లాల్సిందే. గ్రామంలో వాంతులు, విరేచనాలు వంటి ఎపిడిమిక్ ప్రబలినప్పుడు రాత్రి వేళ కూడా విధుల్లో ఉండాలి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డ్యూటీ సమయం అని అనడానికి లేదు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాల్సిన సిబ్బందిని కూడా ఎఫ్ఆర్ఎస్ చట్రంలో బిగించి జీతాలు కోత అనడం వైద్య ఆరోగ్యశాఖలో నిరసనకు కారణం అవుతుంది.

అనాలోచిత నిర్ణయం అమలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు వెనక్కి తీసుకుంటారని ఆశించాం. అయితే ప్రభుత్వ పెద్దలకు తెలుసో లేదో తెలియదు కానీ ఆరోగ్య శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ అమలు నిర్ణయం ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం తెప్పిస్తుంది. ఆరోగ్య శాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు అంటే జరగదు. సాయంత్రం 4 తర్వాత విధులు ఉండవు అంటే ఎఫ్ఆర్ఎస్ జీతాలకు లింక్ చేయండి. అధికారులు ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

- మలినేని భానుమూర్తి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, తెలుగునాడు వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం

వామ్మో.. ఇన్ని అభ్యంతరాలా?

- 69 గ్రామాల పరిధిలో 4,035 అర్జీలు
- ఈ నెల 5తో ముగియనున్న గ్రామసభలు
- రీసర్వే జరిగిన గ్రామాల్లో వెల్లువలా దరఖాస్తులు

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎవ రైనా, ఎక్కడైనా సమస్యను పరిష్కరించే దిశగా అడుగులేస్తే అయితే సానుకూల ఫలితం వస్తుంది లేదా ఆ చిక్కుముడి అలానే ఉంటుంది. కానీ గత వైసీపీ ప్రభుత్వం జగనన్న భూరక్ష పేరిట చేపట్టిన భూముల రీసర్వే రైతులకు మేలు చేయకపోగా మరిన్ని కొత్తస మస్యలను తెచ్చిపెట్టింది. ఇవి కూడా ఏవో ఒకట్రెండు గ్రామాల్లోనే ఈ సమస్య అనుకుంటే పొరపాటే. రీసర్వే పూర్తయిన 71 గ్రామాల్లోనూ ఇదే తంతు. రీసర్వే సమస్యల పరిష్కారంపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం ఆయా గ్రామాల్లో గ్రామ సభలకు శ్రీకారం చుట్టిన శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. శనివారం నాటికి మొత్తం 69 గ్రామాల పరిధిలో సభలను రెవెన్యూ యంత్రాం గం ముగించింది. వీటి పరిధిలో ఏకంగా 4,035 అర్జీలు రావడంతో తలలు పట్టుకోవడం అధికారుల వంతైంది. ఇంకా రెండు గ్రామాల్లోనే సభలు నిర్వహించాల్సి ఉండగా ఈ నెల 5న

సంగతి తెలిసిందే. శనివారం నాటికి 69 గ్రామాల్లో సభలు పూర్తి కాగా వీటి పరిధిలో ఏకంగా 4,035 అర్జీలు రావడంతో అధికారులు విస్తుపోతున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే రీసర్వే పేరిట పెద్ద ప్రహసనాన్ని గత ప్రభుత్వం నడిపించిందే తప్ప క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధిగా పనిచేసిన దాఖలాలు లేవని స్పష్టమవుతోంది. ఈ మొత్తం దరఖాస్తు లను నిబంధనల ప్రకారం పరిశీలన చేపట్టి సంతృప్తికరంగా అర్జీలను ముగించాలంటే కనీసం రెండు నెలల సమయం కావాలన్నది రెవెన్యూ వర్గాల వాదన. త్వరలోనే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి అభ్యంతరాలపై ఓ నిర్ణయానికి వచ్చే దిశగా అధికారులు కసరత్తు చేయనున్నారు వైసీపీ హయాంలో జిలాలో 71 గ్రామాల్లో రీసర్వే పూర్తయినట్లు అప్పట్లో ప్రకటించారు. ఈ గ్రామాల పరిధిలో గ్రామ సభలకు అక్టోబరు 22 నుంచి కూటమి ప్రభుత్వం అక్కడ గ్రామ సభలు నిర్వహణతో ఈ అంకం పూర్తవుతుందని సర్వే విభాగం చెబుతోంది.

ఇప్పటికే శిక్షణ పూర్తి..

రీసర్వేలో వచ్చిన అభ్యంతరాల పరిష్కారం సహేతుకుంగా జరగాలనే కృతనిశ్చయంతో కూటమి ప్రభుత్వం ఉంది. అందుకు ఇప్పటికే జిల్లా అధికారులకు దీనిపై రాష్ట్రస్థాయిలో శిక్షణ నిర్వహించారు. ఈ గ్రామసభల నిర్వహణ పూర్తి కాగానే జిల్లాలోని కింది స్థాయి యంత్రాంగానికి అధికారులు రీసర్వే అభ్యంతరాల పరిష్కారంపై శిక్షణ ఇవ్వనున్నారు. దానిలో భాగంగా ఈ నెల 6 నుంచి ఈ శిక్షణ కార్యక్రమాలు మొదలు కానున్నాయి. మళ్లీ సమస్య అనేది తలెత్తకుండా క్షేత్రస్థాయిలో అర్జీదారుల సమక్షంలోనే విచారణ పూర్తి చేసి అందరి అంగీకారంతో ఓ నిర్ణయానికి వచ్చి సమస్యకు పరిష్కారం చూపెట్టే దిశగా అడుగులు వేయనున్నారు.



బల్లికురవలో నిర్వహించిన గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

గుంతల రహితంగా రహదారులు

- 319 కిలోమీటర్ల మేర తాత్కాలిక మరమ్మతులు
- అప్పికట్ల-ఈతేరు రోడ్డు పనులను ప్రారంభించిన కలెక్టర్

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మిషన్‌పాట్ హోల్‌ఫ్రీ ఏపీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో రహదారులు గుంతల రహితంగా మారుతాయని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. మిషన్‌పాట్ హోల్‌ఫ్రీ ఏపీ కార్యక్రమంలో భాగంగా బాపట్ల మండలం అప్పికట్ల -ఈతేరు రోడ్డుపై గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని కలెక్టర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 319 కిలోమీటర్ల మేర రహదార్లకు గుంతలు పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ప్రభుత్వం గుంతల రహిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మరమ్మత్తుల కొరకు జిల్లాకు రూ.16 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో రాష్ట్రీయ, ఆర్‌అండ్‌బీ, గ్రామాల్లోని రహదార్లకు మరమ్మతులు చేస్తామన్నారు. రూ.3.24 కోట్లతో బాపట్ల నియోజకవర్గంలోని రహదార్ల మరమ్మతులు చేస్తామన్నారు. గుంటూరు-చీరాల రహదారిలో ఈతేరు నుంచి అప్పికట్ల మీదగా నల్లమడ డ్రెయిన్ వరకు 9 కిలోమీటర్ల పొడవున గుంతలు పూడ్చేందుకు రూ.23 లక్షలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, ఆర్అండ్ ఈఈ గీతారాణి, డి.అరుణ, తహసీల్దార్ షేక్.సలీమా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ, ఫరీద్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



మిషన్‌పాట్ హోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటమురళి తదితరులు

పేదలకు జీవనోపాధి కల్పించాలి

ఉపాధిహామీ పథకం ద్వారా అర్హులైన ప్రతి పేదవాడికి జీవనోపాధి కల్పించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం ఈ నెల 5న జరగనున్న నేపథ్యంలో శనివారం ముందస్తుగా జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో జిల్లాలోని తీరప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటి ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలవాలని చెప్పారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. 3,064 గృహాలను డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేయాలనే లక్ష్యంగా పనులు చేయాలన్నా రు. 19,790 ఎన్టీఆర్ గృహాల లబ్ధిదారులకు నిలిచిన నిధులు ఇవ్వడానికి సర్వే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు.

డీఈవో, చీరాల కమిషనర్‌లకు చార్జిమెమో

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లకు తాగునీటిని పుష్కలంగా సరఫరా చేయాలని కలెక్టర్ తెలిపారు. సమావేశానికి డీఈవో, చీరాల మున్సిపల్ కమిషనర్ గైర్హాజరయ్యారు. దీంతో వారికి చార్జిమెమో ఇవ్వాలని సంబంధితాధికారులను ఆదేశించారు.



అప్పికట్ల-ఈతేరు ప్రధాన రహదారిపై చేస్తున్న మరమ్మతులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

ఇసుక అక్రమ తవ్వకాలపై కదిలిన యంత్రాంగం

» అధికారుల్లో వీడని సందిగ్ధత
» బాపట్ల, అద్దంకి నుంచి కూడా చీరాల నియోజకవర్గానికి
» సీఎం చంద్రబాబు చెప్పారు కదా అంటున్న ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వేటపాలలెం(చీరాల), నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వరుస కథనాలతో అధికార యంత్రాంగం కదిలింది. శనివారం తహసీల్దార్ పార్వతి, మైనింగ్ ఆర్ఐ రాజేంద్రప్రసాద్, ఎస్సై వెంకటేశ్వర్లు, ఆర్ఐ శ్రీకాంత్‌ల బృందం ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి దాడులు నిర్వహించారు. ఆ క్రమంలో తోటల్లో ఉన్న ఎక్స్‌కవేటర్‌ను గుర్తించారు. అధికారుల బృందాన్ని చూచి ఎక్స్‌కవేటర్ డ్రైవర్ పరారయ్యాడు. అక్కడ నుంచి సమీపంలో ఇసుక తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని అధికారుల బృందం పరిశీలించింది. ఆ క్రమంలో విధి నిర్వహణలో ఉన్న తనతో వాదన పెట్టుకున్న అశోక్, ఎక్స్‌కవేటర్‌కు సంబంధించి ప్రసాద్ అనే వ్యక్తి, తవ్వకాలు జరిగిన ప్రదేశానికి సంబంధించి రామారావు, భిక్షవతికి నోటీసులు ఇచ్చి, ఎక్స్‌కేటర్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి సంబంధీకులపై తగిన చర్యలు చేపట్టే విధంగా పోలీసు వారికి చెప్పినట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు.


అక్రమ తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు

సీఎం ట్రాక్టర్లతో తోలుకోవచ్చన్నారుగదా

సీఎం చంద్రబాబు ఇసుకను ట్రాక్టర్లతో ఉచిత ఇసుక విధానంలో తోలుకోవచ్చని చెప్పారు గదా, మమ్మల్ని ఎందుకు ఆపుతున్నారని ఇసుక తవ్వకాలు, రవాణా చేసే వ్యక్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. పదుల సంఖ్యలో క్వారీలను ఏర్పాటు చేసుకుని తవ్వకాలు, రవాణా జరుపుతున్న వారిని వదిలేసి కేవలం మమ్మల్నే ఎందుకు ఆపుతున్నారని, మిగిలిన వారిని ఎందుకు ఆపరని పట్టుబడినారు అధికారులను ప్రశ్నించడం వారికి తలనొప్పిగా మారుతోంది. అయితే సీఎం చంద్రబాబు వాగులు, వంకలు, నదులు ఉన్న ప్రాంతాల్లో 5 కిలోమీటర్లు లోపు సొంత అవసరాలకు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా తోలుకోమన్నారన్న విషయాన్ని అధికారులు పదే పదే చెప్పాల్సి వస్తోంది. కొందరు ఎందుకు తలనొప్పని అక్రమ తవ్వకాలు, రవాణాను చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.

అద్దంకి, బాపట్ల ప్రాంతాల నుంచి

చీరాల నియోజకవర్గంలో ఇసుక భూములు ఎక్కువగా ఉండడం, పెద్ద ఎత్తున ఎక్స్‌కవేటర్లతో క్వారీలలో తవ్వకాలు సాగిస్తుండడంతో పాటు ధర తక్కువగా ఉండడంతో అద్దంకి, బాపట్ల ప్రాంతాల నుంచి ఇసుక కోసం చీరాల నియోజకవర్గానికి వస్తున్నారు. గతంలో ట్రాక్టర్ ఇసుక ధర రూ.4,500 ఉంటే ప్రస్తుతం దూరాన్ని బట్టి రూ.1800 నుంచి రూ.4వేల మధ్య తోలుతున్నారు.


ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేస్తున్న తహసీల్దార్ పార్వతి, ఎస్సై వెంకటేశ్వర్లు

అధికారుల్లో వీడని సందిగ్ధత

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించి అధికారులు కూడా కొంత సందిగ్ధంలో ఉన్నారని విషయం తెలిసిన వారు చెప్తున్నారు. ట్రాక్టరు యజమానులు, డ్రైవర్లు సీఎం చంద్రబాబు చెప్పారు, మీరెందుకు ఆపుతున్నారనే కోణంలో ప్రశ్నించడంతో, కేసులు కట్టేందుకు కూడా ఒకింత వెనకడుగు వేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఉన్నతాధికారులు వాస్తవ పరిస్థితులను, ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన అంశాలకు సంబంధించి స్పష్టమైన ప్రకటన చేసి స్థానిక అధికారులకు దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉంది.


ఆందోళన చేపట్టిన వ్యక్తితో వాదులాడుతున్న దుకాణ మద్దతుదారుడు

మా ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దు

ఆందోళనకు దిగిన స్థానికులు

వేటపాలెం (చీరాల), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మా ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దు.. కావాలంటే మీ ఇళ్ల మధ్య పెట్టుకోండని పలువురు రోడ్డెక్కారు. చీరాల, ఒంగోలు మెయిన్ రోడ్డులో దంత వైద్యశాల ఎదురు శనివారం ఈ ఘటన జరిగింది. అక్కడ ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాన్ని స్థానికులు వ్యతిరేకించారు. పలువురు మహిళలు, పురుషులు తమ అభ్యంతరం తెలిపారు. ఈ నేపథ్యంలో దుకాణ మద్దతుదారులు, ఆందోళన చేపట్టిన వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈక్రమంలో మద్యం దుకాణ మద్దతుదారులు కొందరు వారిపట్ల ఒకింత అనుచితంగా ప్రవర్తించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకుని సర్దిచెప్పారు. అనంతరం మద్యం దుకాణాన్ని వ్యతిరేకించిన వారు ఆర్డీవో చంద్రశేఖరనాయుడుని కలసి తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని అర్జీ అందజేశారు.

రైలు ప్రమాదంలో వృద్ధుడి మృతి



చీరాలటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొని గుర్తుతెలియని సుమారు 75 సంవత్సరాల వృద్ధుడు మృతి చెందారు. ఈఘటన కారంచేడు రైలు గేటు సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. వృద్ధుడు పట్టాలు దాటుతుండగా విజయవాడ - గూడూరు మెమో రైలు ఢీకొన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

వెనుక నుంచి కారు ఢీ

టైలర్‌కు తీవ్ర గాయాలు

చీరాలటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అకస్మాత్తుగా కారు టైరు పంచర్ కావడంతో అదుపు తప్పి టైలర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన చీరాల-పాపాయిపాలెం రోడ్డులోని ప్రైవేటు కళాశాల సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన బొమ్మిడి అచ్చయ్య గ్రామంలోనే టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే శనివారం ద్విచక్ర వాహనంపై చీరాలకు వెళుతుండగా వెనుక నుండి వస్తున్న కారుకు ముందు చక్రం పంచర్ పడింది. దీంతో అదుపుతప్పి వేగంగా టైలర్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్ర రక్త స్రావం కావడంతో చీరాలలోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరు యువకులకు గాయాలు

మార్టూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కోలలపూడి క్రాస్ రోడ్డు ఎదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఇద్దరు వాహనదారులు గాయపడిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. గాయపడిన ఇద్దరు యువకులను టోల్ ప్లాజాకు చెందిన అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అందుకు సంబంధించిన వివరాలిలావున్నాయి. గుంటూరులోని శివ నాగరాజుకాలనీకి చెందిన పరిసపోగు దిలీప్ స్కూటీపై ఒంగోలు వైపు టోల్ ప్లాజా వైపు నుంచి మార్టూరు వైపు వస్తున్నారు. ఇదే రోడ్డులో ఉన్న పొగాకు గౌడౌన్‌లో పనిచేస్తున్న జె.పంగులూరు మండలం కొండమంజులూరు గ్రామానికి చెందిన పత్తిపోగు పవన్ కల్యాణ్ ద్విచక్రవాహనంపై రాత్రి ఇంటికి రాంగ్‌రూట్‌లో వెళుతూ స్కూటీపై వస్తున్న దిలీప్‌ను ఢీకొన్నాడు. దాంతో వారిద్దరూ గాయాలతో రోడ్డుపై పడి పోయారు. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తర్వాత గాయపడిన వారిద్దరినీ అంబులెన్సులో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత వారిద్దరిని మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

అన్న ఎదుటే తమ్ముడి ఆత్మహత్య

» మోటార్‌సైకిల్‌పై బయలుదేరిన అన్నదమ్ములు
» డబ్బులు కింద పడ్డాయని చెప్పడంతో ఆపిన వైనం
» గుండ్లకమ్మ నదిలోకి దూకిన తమ్ముడు


దుర్గాప్రసాద్

అద్దంకి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అన్నదమ్ములు కలిసి మోటార్‌సైకిల్‌పై తిమ్మాయపాలెం వెళ్తున్నామని ఇంటి దగ్గర చెప్పి వెళ్లారు. కొద్దిసేపటికే తమ్ముడు చనిపోయాడని ఇంటికి ఫోన్ వచ్చింది. వివరాల్లోకి వెళితే.. అద్దంకి పట్టణంలోని గరటయ్య కాలనీ 19వ లైన్‌లో నివాసముండే దాట్ల శ్రీనివాసరావుకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు దుర్గాప్రసాద్ (18) విశ్వభారతి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం సాయంత్రం అన్నదమ్మిలిద్దరూ మోటార్‌సైకిల్‌పై తిమ్మాయపాలెం వెళ్తున్నారు. గుండ్లకమ్మ నది బ్రిడ్జిపైకి వెళ్లిన సమయంలో డబ్బులు కిందపడ్డాయి మోటార్‌సైకిల్ ఆపమని దుర్గా ప్రసాద్ చెప్పాడు. దీంతో మోటార్‌సైకిల్‌ను అన్న ఆపుతున్న సమయంలో దుర్గా ప్రసాద్ ఒక్కసారిగా మోటార్‌సైకిల్‌పై నుంచి దిగి పరుగెత్తుకుంటూ వెళ్లి బ్రిడ్జిపై నుంచే గుండ్లకమ్మ నదిలో బ్రిడ్జికి ఎగువ భాగంలో దూకాడు. అన్న కేకలు వేసినప్పటికీ నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కాపాడే అవకాశం లేకుండా పోయింది. తన కళ్ల ఎదుటే తమ్ముడు గుండ్లకమ్మ నీటిలో మునిగిపోయాడు. విషయాన్ని వెంటనే ఇంటికి ఫోన్ చేసి చెప్పాడు. గజ ఈతగాళ్లు గాలించినప్పటికి ఆచూకీ లభించలేదు. నర్రావారిపాలెం రేవు దాటి వెళ్లినట్లు భావిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చినప్పటికీ అప్పటికే చీకటి పడడంతో ఆదివారం ఉదయం మృతదేహం కోసం గాలిస్తామని చెప్పారు. కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతి కి కారణాలు ఇంకా వెల్లడికాలేదు. ఘటనా స్థలాన్ని సీఐ కృష్ణయ్య, ఎస్సై ఖాదర్‌బాషా పరిశీలించారు.

కొడుకా ఎక్కడున్నావయ్యా!

» ఒడిసా బాలుడి అదృశ్యం
» తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
» బతుకుదెరువుకు పది రోజుల కిందట చీరాలకు


మొళాయ్

కావూరివారిపాలెం(చీరాలటౌన్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బతుకుదెరువుకు వచ్చాం.. మా బిడ్డ జాడ చెప్పి ఆదుకోండని ఒడిసాకు చెందిన తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే చీరాల మండలం కావూరివారిపాలెంలో ఉన్న రాయల్ మెరైన్ రొయ్యల ఫ్యాక్టరీలో పని చేసుకుని జీవనాన్ని గడిపేందుకు సుమారు పది రోజుల క్రితం మనోజ్ నాయక్, జున్ను దంపతులు కావూరివారిపాలెం ఆంధ్రకేసరినగర్‌కు వచ్చారు. వీరికి ఒడియా భాష తప్ప తెలుగు రాదు. శుక్రవారం మధ్యాహ్నం వీరి కుమారుడు మొళాయ్ నాయక్(12) అదృశ్యమయ్యాడు. దీంతో వచ్చీరాని భాషలోనే ప్రతి వీధిలోనూ వెదికారు. ఎక్కిఎక్కి ఏడ్చారు. చేసేదిలేక ఈపూరుపాలెం పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ శివకుమార్ గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని ఎస్సై కోరారు. అయితే బిడ్డ జాడ తెలియక తల్లిదండ్రులు బోరుమంటున్న సంఘటన అందరి కళ్లను చెమర్చాయి.


వేడుకుంటున్న మొళాయ్ తల్లిదండ్రులు

అండర్ పాస్‌లో పోయే ఇళ్ల పరిశీలన

» బాధితుల సమస్యలు తెలుసుకున్న ఆర్డీవో


తిమ్మనపాలెం ఎస్సీ కాలనీవాసులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

మేదరమెట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో తిమ్మనపాలెం చెక్ పోస్టు వద్ద నూతనంగా నిర్మిస్తున్న అండర్ పాస్ నిర్మాణంలో కోల్పోయే ఇళ్లను చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడారు. శనివారం మండలంలోని తిమ్మనపాలెం గ్రామానికి వచ్చిన ఆయన కొత్తగా నిర్మించే ఫ్లైవోవర్, సర్వీస్ రోడ్డు కోసం భూ సేకరణ ప్రాంతాన్ని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, ఇతర అధికారులతో కలిసి ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ఎస్సీ కాలనీ వాసులు మాట్లాడుతూ 70వ దశకంలో ప్రభుత్వం మాకు ఇచ్చిన ఇంటి స్థలాలలో ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నామన్నారు. భూముల ధరలు విపరీతంగా పెరిగిన ఈ సమయంలో తమ ఇళ్లను రోడ్డు నిర్మాణం కోసం తీసుకోవడం అన్యాయమన్నారు. చాలా తక్కువ నష్ట పరిహారం ఇచ్చి భూములను స్వాధీనం చేసుకోవడం కూడా న్యాయం కాదన్నారు. తమకు ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందించి నివాస యోగ్యమైన స్థలాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కాలనీ సమీపంలో రోడ్డు పక్కనే స్థలాలు కేటాయించాలని ఆర్డీవోకు విన్నవించారు. కాలనీ వాసుల సమస్యలు విన్న ఆర్డీవో మీ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆర్ఐ కృష్ణమోహన్, సర్వేయర్ మహేష్ బాబు, వీఆర్వో సుధాకర్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

న్యూజిలాండ్‌లో ఎమ్మెల్యేలు ఏలూరి, వర్మకు ఘనస్వాగతం

» తెలుగు అసోసియేషన్ కృషికి అభినందనలు
» అక్కడి మంత్రి, ఎంపీలతో భేటీ


న్యూజిలాండ్‌లో ఎమ్మెల్యే ఏలూరిని సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పర్చూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లిన ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్ర వర్మకు న్యూజిలాండ్‌లోని మన ఆంధ్ర తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన అసోసియేషన్ సభకు ఎమ్మెల్యేలను మంగళ వాయిద్యాలతో తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ న్యూజిలాండ్‌లో సైతం తెలుగువారు సంస్కృతి సంప్రదాయాలను కొనసాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఆంధ్ర అసోసియేషన్ తెలుగువారి కోసం చేస్తున్న కృషి అమోఘమన్నారు. ఎక్కడ ఉన్నా తెలుగు ప్రజలు ఐక్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యేలను దుశ్శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం న్యూజిలాండ్ మంత్రి మిచెల్ ఉడ్, న్యూజిల్యాండ్ పార్లమెంట్ సభ్యుడు కార్లోస్ చియంగ్‌తో ఏలూరి, వర్మ భేటీ అయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం తెలుగు అసోసియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో మద్దుకూరి దిలీప్ పాల్గొన్నారు.


విక్రయానికి సిద్ధంగా ఉన్న పురుగు మందు డబ్బాలు

ధరల్లో మాయ!

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పురుగు మందుల విక్రయాల్లో ధరల మాయాజాలం సాగుతోంది. ఒకే కంపెనీకి చెందిన మందును ఒక్కో చోట ఒక్కో ధరకు విక్రయిస్తున్నారు. వాస్తవానికి మందు డబ్బాపై ఎంఆర్‌పీ (గరిష్ట చిల్లర ధర) ఒకటి ఉండగా, విక్రయించే ధర అంతకన్నా తక్కువ ఉంటుంది. ఈ క్రమంలో ఒక్కో చోట ఒక్కో విధంగా దుకాణదారులు విక్రయిస్తున్నారు. బేరమాడి కొనుగోలు చేయడం లేదా డబ్బు చెల్లించి కొనుగోలు చేయడమైతే ఒక ధర, అరువు మీద తీసుకుంటే మరో ధరకు విక్రయిస్తున్నారు. దీంతో ఇన్‌వాయిస్ ధర ఎంత? నిర్దిష్టంగా ఎంతకు విక్రయించాలనే విషయమై స్పష్టత లేదని రైతులు చెప్తున్నారు. వాస్తవానికి ఎంఆర్‌పీ ధరపై తయారీదారులు టాక్స్ చెల్లిస్తుంటారు. కానీ ఎంఆర్‌పీ కన్నా తక్కువకు విక్రయిస్తుంటారు. అది ఇన్‌వాయిస్ ధర అని చెప్తూ బిల్లు ఇస్తుంటారు. అయితే అన్ని ప్రాంతాల్లో ఆయా ధరలు ఎంత తక్కువకు విక్రయించగలిగితే అంత తక్కువకు ఇచ్చేలా వ్యవసాయశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నాకు అవగాహన లేదు.. టెక్నికల్ వాళ్లను కనుక్కుని చెప్తాను

పురుగు మందులు ఎమ్మార్పీ కన్నా తక్కువకు విక్రయిస్తుంటారు. కానీ ఇన్‌వాయిస్ ధర ప్రకారం వారు బిల్లులు రాసి, విక్రయిస్తుంటారు. ఎంఆర్‌పీ కన్నా తక్కువకు ఎలా, ఎందుకు విక్రయిస్తుంటారో నాకు తెలియదు. టెక్నికల్ వాళ్లను కనుక్కొని చెప్తాను. రైతులు ఇబ్బంది పడకుండా, నష్టపోకుండా చర్యలు తీసుకుంటాం.

- సుమతి, ఏవో, చీరాల మండలం

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

చినగంజాం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో విజయవాడ హెల్ప్ హాస్పిటల్స్ వారు ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్, గుండె స్కానింగ్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా యాంజియో గ్రామ్ పరీక్ష చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.


హనుమాన్ మండల దీక్ష తీసుకుంటున్న భక్తులు

శింగరకొండలో హనుమాన్ మండల దీక్ష తీసుకున్న భక్తులు

అద్దంకి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, దర్శి, పొదిలి, కందుకూరు, టంగుటూరు, రాజంపల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 100 మందికిపైగా భక్తులు శనివారం హనుమాన్ మండల దీక్ష తీసుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం హనుమాన్ మండల దీక్ష తీసుకున్నారు. కార్తీక మాసం మొదటి శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. సుమారు వెయ్యి మంది భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం 22వ తేదీన అర్ధమండల దీక్ష ప్రారంభమవుతుందని ఈవో తిమ్మానాయుడు తెలిపారు. డిసెంబరు 13వ తేదీ హనుమత్ వ్రతం సందర్భంగా దీక్ష విరమణ ఉంటుందన్నారు. డిసెంబరు 13న ఉదయం 7 గంటలకు దీక్షధారుల ఆలయ ప్రదక్షిణ, 7-30 గంటలకు భక్తులు సమర్పించిన ఇరుముడి ద్రవ్యాలతో ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకం, 9 గంటలకు హనుమత్ వ్రతం, మధ్యాహ్నం 12 గంటలకు మన్యుసూక్త హోమం, పూర్ణాహుతి అనంతరం మాల విరమణ జరుగుతుందని తెలిపారు.

దీక్షధారులకు అన్నదానం ప్రారంభం

చినగంజాం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానంలో దీక్షధారులకు అన్నదాన (సద్ది) కార్యక్రమాన్ని దేవస్థాన కమిటీ చైర్మన్ డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయులు దంపతులు శనివారం ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలోని హరిహర సుత అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు, గురుస్వాములు నరహరి హనుమంతరావు, చెరుకూరి రాఘవయ్య ఆధ్వర్యంలో స్వామి వారికి పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అయ్యప్ప శివ, భవానీ, ఆంజనేయ, వేంకటేశ్వర తదితర దీక్షధారులకు 2025 జనవరి 10వ తేదీ వరకు సద్ది కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచ్ఆర్సీఐ జాతీయ అధ్యక్షుడు శ్రీకాంత్

అవినీతి రహిత సమాజమే లక్ష్యం

విశ్రాంత సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డేవిడ్

పర్చూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అవినీతి రహిత సమాజమే లక్ష్యంగా యువత ముందుకు సాగాలని విశ్రాంత సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లక్కిపోగు డేవిడ్ అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శనివారం పర్చూరులో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా (హెచ్ఆర్సీఐ) బాపట్ల జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి డేవిడ్‌ను, బాపట్ల జిల్లా అధ్యక్షునిగా నియమితులైన లక్కిపోగు సుమన్‌ను జాతీయ అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీకాంత్ పుష్పగుచ్ఛంతో సత్కరించారు. తొలుత నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎక్కడ అవినీతి జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని జాతీయ అధ్యక్షుడు కోరారు. కార్యక్రమంలో కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి నందం నరసింహారావు, ఏపీ అధ్యక్షుడు జెర్రిపోతుల నానాజీ, ఉపాధ్యక్షుడు జి.రాంబాబు, సౌత్ ఇండియా మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి, లీగల్ కార్యదర్శి రాజ్యలక్ష్మి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొల్లా సుభాష్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ, మక్కెన శేఖర్‌బాబు, షేక్ షంషుద్దీన్, అగ్నిగుండాల వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బల్లికురవ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాక్షన్ గ్రామమైన వేమవరం రౌడీషీటర్లకు శనివారం సంతమాగులూరు సర్కిల్ కార్యాలయంలో సీఐ కె.వెంకట్రావు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి అలజడులు సృష్టించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో వేమవరం గ్రామంలో జంట హత్యలు జరిగాయని మరలా అలాంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరు ఏమి చేస్తున్నారో తమ వద్ద పూర్తి సమాచారం ఉందని, చట్టాన్ని ఉల్లంఘిస్తే నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామం విడిచి ఎవరైనా వెళ్లాలంటే పోలీసు శాఖకు సమాచారం ఇవ్వాలని వారికి సూచించారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

అద్దంకిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, 2030 నాటికి దానిని పూర్తి స్థాయిలో నిర్మూలించాలనే లక్ష్యంతో అందరు కృషి చేయాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బీవీ సాగర్ అన్నారు. శనివారం గురుకుల పాఠశాలలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ కలిగి సమాజ సేవలో భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ గాయత్రిదేవి అన్నారు. కార్యక్రమంలో అద్దంకి, మార్టూరు, కొరిశపాడు, నాగులుప్పలపాడు, అవుట్రీచ్ వర్కర్స్ దుర్గా, మల్లేశ్వరి, కృష్ణవేణి, కరుణ, శ్రావణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా రీ-సర్వే చేయాలి

అద్దంకి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో ఆస్తులను పకడ్బందీగా రీ-సర్వే చేయాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. రీ సర్వే నిర్వహణపై శనివారం సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ, అడ్మిన్ సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలకు రీసర్వే ఓరియాంటేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీంద్ర మాట్లాడుతూ అద్దంకి పట్టణ పరిధిలో ఆస్తులను సోమవారం నుంచి రీసర్వే ప్రారంభిస్తామన్నారు. గతం లో నిర్వహించిన సర్వేలో ఏవైనా లోపాలు చోటు చేసుకొని ఉంటే సరిచేసుకునే అవకాశం ఉంటుందన్నారు. మేనేజర్ శ్రీదేవి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పందిళ్లపల్లి పీహెచ్‌సీ నిర్మాణంపై కసరత్తు

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ ఓఎస్‌డీ నక్కల రమణారావు పందిళ్లపల్లి పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి సంబంధించి డీఎంహెచ్‌వోతో మాట్లాడారు. అందుకు సంబంధించి డీఎంహెచ్‌వో విజయమ్మకు పరిణామాలను వివరిస్తూ, పీహెచ్‌సీ నిర్మాణ ఆవశ్యకతను తెలుపుతూ రాతపూర్వక నివేదికను అందజేశారు. త్వరలో తదుపరి కార్యాచరణ ఉంటుందని తెలిపారు.

రిలే నిరాహార దీక్ష

పందిళ్లపల్లి పీహెచ్‌సీ భవన నిర్మాణం యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరుతూ చెరుకూరి రాంబాబు అనే వ్యక్తి శనివారం పీహెచ్‌సీ వద్ద రిలే నిరాహార దీక్షకు కూర్చున్నారు. పీహెచ్‌సీ భవన నిర్మాణం వెంటనే జరిగేలా తాను దీక్ష చేపట్టినట్లు తెలిపారు.

గృహ నిర్మాణాలపై అధికారుల పరిశీలన

చీరాలటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని చీరాల-1 లేఅవుట్‌ను జిల్లా హౌసింగ్ అధికారి ఎమినేని వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈక్రమంలో నిర్మాణాలపై ఆరా తీశారు. పూర్తి కాని నిర్మాణాలకు సంబంధించి యజమానులతో మాట్లాడాలని సూచించారు. మార్చి 25 నాటికి నూతన హౌసింగ్ విధానం అమలులోకి వస్తుందని వెంటనే పాతవి పూర్తి చేయాలని సూచించారు. అలాగే సచివాలయ పరిధిలోని ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ప్రత్యేక దృష్టి సారించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ గాజుల శ్రీనివాసరావు ఏఈలు శ్రీనివాసరావు, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.


లేఅవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ జిల్లా అధికారి వెంకటేశ్వరరావు

బల్లికురవ మండలానికి 50 ట్రాన్స్‌ఫార్మర్లు

» మంత్రి గొట్టిపాటి ఆదేశంతో మంజూరు

» రైతుల కృతజ్ఞతలు



బల్లికురవ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పంపిణీకి సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

బల్లికురవ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పంటలకు రైతులు విద్యుత్ లైన్ల కోసం గతంలో దరఖాస్తులు ఇచ్చి ఏళ్లుగా కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. రైతుల ఇబ్బందులను తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెంటనే వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేయాలని ఆదేశాలిచ్చారు. ఈమేరకు బల్లికురవ మండలానికి 50 నూతన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు శనివారం వచ్చాయి. మెత్తం 180 మంది రైతుల దరఖాస్తులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లను సోమవారం ప్రత్యేక మేళా పెట్టి రైతులకు ఒకే సారి ఉన్నతాధికారుల చేతుల మీదుగా అందజేస్తామని అ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. వైదనకు 10, వెలమవారిపాలెంకు 9, ఎస్ఎల్‌గుడిపాడుకు 5, కొమ్మినేనివారిపాలెం 4, కొణిదెన 3, ముక్తేశ్వరం 2, చెన్నుపల్లి 3, మరి కొన్ని గ్రామాలకు 6, దొంగతనాలకు గురైన 8 ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు అందజేస్తామని రైతులు విద్యుత్ శాఖ కార్యాలయానికి రావాలని ఏఈ కోరారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఒకే మారు పెద్ద సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీకి అధికారులు సిద్ధం చేస్తున్నారు. మంత్రి గొట్టిపాటికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఊరూరా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

» లబ్ధిదారుల కళ్లల్లో వెలుగులు

» వినియోగదారుల ఖాతాల్లోకి నగదు జమ



పంపిణీలో ఉచిత గ్యాస్ సిలిండర్ల వాహనం

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు అంటే మాకు నమ్మకం. డ్వాక్రా గ్రూపుల ఏర్పాటుతో మహిళా సాధికారత తెచ్చారు. గతంలో దీపం పథకం పెట్టారు. ఇప్పుడు దీపం-2 పథకం ద్వారా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నారు. వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమవుతుంది. దీపావళి పండుగ కానుకగా మాకు అందించిన కానుకను మర్చిపోలేమని ఉచిత సిలిండర్లు అందుకుంటున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మహిళల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జిల్లా పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో డీఎస్‌వో విలియమ్స్ పర్యవేక్షణలో ఈపురుపాలెంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చేతుల మీదుగా ఉచిత గ్యాస్ సిలిండర్లను పొందిన లబ్ధిదారులలో పలువురిని శనివారం ఆంధ్రజ్యోతి పలకరించగా వారు ఆనందం వ్యక్తం చేశారు. కుటుంబ నిర్వహణలో గ్యాస్ ఖర్చు ఒక రకంగా తమకు తలకుమించిన భారంగా ఉందని, ఉచిత సిలిండర్లతో ఆ భారం ఎంతో తగ్గుతుందని చెప్పారు.

మహిళలకు దీపం-2 వరం



దీపం-2 పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం మహిళలకు వరం. కుటుంబ నిర్వహణలో మహిళల పాత్ర కీలకం. పొదుపులో ముందుంటాం. ఆ క్రమంలో ఉచిత సిలిండర్లు ఇవ్వడంతో ఆదా అయిన డబ్బులను పొదుపు చేసుకోవడం ద్వారా మెరుగైన జీవనశైలికి మార్గం అవుతుంది. సూపర్ సిక్స్ పథకాలకు మహిళలకు మేలు చేకూరుతుంది.

- జి.కాంచన, లబ్ధిదారురాలు, ఈపురుపాలెం



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం

నిరుపేదలకు సంక్షేమ పథకాలు చేరాలి

ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం

చీరాలటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలో వెనుకబడిన, గుర్తింపు పొందని వారి వివరాలను వేగవంతంగా సేకరించి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం అన్నారు. మండల కార్యాలయంలో శనివారం సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యంతో పాటు సంక్షేమాలు పారదర్శకంగా అందించాలన్నారు. మండల పరిధిలో ఆధార్, ఓటరు, రేషన్ కార్డులు, వివిధ గుర్తింపులేని వెనుకబడిన తరుగతుల వారి వివరాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రామకృష్ణ, పంచాయతీల సెక్రటరీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి కుటుంబ సర్వే : ఎంపీడీవో సింగయ్య

అద్దంకిటౌన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాలలో వెనుకబడిన బీసీ-ఏ కులాలైన 32 కులాల కుటుంబాలకు ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు మూడు రోజుల పాటు సర్వే చేయనున్నట్లు ఎంపీడీవో బత్తిని సింగయ్య శనివారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కులాల అభివృద్ధికి ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. 32 కులాల కుటుంబాలు సర్వే సిబ్బందికి సహకరించాలని ఎంపీడీవో కోరారు.

మండలంలో 99 శాతం పింఛన్‌ల పంపిణీ

పంగులూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో శుక్ర, శనివారాలలో సామాజిక పింఛన్‌లు 99 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కె.స్వరూపారాణి తెలిపారు. 14 సచివాయాల పరిధిలో మొత్తం 7,890 మంది పింఛన్‌దారులు ఉండగా, గ్రామాలలో అందుబాటులో ఉన్న 7,784 మందికి అందచేశామన్నారు. మిగిలిన 106 పింఛన్‌దారులలో 32 మంది చనిపోయారని, మిగిలిన 74 మందికి అందచేయాల్సి ఉందన్నారు. సకాలంలో పంపిణీ చేసిన సిబ్బందిని అభినందించారు.

మహిళలకు కుట్టుపై శిక్షణ

మార్టూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అమ్మ ఆశ్రమంలో ఈ నెల 4వ తేదీ సోమవారం నుంచి మహిళలకు స్కూల్ యూనిఫామ్స్ కుట్టుపై శిక్షణ ఇస్తున్నట్లు ఆశ్రమం అధ్యక్షుడు గుంటుపల్లి చందు శనివారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆశ్రమంలో సంప్రదించాలని కోరారు.

జనసేన పార్టీ నాయకుల అన్నదానం

మార్టూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ నాయకులు డొక్కా సీతమ్మ పేరుమీద శనివారం మధ్యాహ్నం పార్టీ కార్యాలయం వద్ద అన్నదానం నిర్వహించారు. ఎన్ఆర్ఐ మన్నె శ్రీకాంత్ ఆర్థిక సహకారంతో మండల నాయకులు మందపాటి కిషోర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

మార్టూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మార్టూరులోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ కంటి వైద్యుడు కొర్రపాటి సుబ్రమణ్యం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.కోటేశ్వరరావు, మాదాల సాంబ శివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్రోణాదులలో సీఐ పల్లెనిద్ర

మార్టూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో శుక్రవారం రాత్రి సీఐ ఎం.శేషగిరిరావు పల్లెనిద్ర కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామాలలో శాంతియుత వాతావరణం కనిపించాలన్నారు. సమాజంలో అందరూ భాగస్వామ్యులుగా కలిసి పనిచేయాలన్నారు. తద్వారా భావితరాలవారికి మనం ఆదర్శంగా నిలుస్తామన్నారు. అనంతరం ఆయన గ్రామంలోని ప్రధాన వీధులలో సిబ్బందితో కలిసి పరిశీలించారు.

మద్యం మత్తులో మహిళలపై దాడులు



మాట్లాడుతున్న రమాదేవి

చీరాలటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో మద్యం మత్తులో మహిళలపై దాడులు పేట్రేగిపోతున్నాయని వీటిని అరికట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమాదేవి పేర్కొన్నారు. శనివారం అంబేడ్కర్ భవన్‌లో ప్రాంతీయ సభలో ఆమె మాట్లాడారు. మద్యం నియంత్రణపై ప్రభుత్వం దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్.బాబూరావు, కిరణ్, సత్యమూర్తి, అయ్యప్పరెడ్డి, వసంతరావు, ఎల్.జయరాజ్, కొండయ్య, నారపరెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.



వాడరేవు రోడ్డులో ప్రభుత్వ స్థలానికి దూరంగా వేసిన స్తంభాలు

విద్యుత్ స్తంభాల ఏర్పాటులో మాయాజాలం

ప్రభుత్వ స్థలం కబ్జా అయ్యే ప్రమాదం?

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేట నుంచి వాడరేవుకు వెళ్లే దారిలో 216 జాతీయ రహదారి పక్కన నూతనంగా వేసిన విద్యుత్ స్తంభాలతో ప్రభుత్వ భూమి కబ్జాకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. దీనిపై స్థానికుల్లో చర్చ నడుస్తోంది. హాయ్ రెస్టారెంట్ ఎదురు వాడరేవు రోడ్డుకు ఒక వైపు స్థలం వ్యక్తుల దరఖాస్తు మేరకు నూతనంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల స్థలానికి ప్రస్తుతం కరెంట్ పోల్స్ వేసిన ప్రదేశానికి మధ్య ప్రభుత్వ స్థలం ఉంది. ఆ రెండు స్థలాలకు హద్దు వద్ద స్ట్రయిట్‌లైన్ వేయాల్సి ఉండగా, మధ్యలో ప్రభుత్వ స్థలాన్ని వదిలి ఉద్దేశపూర్వకంగా ఇవతల స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విధంగా కరెంట్ స్తంభాలను వేస్తే అవతల ఉన్న ప్రయివేటు వ్యక్తులు మధ్యలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ స్థలం ఎంత వరకు ఉందో ఆ హద్దులో స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీనిపై సదరు కాంట్రాక్టరు, అధికారులను వివరణ కోరగా.. వాస్తవానికి స్ట్రయిట్ లైన్ ఉంటేనే విద్యుత్ లైన్ బలంగా ఉంటుందన్నారు. మరోసారి పరిశీలించి అవసరమైతే వేసిన స్తంభాలను మారుస్తామని చెప్పారు. విలువైన ప్రభుత్వ భూమి పరుల పరం అవుతుందనే స్థానికుల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుని తగిన చర్యలు చేపడతామని వారు స్పష్టం చేశారు.

చిప్ డిజైనింగ్‌పై ముగిసిన వర్క్ షాప్



శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగంలో 2వ సంవత్సరం విద్యార్థులకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ వారి సహకారంతో చిప్ డిజైనింగ్‌లో నిర్వహించిన వర్క్‌షాప్ శనివారంతో ముగిసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్‌బాబు మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో నేర్చుకున్న విషయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ డి.రాజేంద్రప్రసాద్, ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధి ఉమామహేశ్వరరావు, రాఘవస్వామి, సాయి సందీప్, ఎస్.రవీంద్ర, జీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్లు బాగు



రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న ఆర్అండ్‌బీ డీఈ నళిని

» యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు ప్రారంభం

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు రోడ్లు బాగుపడుతున్నాయి. గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పిలుపునిచ్చింది. శనివారం ఆర్ అండ్‌బీ డీఈ ఎం.నళిని ఎక్స్‌కవేటర్‌కు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆదేశాల మేరకు నాయకులు, ఆర్అండ్‌బీ అధికారులు గంజిపాలెం నుంచి రామాపురం వరకు రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈ నళిని మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దిశానిర్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రోడ్ల మరమ్మత్తుల పనుల్లో భాగంగా చీరాలలో కూడా పనులు ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ జేఈ శ్రీకాంత్, కాంట్రాక్టరు సత్యనారాయణ, నాయకులు కౌతవరపు జనార్దనరావు, రమేష్, గంజి పురుషోత్తమ్, తేలప్రోలు నాగేశ్వరరావు, గుమ్మ వెంకటేష్, రాము, మురళి, శంభుప్రసాద్, పటాన్ గౌస్, హరికృష్ణ, మస్తాన్ రావు పాల్గొన్నారు.

గుంతలు లేని రహదారులే లక్ష్యం

చినగంజాం : గుంతలు లేని రోడ్ల నిర్మాణమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టీడీపీ చినగంజాం, ఇంకొల్లు మండల అధ్యక్షులు పొద వీరయ్య, నాయుడు హనుమంతరావులు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు సంతరావూరులో శనివారం పనులు ప్రారంభించారు. సంతరావూరు నుంచి ఇంకొల్లు ఆర్అండ్‌బీ రోడుకు ప్యాచ్ వర్క్ పనులకు టీడీపీ నాయకులు, ఆర్ అండ్‌బీ అధికారులు భూమి పూజ కార్యక్రమం నిర్వహించి, పనులు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా జగన్‌రెడ్డి పాలనతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిందని వీరయ్య, హనుమంతరావు ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి రాగానే రోడ్లకు మహర్దశ పట్టిందన్నారు. ఎమ్మెల్యే ఏలూరి ఆధ్వర్యంలో ఇప్పటికే పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా కోట్లాది రూపాయిలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని సిమెంట్ రోడ్ల నిర్మాణమే ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చీరాల ఆర్అండ్‌బీ సబ్ డివిజన్ డీఈ నళిని, ఏఈ శ్రీకాంత్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మి, టీడీపీ ఇంకొల్లు పట్టణ అధ్యక్షుడు మార్క్, నాయకులు దేవతోటి నాగరాజు, వెంకటేశ్వర్లు, సురేష్, వెంకటరావు, తూమాటి శ్రీను, రాజేష్, కర్రి శ్రీను, సునీల్, వీరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు : గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఇంకొల్లు నుంచి సంతరావూరు ఆర్అండ్‌బీ రోడ్డులో తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టారు. ఈ రహదారి మరమ్మతులకు ప్రభుత్వం రూ.15 లక్షలు నిధులు మంజూరు చేసిందని ఆర్అండ్‌బీ జేఈ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో ఇంకొల్లు మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, చిన్నగంజాం మండల పార్టీ అధ్యక్షుడు పొద వీరయ్య, కరి శ్రీనివాసరావు, వలేరు మార్క్, గుంజి వెంకట్రావు, టీడీపీ నాయకులు, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, టీడీపీ నాయకులు

దమ్ము చక్రాల ట్రాక్టర్లతో రోడ్లకు దెబ్బ

» అవగాహన లేక ఇనుప చక్రాలతో తిప్పుతున్న రైతులు

» సాగు పనులు ముమ్మరం కావడంతో జోరుగా తిరుగుతున్న వాహనాలు

» పట్టించుకోని అధికారులు



బల్లికురవ అద్దంకి అర్అండ్‌బీ రోడ్డుపై వెళ్తున్న దమ్ము చక్రాల ట్రాక్టర్

బల్లికురవ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దమ్ము చక్రాల ట్రాక్టర్లతో కోట్ల రుపాయలతో చేపట్టిన రోడ్లు ఛిద్రం అవుతున్నాయి. రైతులకు అవగాహన లేకనే వారు రోడ్లపైకి ఇనుప చక్రాలను తీసుకు వస్తున్నారు. అధికారులు రైతులకు సూచనలు చేయడంతో పాటు చక్రాలకు రబ్బరు తొడుగులను అందజేయాలని ప్రజలు కోరుతున్నారు. వరి పంట సాగు సీజన్ ప్రారంభం కావడంతో దమ్ము చక్రాల ట్రాక్టర్ల రైతులకు అవగాహన కలిపించాలని వారు అంటున్నారు.

బల్లికురవ మండలంలో వరి పంటను రైతులు అధికంగా సాగు చేస్తుంటారు. వరి పంట వేయాలంటే పొలం దమ్ము చేసేందుకు ఇనుప చక్రాల ట్రాక్టర్లు అవసరం. ఏటా గ్రామాలలోని రోడ్ల పైకి ఇనుప చక్రాల ట్రాక్టర్లు రావడంతో రోడ్లపై గుంతలతో గాడులు పడి వర్షాలు కురవగానే అవి పాడయిపోతున్నాయి. మండలంలోని కొమ్మినేనివారిపాలెం, అంబడిపూడి, వైదన, ఎస్ఎల్ గుడిపాడు, కొత్తూరు, వెలమవారిపాలెం, ముక్తేశ్వరం, వల్లాపల్లి, చెన్నుపల్లి, కొప్పెరపాలెం, కూకట్లపల్లి గ్రామాల పరిధిలో ఎక్కువ మంది రైతులు వరి పంటను సాగు చేసి దమ్ము చక్రాల ట్రాక్టర్లను వాడుతుంటారు. అయా గ్రామాలలో తారు రోడ్లు, సీసీ రోడ్లు దమ్ము చక్రాల వల్ల పూర్తిగా దెబ్బతింటున్నాయి. గ్రామాలలో సీసీ రోడ్లపై దమ్ము చక్రాల ట్రాక్టర్లు పొలానికి వెళ్లివచ్చు క్రమంలో రోజుకు పలుమార్లు తిరగడం వలన సిమెంట్ రోడ్డు గుల్ల అవుతున్నాయి. పొలాల్లోనే దమ్ము చక్రాలను వదిలి వస్తే కొంత వరకు రోడ్డు దెబ్బతిన కుండా ఉండే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. ఇనుప చక్రాల మధ్య రబ్బరు తొడుగులు చుట్టి రోడ్లపై తిప్పితే రోడ్డు దెబ్బతినవని పలువురు అంటుండగా రైతులు అవేమీ పట్టించుకోవడం లేదు. ఈ విషయమై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు. లక్షలు ఖర్చు చేసి వేస్తున్న రోడ్లు కొంత కాలం పదిలంగా ఉండాలంటే దమ్ము ట్రాక్టర్లకు రబ్బరు తొడుగు ఉండేలా చర్యలు చేపట్టాలి. రైతులకు తక్కువ ఖర్చుతో రబ్బరు తొడుగులు అందజేసి వారికి అవగాహన కల్పించాలి.

రీ-సర్వే సమస్యలను పరిష్కరిస్తాం

తహసీల్దార్ సింగారావు

పంగులూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో గతంలో జరిగిన రీ-సర్వే వల్ల తలెత్తిన భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ పి.సింగారావు అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో శనివారం రీసర్వే సమస్యల పరిష్కారానికి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వేలో భూములు సబ్ డివిజన్ చేయాలని, విస్తీర్ణంలో వ్యత్యాసాలను సవరించాలని, మ్యూటేషన్ చేయాలని కోరుతూ రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. చందలూరులో జరిగిన సభలో మొత్తం 181 దరఖాస్తులు అందాయన్నారు. విస్తీర్ణం సవరణ కోరుతూ 74, సబ్ డివిజన్‌కు 18, మ్యూటేషన్‌కు 44, కోరిలేషన్ మార్పునకు 7, పేరు, ఫొటో మార్పునకు 36, క్లాసిఫికేషన్ మార్పు కోరుతూ రెండు దరఖాస్తులు అందచేశారని సింగారావు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కిష్టారావు, రీసర్వే డీటీ అర్జున్, మండల సర్వేయర్ సురేష్, వీఆర్వో పరుసురామిరెడ్డి, గ్రామ సర్వేయర్ నాగార్జున, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మార్టూరు : గ్రామ సభలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరిస్తామని డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మి అన్నారు. శనివారం జొన్నతాళిలో రెవెన్యూ అధికారులు గ్రామ సభను నిర్వహించారు. వైసీపీ పాలనలో జరిగిన రీసర్వేతో భూముల విస్తీర్ణం, పాస్‌బుక్ పేర్లలో పొరపాట్లు ఏర్పడ్డాయని 75 మంది రైతు లు దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేంద్రమ్మ, మండల సర్వేయర్ ఏడుకొండలు, వీఆర్వో పాల్గొన్నారు.


గోశాలకు దాణా అందజేత



గోశాలకు దాణా అందజేస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం, పవిత్ర కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా రోటరీ మిత్రుల సాయంతో అద్దంకిలోని హరిహర గోశాలకు దాణాను అందజేశారు. మూడు బస్తాల తవుడు, దాణా, పండ్లు అందజేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. గోశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి సీహెచ్ మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, ఆంజనేయులు, నాగయ్య, సుబ్రహ్మణ్యం, గోశాల నిర్వాహకుడు సుబ్బారావు పాల్గొన్నారు.

సోమశిలకు 20,892 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



అనంతసాగరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 20,892 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 69.83 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2100, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 500 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



నెల్లూరు : పల్లకీలో ఊరేగుతున్న శివపార్వతులు

శంభో శివశంభో..

- వైభవంగా కార్తీక మాసం ప్రారంభం
- కనుల పండువగా ఆకాశదీప ఆవిష్కరణ

జిల్లావ్యాప్తంగా శివ, వైష్ణవ ఆలయాల్లో శనివారం రాత్రి కార్తీక మాసం ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. విశేష పూజలు, స్వామివార్లకు పల్లకీసేవలు, భక్తుల జయజయ ధ్వనుల మధ్య ఆకాశదీపాలు వెలిగించారు. నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. సాయంత్రం విశేష పుష్పాలంకరణ, శివపార్వతులకు విశేష పల్లకీ ఉత్సవం, తదితర పూజలు జరిగాయి. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, ఆల్తూరు గిరీష్‌రెడ్డి, ఈవో జె.శ్రీనివాసరావు తదితరులు ఆకాశ దీపాన్ని వెలిగించి ధ్వజస్తంభానికి కట్టి, అధిరోహించారు. అలాగే వేణుగోపాలస్వామి, ఇరుకళల పరమేశ్వరి, అష్టలక్ష్మి, రాజరాజేశ్వరి, సుందరేశ్వరస్వామి ఆలయాల్లోనూ ధ్వజస్తంభానికి విశేష పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు. జిల్లావ్యాప్తంగా అన్ని పుణ్యక్షేత్రాల్లోనూ కార్తీక మాసం ఉత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి.

\- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



మూలస్థానేశ్వరాలయంలో ఆకాశదీపాన్ని ఎగరవేస్తున్న అర్చకులు

నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు షురూ!

- 20న నోటిఫికేషన్ విడుదల
- 21 నుంచి మూడు రోజులపాటు ఎన్నికలు
- పోలింగ్ అధికారులు, సిబ్బంది నియామకం

6

అమాత్యా ఆలకించు!

- సంక్షేమం ఓకే.. సాగునీటితోనే బెంగ
- పడకేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులెన్నో!
- ప్రతిపాదనలకు ఆమోదం తెలిపితే జిల్లా సస్యశ్యామలమే!
- నేటి మధ్యాహ్నం డీఆర్సీ సమావేశం



అభివృద్ధికి నోచని నీటివనరులు.. సంవత్సరాలు గడుస్తున్నా వెక్కిరిస్తున్న శిలాఫలకాలు... అర్ధంతరంగా ఆగిన పనులు.. మరమ్మతులకు నోచుకోని పంట కాలువలు.. ఇలా చెప్పుకుంటేపోతే చాలానే ఉన్నాయి. జిల్లాలో ఎన్ని అభివృద్ధి పనులకు రాష్ట్ర రాజధానికి యంత్రాంగం పంపిన ప్రతిపాదనలు కాగితాల్లోనే ఉండిపోయాయి. అంచనాలు పెరిగిపోతున్నాయే తప్ప పనులకు ఆమోదం లభించడం లేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల తర్వాత తొలిసారి జిల్లా సమీక్ష మండలి (డీఆర్సీ) సమావేశం ఆదివారం జరగనుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రితోపాటు జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నత యంత్రాంగం ఈ సమావేశంలో పాల్గొననుంది. జిల్లాలో నెలకొన్న ప్రధాన సమస్యలపై అమాత్యులు చర్చించి, కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సింహపురివాసులు కోరుతున్నారు.

నెల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఐదు నెలల కూటమి పాలనకు ప్రజలు మంచి మార్కులే వేస్తున్నారు. శాంతి భద్రతల నుంచి సంక్షేమ పథకాల వరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అన్నా క్యాంటీన్లతో పేదల ఆకలి తీర్చారు. ఉచిత ఇసుక పంపిణీ విధానంతో ఇటు కూలీలు, అటు భవన నిర్మాణదారుల కన్నీళ్లు తుడిచారు. తాజాగా మహాశక్తి దీపం-2 పథకం కింద పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ ఒక్క పథకం ద్వారా జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వానికి వంద కోట్ల రూపాయల భారం పడినా సంక్షేమం విషయంలో ఎన్డీఏ కూటమి వెనక్కు తగ్గదు. ఈ ఐదు నెలల స్వల్ప కాలంలో విజయవాడ ఉప్పెన వంటి ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనా వాటిని తట్టుకుంటూనే సంక్షేమాన్ని అమలు చేస్తున్నారు. అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఐదేళ్లపాటు నరకాలకు ఆనవాళ్లుగా కనిపించిన రోడ్లను బాగు చేసే పనులు మొదలు పెట్టారు. ప్రజల తక్షణ మౌలిక అవసరాలను గుర్తించి ఆ పనుల ఆరంభానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. అన్ని విషయాల్లో ప్రగతి కనిపిస్తున్నా.. ఇంకా ఏదో వెలితి ఉంటూనే ఉంది. ఇరిగేషన్ పెండింగ్ ప్రాజెక్టుల పనుల విషయంలో లోటు కనిపిస్తూనే ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు తొలి జిల్లా సమీక్ష మండలి (డీఆర్సీ) సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో పాలకులు జిల్లాలో దశాబ్దాల కాలంగా నత్తనడక నడుస్తున్న ఇరిగేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా నిర్ణయాలు తీసుకుంటే, ఆ మేరకు పనులను పరుగులు తీయిస్తే ఇక జిల్లా సస్యశ్యామలమే అవుతుంది. కూటమి ప్రజాప్రతినిధుల మీద కొండంత విశ్వాసంతో తమ ప్రాంతాల్లోని ఇరిగేషన్ సమస్యలను సమీక్ష మండలి ముందుకు తీసుకొస్తున్నారు

- సోమశిల జలాశయం ఉత్తర కాలువ సామర్థ్యం 750 నుంచి 1500 క్యూసెక్కులకు పెంచే పనుల్లో వేగం పెంచాలి.
- సోమశిల జలాశయం ఇరుపక్కల దారుణంగా దెబ్బతిన్న పొర్లుకట్టలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలి.
- సోమశిల క్రస్ట్‌గేట్ల మరమ్మతులకు రూ.2.40 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఆ నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలి.
- కామారెడ్డిపాడు, పాతాళపల్లి వద్ద ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా ఉన్నాయి. వెంటనే వీటికి మరమ్మతులు చేయాలి.
- సోమశిల జలాశయం వద్ద తాగునీటి పథకం మూడేళ్లుగా నిరుపయోగంగా ఉంది. దానిని వినియోగంలోకి తేవాలి.
- సంగం బ్యారేజీలో ఐదు శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఘాట్లు, లైనింగ్, రహదారి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తి చేయాలి.
- సంగం బ్యారేజీ పరిధిలోని ప్రధాన పంట కాలువలన్నీ పూడికతో నిండి ఉన్నాయి. చెరువుల కట్టలూ బలహీనంగా ఉన్నాయి. వీటికి మరమ్మతులు చేయాలి.
- పెన్నా, సంగం బ్యారేజీల నిర్వహణకు సిబ్బంది లేరు. గేట్లు ఎత్తే దిక్కు కూడా లేదు. తక్షణం వీరిని నియమించకుంటే ప్రమాదం ముంచుకొచ్చే అవకాశం ఉంది.
- కందుకూరు నియోజకవర్గంలో వీఆర్‌కోట ఆనకట్ట పనులు రెండేళ్లుగా నత్తనడక సాగుతున్నాయి. అంచనాలు పదిరెట్లు పెరిగాయి కానీ పనులు పూర్తి కాలేదు.
- రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ పొడిగింపునకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఒకటిన్నర దశాబ్దం అవుతోంది. కానీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.
- రామతీర్థం జలాలతో తాగునీటి పథకం మంజూరైనా టెండర్ల దశలో ఆగిపోయింది. కందుకూరు బైపాస్‌రోడ్డుకు అతీగతీ లేకుండా పోయింది.
- పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్, సోమశిల హై లెవల్ కెనాల్ పనులు దశాబ్దాల తరబడి నత్తనడక సాగుతుండటంతో సాగు, తాగునీటి సమస్య తీవ్రమైంది.
- గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చెరువులు, గుట్టలను కొల్లగొట్టారే కానీ చిన్న మరమ్మతులు చేసిన పాపాన పోలేదు.
- దగదర్తి విమానాశ్రయం పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.
- జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని వెంటనే పూర్తి చేసి మత్స్యకారులకు మేలు చేయాలి.
- బిట్రగుంటలో వేలాది ఎకరాల రైల్వే ఆస్తులు నిరుపయోగంగా ఉన్నాయి. ఇక్కడ రైల్వే ప్రాజెక్టులు, పరిశ్రమలు తెస్తే పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది.
- వైసీపీ నేతల పాపాల కారణంగా కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ వెళ్లిపోయింది. వేలాది మంది ఉద్యోగులను వీధిన పడేసింది. తక్షణం దీని పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి.
- సర్వేపల్లి రిజర్వాయర్ విస్తరణ పనులు టెండర్ల దశలోనే ఉన్నాయి. ఐదేళ్లుగా దేగపూడి-బండేపల్లి కాలువ పనులు ఆగిపోయాయి.



సోమశిల జలాశయం దిగువున దుస్థితి



ఉదయగిరి రూరల్ : అసంపూర్తిగా మిగిలిన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ కట్ట రివిట్‌మెంట్ పనులు



'గుంతలు లేని రోడ్లు' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆనం

ఇక రహదారులపై గుంతలుండవ్!

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

మూముడూరులో మంత్రి ఆనం వెల్లడి

చేజర్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం విస్మరించిన అన్ని రహదారులకు మరమ్మతులు చేపట్టి రోడ్లపై గుంతలు లేకుండా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. శనివారం మూముడూరు గ్రామంలో 'గుంతలు లేని రోడ్లు' కార్యక్రమాన్ని మంత్రి ఆనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్లలో ధ్వంసం చేసిన రోడ్లను మనకు ఆస్తిగా ఇచ్చిందని దుయ్యబట్టారు. ఆత్మకూరులో గత పదేళ్లుగా ఎమ్మెల్యేగా పని చేసిన వాళ్ళు ఈ ప్రాంత అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని అన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రూ.3.47 కోట్లతో 15 ఆర్అండ్‌బీ రోడ్లను మొదలుపెట్టామని, త్వరలో మరో 30 కోట్లతో అధికారులు పనులు ప్రతిపాదించినట్లు తెలిపారు. మార్చి 31వ తేదీలోపు

- మిగతా 6లో



నెల్లూరులో అబ్బురపరిచిన యోగా పోటీలు

ఉత్సాహం..ఉత్తేజం

అది శరీరమా లేదా రబ్బరా!? యోగాలో అన్ని భంగిమలు ఉన్నాయా!? అంతటి సాధన ఎలా చేశారు!? ఇలా ఆహూతులను ఆశ్చర్యంలో ముంచెత్తేలా యోగా విన్యాసాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్-14, 17 బాల, బాలికల యోగా పోటీలు నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన 400 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. నేటితో ముగిసే ఈ పోటీల్లో తమ విన్యాసాలను ప్రదర్శించి పతకాలు సాధించాలన్న పట్టుదలతో క్రీడాకారుల్లో పోటీపడుతున్నారు.

6

ప్రైవేట్ అటెండెన్స్ రిజిస్ట్రేషన్ కనుమరుగు

రిజిస్ట్రేషన్లకు వ్యాధిగ్రస్థులు, వయోవృద్ధుల అవస్థలు

- వివరాలు 7లో



EØ ..
E ₡


• అబ్బురపరిచిన యోగా పోటీలు

నెల్లూరు (విద్య), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో చిన్నారులు ఉత్సా హంగా..ఉత్తేజంగా పాల్గొని వారి ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. ఎవరికి వారు తాము నేర్చుకున్న యోగా విన్యాసాలతో అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారులు చేస్తున్న యోగాసనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతోపాటు యోగా ప్రాముఖ్యతపై అందరినీ ఆలోచింప చేశారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్-14, 17 బాల, బాలికల యోగా పోటీలు నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ప్రారంభమ య్యాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని పాత జిల్లాల ప్రకారం 13 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరవగా వీరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతి, భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో బాల, బాలికలు తమ విన్యాసాలను ప్రదర్శించి పతకాలు సాధించాలన్న లక్ష్యంతో పోటీ పడుతున్నారు.

పోటీలను తిలకిస్తున్న అధికారులు







● భారతీయ సంస్కృతికి నిదర్శనం

భారతీయ సంస్కృతికి నిదర్శనంగా యోగా కీర్తి గడించిందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఆర్.బాలాజీరావు తెలిపారు. యోగా పోటీల ప్రారంభోత్సవం కార్యక్రమంలో డీఈవో పాల్గొని మాట్లాడారు. శారీరక, మానసిక ఆరోగ్యం అందించే యోగా ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందు తోందన్నారు. యోగా మూలాలన్నీ భారత్‌లోనే ఉన్నాయని, వేదకాలం నుంచి భారతదేశంలోనే యోగా ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సూచనలతో నేడు ప్రపంచ వ్యాప్తంగా అంత ర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారంటే దాని ప్రాముఖ్యత ఏమిటో నేటితరం యువ త, విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. గడిచిన దశాబ్దకాలంలో యోగా అనేక రూపాలు మారు తూ భిన్నమైన ఆసనాలతో అంతర్జాతీయస్థాయిలో కీర్తి గడిస్తోందన్నారు. అంతటి ప్రాధాన్యత కలిగిన యోగాలో విద్యార్థులు నిత్య సాధన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్‌కే.యతిరాజ్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆదరణ కలిగిన యోగాలో విద్యార్థులు ఉత్తమంగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డిప్యూటీఈఓ ఎస్.ప్రసన్నలక్ష్మి, ఫిజికల్ ఎడ్యుకేషన్ రీజనల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ మహబూబ్ బాషా, నెల్లూరు ఎంఈఓ తిరుపాల్, ఒలంపిక్ సంఘం జిల్లా కార్యదర్శి కె.గురుప్రసాద్, ఏపీ పీఈటీల సంఘం కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, అండర్-19 స్కూల్‌గేమ్స్ కార్యదర్శి శ్రీరేష్, అండర్-14 స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎస్.విజయ, జిల్లా పీఈటీల సంఘం కార్యదర్శి పి.థామస్‌పీటర్, పాఠశాల హెచ్‌ఎం కృష్ణారెడ్డి, జ్యోతిర్మయి, పోటీల పరిశీలకుడు జె.రాజకుమార్, పీఈటీలు పాల్గొన్నారు.

ఏ ప్రతిఫలాన్ని, ప్రయోజనాన్ని ఆశించకుండా కుటుంబ అవసరాలు, ఆశయాలు తీర్చేది గృహిణి మాత్రమే. ఇంటిని సరైన దారిలో నడిపించేందుకు అనునిత్యం శ్రమించే చోదకశక్తి ఆమె. తెల్లవారుజామున లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు విరామం లేకుండా ఇంటిపనుల్లో నిమగ్నమై.. కుటుం బాధ్యతలు నెరవేరుస్తూ భర్తతో సమానంగా బాధ్యతలు నిర్వహిస్తున్న మహిళలు ఎందరో.. ఎందరోఎందరో ఉన్నారు. నేడు ప్రపంచ గృహిణుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



సంసారంలో సంతోషం
గృహిణి వల్లే సాధ్యం !

- అన్నీ తానై ఇంటిని చక్కదిద్దుతున్న ఇల్లాలు
- కుటుంబానికి కేంద్ర బింధువు ఆమె
- ఆర్థిక వ్యవహారాల్లో చేదోడు వాదోడుగా..
- నేడు ప్రపంచ గృహిణుల దినోత్సవం

ఇంటికి దీపం ఇల్లాలు అనే మాటకు నిదర్శనంగా పనులు చేస్తూ కుటుంబ సభ్యుల అవసరాలను తీరుస్తూ, ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని భర్తతో సమానంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న గృహిణులు నేడు అనేకమంది ఉన్నారు. అలాగే ఆర్థిక లావాదేవీల్లో చేదోడువాదోడుగా తమ సేవలను అందిస్తున్నారు. ప్రతి పురుషుడి విజయం వెనుక స్త్రీ ఉందనడానికి ఎలాంటి సందేహం లేదు. ఇంట్లో తాను అందిస్తున్న సహకారం, నిరంతరం శ్రమించే తత్వమే ఇందుకు నిదర్శనం. కరోనా లాంటి మహమ్మారి సమయంలో గృహిణిలు అందించిన సేవలు అమోఘమనే చెప్పాలి. ఈ సమయంలో విద్యాసంస్థలన్నీ మూతపడడం, వర్క్ ఫ్రం హోమ్ వల్ల అందరూ ఇళ్లకే పరిమితమై పోవడంతో ప్రతి ఇంటి గృహిణి కూడా విశేషసేవలందించారు. పిల్లలకు సమయానికి భోజనం అందించడం, ఇంటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడంతో పాటు పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. కరోనా సమయంలో ఆర్థిక ఇబ్బందులు రాకుండా పక్కా ప్రణాళికలతో ఇంటిని నడిపించారు. అన్నీ పనుల్లో తమదైన ముద్రవేసే గృహిణుల సేవలు ఎప్పటికీ ప్రత్యేకమే..అందరికీ ఆదర్శమే.

● గృహిణులను గౌరవించండి !



ప్రపంచ గృహిణుల దినోత్సవం సందర్భంగా కుటుంబంలోని సభ్యులంతా వారిని గౌరవించడంతో పాటు వారికి పూర్తి సహకారాన్ని అందించాలి. వారికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా కుటుంబంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్న వారి భావోద్వేగాలకు ప్రాధాన్యతనివ్వాలి. ప్రతి గృహిణి కూడా తమ ఇంటిని నివాస స్థలం కాకుండా తమ కుటుంబం ఉన్నతి చెందే ప్రదేశంగా మార్చుకోవడానికి ఎంతో నిబద్ధతతో ఉంటారు. వీటిని దృష్టిలో ఉంచుకుని కుటుంబ సభ్యులంతా వారికి అండగా ఉంటూ ప్రేమను పంచుతూ ఉండాలి.

పిల్లలను తీర్చిదిద్దా..



నేడు జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో బీఏ పాలిటిక్స్ చదివా. నా ఇద్దరు పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు గృహిణిగానే మిగిలిపోయా. ఉద్యోగం లేదా ఏదైనా వ్యాపారం చేసే అవకాశం ఉన్నా, పిల్లలను మంచిగా చదివించేందుకు వాటిని వదులుకున్నా. పెద్దకుమార్తె కావ్యశ్రీని మెడిసిన్ చదివించా. ఆమె తమిళనాడులో జనరల్ మెడిసిన్ డాక్టర్‌గా పనిచేస్తోంది. చిన్నకుమార్తె వెంకట దీప్తిక డిగ్రీ చదువుతో ంది.గృహిణిగా పిల్లలను తీర్చిదిద్దడం నాకు సంతృప్తి నిచ్చింది. కుటుంబాన్ని చక్కదిద్దుకోవాలంటే గృహిణిగానే ఉండడమే మంచిదనేది నా అభిప్రాయం.

- మంచాల మల్లిక, వైకుంఠపురం, కావలి

గృహిణిగా జీవితంలో సంతృప్తి



బీఎస్సీ కంప్యూటర్స్ చదివా. ఉద్యోగం వేటలో ఉన్న సమ యంలో వివాహమైంది. నాకు ఇద్దరు కుమారులు. ఉద్యోగం చేసి కుటుంబానికి చేదోడుగా ఉండాలనుకున్నా. పరిస్థితుల ప్ర భావంతో గృహిణిగా స్థిరపడ్డా.దీంతో నా కుటుంబాన్ని నేనే చూసుకోవాల్సి వచ్చింది. అయినా గృహిణిగా జీవితం సంతృప్తి నిచ్చింది. ఉద్యోగం చేస్తూ ఉండి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో... ? కుటుంబాన్ని, కుటుంబ సభ్యుల మంచి చెడు చూసుకుంటూ సంతృప్తికరమైన జీవితాన్ని అనుభవిస్తున్నా.

- మొలతాటి శారద, అల్లూరు

అటు గృహిణిగా.. ఇటు వ్యాపారిగా



కందుకూరులోని పెద్దబజారుకు చెందిన తటవర్తి జానీ బీకాం చదివారు. గృహిణిగా తన బాధ్యతలు నిర్వర్తిస్తూనే వ్యాపారంలో తన భర్తకు చేదోడుగా ఉంటున్నారు. అంతేకాదు.. సామాజిక సేవా కార్యక్రమాల్లోను ఆమె పాల్గొంటు న్నారు. ఆలయాల్లో జరిగే నిరంతర కార్యక్రమాల్లో జానీ పాల్గొంటారు. అలాగే. మొన్నటిదాకా కందుకూరు ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యురాలిగా కూడా పని చేశారు. ఇష్టంగా చేస్తే ఎన్ని బాధ్యతలు నిర్వహించినా కష్టం అనిపించదని ఆమె చెప్పుకొచ్చారు.

- తటవర్తి జానీ

ఇక రహదారులపై
గుంతలుండవ్!

(5వ పేజీ తరువాయి)

ఆత్మకూరు నియోజకవర్గంలో 70 కోట్లతో అర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులకు మరమ్మతులు పూర్తి చేస్తామని అన్నారు. తొలుత మాముడూరు గిరిజన కాలనీలో సిమెంట్ రోడ్లకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి టీడీపీ సీనియర్ నాయకుడు గిరినాయుడు ఆధ్వర్యంలో భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్, ఆత్మకూరు ఆర్డీవో పావని, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇస్కాన్‌లో అన్నంతో జగన్నాథుడి చిత్రం అలంకరణ

వైభవంగా గోవర్ధన పూజ

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇస్కాన్ మందిరంలో శనివారం గోవర్ధన పూజ జరిగింది. ఈ సందర్భంగా ఇస్కాన్ గోశాలలో అన్నంతో జగన్నాథుడు, సుభద్ర చిత్రాలను వేసి పూలు, పండ్లతో అలంకరించి పూజించారు. అ నంతరం గో వులకు పూజలు చేశారు. ఇస్కాన్ అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవ స్వామి గోవర్ధన పూజను గురించి ప్రవచనం చేశారు. అనంతరం భజనలు, కీర్తనలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. భక్తులకు అన్నప్ర సాదాల వితరణ జరిగింది.



శిక్షణలో మాట్లాడుతున్న ఎస్‌ఈ దేశానాయక్

490 నీటి వినియోగదారుల సంఘాల
ఎన్నికలకు 20న నోటిఫికేషన్

● మాస్టర్ ట్రైనర్ల శిక్షణలో ఇరిగేషన్ ఎస్‌ఈ

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 2 : జిల్లాలోని 490 నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు నీటిపారుదల శాఖ ఎస్‌ఈ దేశానాయక్ చెప్పారు. కలెక్టరేట్ తిక్కన భవన్‌లో ఎన్నికలకు సంబంధించి మాస్టర్ ట్రైనర్లకు శనివారం శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా దేశానాయక్ మాట్లాడుతూ సంఘాల అధ్యక్ష పదవులకు, 8 డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్ష పదవు లకు, 7 ప్రాజెక్టు కమిటీల చైర్మన్ పదవులకు ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. ఈ నెల 20న నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు చెప్పారు. సాగునీటి సంఘాల అధ్యక్షుల ఎన్నికలు 21 నుంచి 23వ తేదీ వరకు మూడు రోజులపాటు జరుగుతాయని చెప్పారు. ఎన్నికల నిర్వ హణకు 980 మంది పోలింగ్ అధికారులను, 7396 మంది పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఈ శిక్షణంలో సోమశిల ప్రాజెక్టు ఎస్‌ఈ వెంకట రమణారెడ్డి, కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ, నెల్లూరు, కావలి ఆర్డీఓలు అనూష, వంశీకృష్ణ, నీటిపా రుదలశాఖ ఈఈలు, డీఈఈలు, తహ సీల్దార్లు తదిత రులు పాల్గొ న్నారు.

అది శ్మశానం కాదు.. పుణ్యక్షేత్రం. మృతదే హాలకు అంత్యక్రియలు చేసే సమయంలో ప్రశాంతత కావాలి. డంపింగ్ యార్డుగా మారిన శ్మశానంలో మృతదేహాలను పూడ్చడం కష్టంగా మారడం కలచివేసింది. దాతల సహకారంతో కైలాసభూమిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాం. ఏడాదికొకసారి చితాభస్మాన్ని పుణ్యనదుల్లో కలుపుతున్నాం. అందరూ అభినందిస్తుంటే ఆనందంగా ఉండటంతోపాటు బాధ్యత మరింత పెరిగింది.

శ్మశానం కాదు.. పుణ్యక్షేత్రం



- దేవిరెడ్డి సురేష్‌రెడ్డి, కైలాసభూమి అభివృద్ధి కమిటీ సభ్యుడు.

కోవూరులోని కైలాసభూమి



గ్రామ పొలిమేరలో ఏర్పాటు చేసి శ్మశానవాటిక కాల క్రమంలో డంపింగ్ యార్డుగా మారిపోయింది. అలాంటి ప్రాంతంలో మృత దేహాలకు క్రతువులు నిర్వహిం చడం అసాధ్యంగా మారింది. ఈ నేపథ్యంలో కొందరు ఓ కమిటీగా ఏర్పడి దాతల సహకారంతో అభివృద్ధి చేసి ఆహ్లాదకర వాతావరణం కల్పించారు. దీంతో నాటి తైదిబ్బగా పిలుచుకునే శ్మశాన వాటిక నేడు కైలాస భూమిగా మారింది.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)

నాటి తైదిబ్బే
నేటి కైలాసభూమి!

- సర్వాంగ సుందరంగా శ్మశానం అభివృద్ధి
- దాతల చేయూతతో ఆహ్లాదకర వాతావరణం
- ఆకట్టుకుంటున్న శివ, సత్యహరిశ్చంద్ర విగ్రహాలు

కోవూరు గ్రామ పొలిమేరలో వందలాది సంవత్సరాల క్రితం నాటి శ్మశాన వాటికను తైదిబ్బ గా పిలుసుకునేవారు. అయితే, కొన్నాళ్లుగా కోవూరు, పడుగుపాడు పంచాయతీల పరిధి లో వచ్చిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను వాహనాల్లో తీసుకొచ్చి ఈ ప్రాంతంలో గుట్ట లుగా పోయడంతో శ్మశానం కాస్త డంపింగ్ యార్డుగా మారింది. దీంతో మృతదేహాలను శ్మశానంలోకి తీసుకొచ్చి క్రతువులు నిర్వహిం చేందుకు తీవ్ర ఇక్క ట్లను ఎదుర్కొనేవారు. వర్షాకాలంలో అయితే అడుగుపెట్టే పరిస్థితి ఉండేదికాదు. ఈ పరిస్థితి నుంచి ప్రజల కష్టాలను గట్టెక్కిం చాలని భావించిన కొందరు స్థానికులు శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీగా ఏర్ప డ్డారు. చెత్తాచెదారం, శిథిల మైన సమాధు లను తొలగింపజేశారు. దాతలను సంప్ర దించి వారి సహకారంతో నీరు, విద్యుత్తు వసతి కల్పించడంతోపాటు మృతదేహాలను కాల్చేందుకు షెల్టర్లు, పొయ్యిలు, కర్మకాం డలు నిర్వహించేందుకు, మృతుల బంధువులు బస చేసేందుకు విశ్రాంతి భవనాలు నిర్మించారు. అంతేగాక 500 మృతదేహాల అస్థికలు భద్రపరచేందుకు లాకర్లనూ సిద్ధం చేశారు. అలాగే దూరప్రాంతాల్లో ఉన్న ఆప్తులు వచ్చే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు వీలుగా ప్రత్యేక గదిని కూడా నిర్మించారు. శివుడు, మృత్యుంజయుడి స్థూపం, కాల్చుల షెల్టర్ల సమీపంలో సత్యహరిశ్చంద్రుడి విగ్రహం ఏర్పాటు చేశారు. వీటన్నిటితోపాటు కైలాసభూమి లో పచ్చని చెట్లు ఆహ్లాదకర వాతావరణాన్ని పెంపొందిం చారు. ప్రధాన ద్వారం, సత్యహరిశ్చంద్రుడి విగ్రహం ప్రారంభానికి ఇటీవల వచ్చిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు కైలాసభూమిని చూసి అభివృద్ధి కమిటీని ప్రత్యేకంగా అభినందించారు.



మృతదేహాలను భద్రపరిచే భవనం ఇదే!




మృత్యుంజయ స్థూపం

ఓ ఎన్నారై దాతృత్వం ఎలక్ట్రికల్ శవ దహనశాల

పట్టణాలకే పరిమితమైన ఎల క్ట్రికల్ శవ దహనశాల ఓ ఎన్నా రై దాతృత్వంతో గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటైంది. మండలంలోని కొమరికకు చెం దిన ఇందుపూరు పవన్‌కుమార్‌రెడ్డి ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డాడు. తన స్వగ్రామమైన కొమరికలో ఎవరైనా మృతి చెందితే సంస్కారాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్నారు. గతేడాదిన తన నాయనమ్మ మృతి చెందడం, అదే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో గ్రామంలో దహన సంస్కారాలు చేసే వీలులేక నెల్లూరుకు తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇలాంటి పరిస్థితి తమ గ్రామస్థులకు కలగకుండా తనవంతు సాయంగా ఎలక్ట్రికల్ శవ దహనశాల నిర్మించాలని సంకల్పించారు. అందుకు అయ్యే ఖర్చు తాను భరిస్తానని చెప్పారు. దీంతో గ్రామానికి చెందిన గూడూరు ప్రభాకర్‌రెడ్డి, గూడూరు శివకుమార్‌రెడ్డిల పర్యవేక్షణలో పనులు ప్రారంభింపజేశారు. సుమారు రూ.6లక్షలు వెచ్చించి ఎలక్ట్రికల్ శవ దహ నశాల భవనాన్ని నిర్మించి కొమరిక గ్రామ ప్రజలకు అంకితం చేశారు. దీంతో ఇకపై దహన సంస్కారాలు తమ గ్రామంలోనే చేసుకునేందుకు వీలు కలగడంపై సంతోషం వ్యక్తం చేస్తు న్నారు. ఈ సందర్భంగా ఎన్నారై పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమలాగా గ్రామస్థులు ఇబ్బందిపడకూడదనే సంకల్పంతో రూ.6లక్షలతో దహనశాలను నిర్మించినట్లు చెప్పారు.

- ఇందుకూరు పేట (ఆంధ్రజ్యోతి)

ఎన్నారై పవన్‌కు మార్‌రెడ్డి నిర్మించిన ఎలక్ట్రికల్ దహన శాల



న్యూస్ బాక్స్

సిమెంట్ రోడ్ల పరిశీలన

సీతారామపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బసినేనిపల్లి గ్రామ పంచాయతీలోని ఎస్ఆర్ నగర్‌లో ఇటీవల నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన సిమెంట్ రోడ్లను శనివారం క్వాలిటీ కంట్రోల్ సీనియర్ అధికారి సతీష్‌బాబు బృందం పరిశీలించారు. అనంతరం బసినేనిపల్లి, ఎస్ఆర్ నగర్‌లో మిగిలిన సిమెంట్ రోడ్లను కూడా త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంజీఎన్ఆర్ఇజిఎస్ ఈసీ సువార్తయ్య, ఇంజనీర్ అసిస్టెంట్ బాలినేని ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

నైపుణ్యగణన పూర్తి చేయాలి

కొండాపురం, నవంబరు 2: విద్యావంతులైన యువతలో నైపుణ్యగణన త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో ఆనందరావు పంచాయతీ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడా రు. యువత ఏ రంగంలో ఎక్కువగా ఆసక్తి చూపుతారో ఆ విషయాలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో శేషసాయి పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

ఉలవపాడు, నవంబరు 2: గ్రామీణ ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ బాబురావు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలను హెచ్చరించారు. శనివారం కరేడు, ఉలవపాడు గ్రామాల్లో జరగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

ఉలవపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు టిప్పర్లను శనివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నట్లు ఉలవపాడు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. నెల్లూరు నుంచి ఒంగోలుకు ఇసుక లోడుతో వెలుతున్న టిప్పర్లను గమనించి రాజపాలెం వద్ద వాటిని ఆపి అనుమతి పేపర్లు, డాక్యుమెంట్లు తనిఖీ చేయగా ఆధారాలు చూపలేదన్నారు. ఒంగోలు మైనింగ్ ఏడీ కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఏరుకొల్లులో వైద్యశిబిరం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏరుకొల్లు ఎస్సీ కాలనీలో జ్వరాలు విజృంభించడంతో వైద్యులు అయూబ్‌అఫ్సర్ ఆధ్వర్యంలో శనివారం వైద్యఆరోగ్య సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటా లార్వా సర్వే చేపట్టి వ్యాధులపై అవగాహన కల్పించారు.

ఘనంగా గంధ మహోత్సవం

అనంతసాగరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని హజరత్ మష్యూర్ అలీషాఖాదరీ దర్గాలో శనివారం గ్యార్వీ షరీఫ్ మహబుబ్ సుబాని గంధ మహోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రెండేళ్లుగా ఆయుర్వేద సేవలు బంద్

- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

వలేటివారిపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆయుర్వేద వైద్యశాల గత రెండేళ్ల నుంచి తలుపులు తెరుచుకోక పోవడంతో మండల ప్రజలకు ఆయుర్వేద వైద్యం అందని ద్రాక్షలా మిగిలింది. ఆయుర్వేద ఆస్పత్రిలో వైద్యాధికారి, కాంపౌండర్, ఎమ్.ఎన్.ఓ, పీటీఎస్ పోస్టులు మొత్తం ఖాళీగానే ఉన్నాయి. కందుకూరు రెగ్యులర్ వైద్యాధికారి లక్ష్మీకుమారిని వలేటివారి పాలెం ఆయుర్వేద వైద్యశాలకు ఇన్‌చార్జిగా నియమించారు. అయితే ఆమె ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించడం లేదు. అసలు వైద్యశాలకు రావడం లేదు. చుట్టు ప్రక్కల గ్రామాల నుండి వైద్యం కోసం ప్రజలు వైద్యశాలకు వచ్చేవారు. ఎంతో ప్రాశస్త్యమున్న ఈ ఆయుర్వేద వైద్యాన్ని పట్టించుకోక పోవడం బాధకరం అని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కీళ్ల నొప్పులు, జ్వరం, చర్మవ్యాధులు, దగ్గు, జలుబు, స్త్రీ సంబంధిత వ్యాధులు, చర్మరోగాలు పక్షవాతం, మూర్ఛ, ఉబ్బసం, పార్శపు నొప్పులు, గ్యాస్ట్రబుల్, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, శ్వాస, గుండె సంభందిత వ్యాదులను ఇట్టే పసిగట్టే నయం చేసే అద్భుతమైన మందులు ఆయుర్వేదంలో ఉండేవి. గత రెండేళ్ల నుండి వైద్యశాల తలుపులు కూడా తెరవలేదు. దీంతో ఆయుర్వేద వైద్యం కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వైద్యశాల మూతపడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేళ్లగా పరిస్థితి ఇలాగే ఉన్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


తాళం వేసి ఉన్న ఆయుర్వేద వైద్యశాల

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

కావలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణ బుడంగుంట- చౌదరిపాలెం రోడ్డు నిర్మాణ పనులకు శనివారం కావలి ఎమ్మెల్యే వెంకట క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. తొలుత గ్రామంలోని అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్ల నిర్మాణాలు, చివరి ఆయుకట్టుకు కూడా ఉండేలా సాగు నీరు విడుదల, కావలి పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా భూసేకరణ, మాహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందచేస్తూ రామరాజ్యంలా పాలన సాగుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడా రోడ్లపై తట్టెడు మట్టి వేసిన పాపాన పోలే దన్నారు. కావలిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గుంటలరహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఈ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ క్రిషోర్ బాబు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో 22మంది ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు రూ.22,04,735ల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు వైద్యానికి పె ద్దపీట వేస్తున్నారని ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదన్నారు. కుటుంబ పెద్దగా ప్రతిఒక్కరి బాగోగులను చూసుకుంటున్నారని చెప్పారు. ఇతర ప్రాంతా లలో శస్త్రచికిత్సలు పొందిన వారు కూడా ఆరో గ్యశ్రీ కింద ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నేతలు గుత్తికొండ క్రిషోర్‌బాబు, జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబు, యేగూరి చంద్రశేఖర్, తిరువీది ప్రసాద్, తటవర్తి వాసు, నాగిశెట్టి, నాయుడు పాల్గొన్నారు.

గుంతల రహిత నియోజకవర్గమే లక్ష్యం

లింగసముద్రం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గుంతలరహిత నియోజకవర్గమే తన లక్ష్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన మేదరమె ట్లపాలెంలో గుంతలరహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మేదరమెట్ల పా లెంలోని బస్సు షెల్టర్ నుండి పెదపవని గ్రా మానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతుల కార్యక్రమానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచు కూ రపాటి మాధవి, ఆర్‌అండ్‌బీ ఈఈ రామకృష్ణ ప్రసాద్, డీఈ చక్రధర్, భాస్కర్, శ్రీను, రమేష్, సాంబయ్య, సయ్యద్ నాయబ్‌రసూల్, మనోహర్ పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

- కందుకూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థా నిక అయ్యప్పస్వామి ఆలయంలో మాల ధారులకు శనివారం అయ్యప్ప సేవాసంఘం సభ్యులు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఎమ్మెల్యే ఇంటూరి అన్న ప్రసాద శాశ్వత భవనా న్ని పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, అయ్య ప్పసేవా సంఘం సభ్యులు, స్థానిక నాయకులు, మాల ధారులు పాల్గొన్నారు.

బీఆర్ నాయుడును కలిసిన రాజేష్

టీటీడీ చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడను తెలుగుదేశం నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ శనివారం హైదరాబాద్‌లో కలిశారు. బీఆర్ నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మాలకొండ ఆదాయం

వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి): మాలకొండ లక్ష్మీనరసింహ స్వామికి శనివారం రూ.8.99 లక్షల హుండీ ఆదాయం వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవి సాగర్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అటవీ చట్టాలు.. రక్షణ కవచాలు

- ఆర్ శేఖర్, ఆత్మకూరు అటవీ రేంజ్ క్షేత్రస్థాయి అధికారి



? అటవీశాఖ చట్టాలపై ప్రజలకు ఏ మేరకు అవగాహన కల్పిస్తున్నారు.

! జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, మానవ మనుగడలో కీలక పాత్ర పోషిస్తున్న అడవులపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

? ఆత్మకూరు రేంజ్ పరిధిలో ఈ ఏడాది ఎన్ని మొక్కలు పెంచేందుకు నిర్ణయించారు.

! ఉపాధిహామి పథకం కింద 90వేల మొక్కలు నర్సరీల్లో పెంచేందుకు నిర్ణయించాం.

? నూతనంగా ఎన్ని హెక్టార్లలో ప్లాంటేషన్ చేయబోతున్నారు.

! ఆత్మకూరు రేంజ్ పరిధిలో 195 హెక్టార్లలో నూతనంగా ప్లాంటేషన్ చేయబోతున్నాం. ఇప్పటికే ఏఎస్ పేట, అనంతసాగరం మండలాల్లో 140 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తిచేశాం. మిగిలినవి త్వరలో పూర్తి చేస్తాం.

? అటవీ ప్రాంతంలో మొక్కలు పెంచేందుకు ఏమేరకు నిధులు మంజూరయ్యాయి.

! నర్సరీలను అభివృద్ధి చేసి అటవీ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు రూ. 7.20 లక్షలు మంజూరయ్యాయి.

గృహాల నిర్మాణం పూర్తి చేయాలి



అల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు వివిధదశల్లో నిలిచిపోయిన పక్కా గృహాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ పీడీ టి.వేణు గోపాల్ తెలిపారు. నార్తుఆములూరు, నార్తుమోపూరు, అల్లూరుతో పాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నూతన కాలనీల్లోని పక్కా గృహాలను శనివారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి విచారణ చేపట్టారు. వివిధదశల్లో నిలిచిపోయిన నిర్మాణాలను పరిశీలించి త్వరితగతిన నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని ఏఈ వెంకటేశ్వర్లును ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రజనీకాంత్, నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

'ప్రకాశం' విద్యార్థుల ప్రతిభ

కందుకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్అండ్‌టీ అనుబంధ సంస్థ సర్వే అండ్ కన్‌స్ట్రక్షన్స్ (ఎస్‌డీవీవీఎల్) ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు శనివారం ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించిన ఎంపికలో 8మంది విద్యార్థులు డిజైన్ ఇంజనీర్లుగా ఎంపికైనట్లు కళాశాల టెక్నికల్ డైరక్టర్ విజయ్‌శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన కళాశాలలో ఆ బ్రాంచి సమర్థతను చాటారని సివిల్ హెచ్‌ఓడీ డాక్టరు రాఘవశర్మ, వి. శ్రీనివాసరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ఆల్‌సోల్ ఫెస్టివల్

బిట్రగుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బోగోలుమేజర్ పంచాయతీలోని బ్రిటీష్ పాలనలో ఏర్పాటు చేసిన క్రైస్తవ సమాదులతోటలో శనివారం ఆల్‌సోల్ ఫిస్టవల్ ఆనందోత్సవాలతో నిర్వహించారు. మండల ప్రజలే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో జనం తరలివచ్చారు. రకరకాల పూలతో పెద్దలు, కుటుంబ సభ్యుల సమాదులను అలంకరించుకుని చర్చి పాదర్స్, సంఘకాపరులు, పాస్టర్లచే ప్రత్యేక ప్రార్ధనలు జరిపించారు. సమాదుల తోటలో విద్యుత్ దీపాలంకరణ, బాజా సంచా కాల్చుతు దూరప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు, స్నేహితులు కలసుకుని ఆప్యాయతగా పలకరించుకున్నారు.

హత్యకేసు ముద్దాయి అరెస్ట్

కావలి రూరల్ (ఆంధ్రజ్యోతి): నందెమ్మపురం కాటంగారి జాలమ్మ హత్య కేసు ముద్దాయి ఆవుల మునెయ్యను శనివారం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. గత నెల 27వ తేదీన మునెయ్య జాలమ్మ తలపై విచక్షణారహితంగా కర్రతో కొట్టడంతో ఆమె చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఈ కేసులో ముద్దాయి అయిన మునెయ్యను చెన్నాయ పాలెం వద్ద సీఐ రాజేశ్వరరావు సిబ్బందితో కలసి అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచారు.

ఎట్టకేలకు సర్వసభ్య సమావేశం

బిట్రగుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెండుసార్లు వాయిదా పడిన మండల సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మొక్కుబడిగా నిర్వహించి అధికారులు చేతులు దుపులుపుకున్నారు. ఎంపీపీ మేకల సుజాత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రమణ్యం, జడ్పీటీసీ కీర్తన, ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, ఏవో గోవిందరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

దగదర్తి (బిట్రగుంట) (ఆంధ్రజ్యోతి): పెద్దపుత్తేడు, ఉప్పలపాడు గ్రామాల మధ్య పంటపొల్లాల సమీపంలోని పేకాట స్థావరాలపై ఎస్ఐ జంపానికుమార్ శనివారం దాడులు నిర్వహించారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద 12,210 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు ఏఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం


నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థి ఉమాసాయిరాం

ఉదయగిరి రూరల్, నవంబరు 2 (ఆం ధ్రజ్యోతి): గండిపాళెం గ్రామంలో అద్దె భవ నాల్లో కొనసాగుతున్న మెయిన్ ప్రాథమిక పా ఠశాలకు శనివారం పూర్వ విద్యార్థులు ప్రధానోపాధ్యాయురాలు షేక్ షాహీదాఅక్తర్‌కు అద్దె నగదు చెల్లించి తమ దాతృత్వాన్ని చాటుకు న్నారు. పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలా వస్థకు చేరడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు అద్దె భవనంలో పాఠశాలను కొనసాగిస్తున్నారు. ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచన మేరకు పూర్వ విద్యార్థి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం, వారి మిత్ర బృందం అద్దె భవనానికి ప్రతినెలా రూ.3 వేల నగదును అందజేస్తామని ముందుకొచ్చారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదం డ్రులు వారిని అభినందించారు. ప్రభుత్వం త్వరితగతిన స్పందించి పాఠశాలకు నూతన భవనాలు మంజూరు చేయాలని కోరారు.

8న మండల సమావేశం

వలేటివారిపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యా లయంలో ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన 8వ తేది శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నరేంద్రదేవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, కార్యదర్శులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని పేర్కొన్నారు.

మేకపాటి గౌతమ్‌రెడ్డికి ఘన నివాళి

సంగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి జయంతిని మండలంలోని వైసీపీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంగం బ్యారేజీ వద్ద ఉన్న మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తుంగా ఇందూధర్‌రెడ్డి, నాయకులు బాలచంద్రారెడ్డి, షేక్ కరీముల్లా, ముడి మల్లికార్జునరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, ఫణికుమార్, కోటారెడ్డి, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

- ఆత్మకూరు : పట్టణంలో మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతి వేడుకలను శనివారం వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లో, నెల్లూరుపాళెం వద్ద ఉన్న గౌతమ్‌రెడ్డి విగ్రహాలకు నివాళులు అర్పించారు. ఎంజీఆర్ బస్టాండ్ సెంటర్‌లో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వైసీపీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ, సొసైటీ మాజీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న వైసీపీ నేతలు

భక్తిశ్రద్ధలతో ఆకాశదీపం ఏర్పాటు

సంగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయంలో కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా శనివారం రాత్రి భక్తి శ్రద్ధలతో కార్తీక ఆకాశ దీపం వెలిగించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా అమ్మవారి మండపం ఎదురుగా అఖండ దీపం వెలిగించారు. అనంతరం పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉదయగిరి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా శనివారం మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పార్వతీ పరమేశ్వరాలయంతోపాటు మండలంలోని గండిపాళెం, యర్రబల్లిగడ్డ, లింగాలదొన, గుడినరవ, అప్పసముద్రం, జీ.అయ్యవారిపల్లి, ఆర్లపడియ తదితర గ్రామాల్లోని శివాలయాల్లో అర్చకులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నారు.


ధ్వజ స్తంభంపై వెలిగిస్తున్న ఆకాశ కార్తీక దీపం


సిద్ధేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బిట్రగుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వీఎస్ఆర్ పేట పంచాయతీ కొత్తూరులో వెలసిన కోదండ రామాలయంలో సీతారామలక్షణాంజనేయ్యస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోగోలు కుమ్మరివీధి శివాలయంలో కార్తీకమాస ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

మంత్రి ఆనం చొరవతో రహదారికి మరమ్మతులు

సంగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో శనివారం స్థానిక కెనరా బ్యాంకు సమీపంలోని రహదారికి మరమ్మతు పనులు చేపట్టారు. రహదారిపై మురికినీరు ప్రవహించి భారీ గుంత ఏర్పడి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈనేపథ్యంలో చేజర్ల మండలంలోని మాముడూరుకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెళ్తుండగా స్థానిక నాయకులు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. దీంతో సాయంత్రానికి అధికారులు రోడ్డు మరమ్మతు పనులు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రహదారికి మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

వైసీపీ హయాంలో పనులు చేయకుండా దోపిడీ

సంగం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సర్వేపల్లి నియోజకవర్గంలో సాగునీటి కాలువల పూడికతీత పనులు చేయకుండానే కాకాణి గోవర్దనరెడ్డి వందల కోట్ల నిధులు దోచుకున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన సంగం బ్యారేజీ కుడివైపు కనుపూరు కాలువలో పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ముందుకుసాగుతున్నాయన్నారు. అందుకు ప్రస్తుతం నియోజకవర్గంలో రైతులే స్వయంగా సాగునీటి కాలువల్లో తీస్తున్న పూడికతీత పనులే నిదర్శనమన్నారు. జిల్లాలో రూ. 28 కోట్లతో ఓఅండ్‌ఎం కింద సుమారు 436 పనులు జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా సర్వేపల్లి నియోజకవర్గంలో రూ. 8 కోట్లతో వందల సంఖ్యలో పనులు జరుతుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఇరిగేషన్ డీఈలు శంకరనారాయణ, అనిల్‌కుమార్‌రెడ్డి, ఏఈ శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కందుకూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పులతో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన, అప్రమత్తతతో వ్యవహరించాలని స్థానిక కోటారెడ్డినగర్ అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి బ్యూలాగ్రేస్ తెలిపారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఆదిఆంధ్రకాలనీలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆమె జ్వరాలు, జలుబులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. కాలనీలో దోమల బెడద అధికంగా ఉన్నందున వ్యాధులు వస్తున్నట్లు గుర్తించామన్నారు. వైద్యాధికారి, సిబ్బంది ఫా గింగ్, బ్లీచింగ్ , పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచిం చారు. సబ్ యూనిట్ అధికారి రవిచంద్ర ఆధ్వ ర్యంలో ఆదిఆంధ్ర కాలనీలోని నివాసాల్లో దోమ ల నిర్మూలన మందును పిచికారీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వృద్ధి చెందే ఆవాసాలు పరిసరాల్లో లేకుండా చూసుకోవటంతో పాటు ఈ సీజన్‌లో కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ ఇంటూరి పద్మావతి, ఏఎన్ఎం పల్లవి, రమ్య పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

వలేటివారిపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ సురేష్‌కుమార్ తెలిపారు. వలేటివారిపాలెం హైస్కూల్‌లో శనివారం అవినీతి నిర్మూలన వారోత్సవాల కార్యక్రమంలో మేనజర్ సురేష్‌కుమార్ మాట్లాడారు. విద్యార్డులు తోటి విద్యార్థులతో పోటీపడి చదివి ప్రోత్సాహక బహుమతులు అందుకోవాలని కోరారు. అనంతరం ఏపీజీబీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10,9,8వ తరగతి పరీక్షలతో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులు చుండి నిఖేష్‌కుమార్, కళ్లగుంట తేజకు, గాజులవర్తి తేజశ్రీలకు హెచ్‌ఎం కమల్‌కుమార్ చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ఉల్లాస్ కార్యక్రమంపై వీవోఏలకు శిక్షణ

ఉదయగిరి రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో శనివారం వీవోఏలకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ, ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ పొదుపు సంఘాల్లో ఉండే నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అందుకు సంబంధించి 20 మంది వీవోఏలు, 13 మంది వలంటీర్లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఖాజా రంతుల్లా, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

- కొండాపురం : నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమంపై వెలుగు వీవోఏలకు శనివారం స్థానిక ఆదర్శ పాఠశాలలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆదినారాయణరావు మాట్లాడారు. 15ఏళ్ల పైబడి నిరక్షరాస్యులైన వయోజనులను తొలివిడతగా 505 మందిని గుర్తించామన్నారు. వీరందరికీ ప్రాథమిక అక్షరాభ్యాసం, సంఖ్యాపరిజ్ఞానం, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత తదితర విషయాలను నేర్పించేందుకు మండలంలోని 50మంది వెలుగు వీవోఏలకు ఒక్కరోజు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా వయోజనవిద్యా సూపర్‌వైజర్ షేక్ బాదుల్లా వీరికి శిక్షణ ఇచ్చారు. అనంతరం ఓపెన్ పాఠశాలల ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-1,2 రవికుమార్, ఆనందరావు, ఏపీఎమ్ కాంతారావు పాల్గొన్నారు.

- కావలి రూరల్ (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యత నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం అని ఎంఈవో గోవిందయ్య తెలిపారు. పట్టణ మండల సమాఖ్య వెలుగు కార్యాలయంలో శనివారం నిరక్షరాస్యత నిర్మూలనపై ఏపీఎం కృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణలో ముఖ్యఅతిథులుగా ఎంఈవో గోవిందయ్య, ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మీ, కృపమ్మ, సీసీలు ఎస్‌కె. రసూల్, శివయ్య, చిరంజీవి, ఎన్.మాల్యాద్రి, మండల సమాఖ్య సిబ్బంది సుమతి పాల్గొన్నారు.

- వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి): నూరుశాతం అక్షరాస్యత సాధించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం వయోజన విద్య ఏర్పాటుపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 38వయోజన విద్యాకేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా కో ఆర్డినే టర్ సింహాద్రి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ముప్పా హరిత, ఎంఈఓ-2 మల్లికార్జునరావ పాల్గొన్నారు.

పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు పెంచాలి

ఉదయగిరి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు పెంచాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. శనివారం మండలంలోని వెంకట్రావుపల్లి ప్రాథమికోన్నత, గంగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. వెంకట్రావుపల్లి పాఠశాల ఆవరణలో పెంచుతున్న కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి ఉపాధ్యాయులను అభినందించారు. అపార్ ఐడీలను వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. మనబడి-మన భవిష్యత్తు నిధులు విడుదల కాగానే వెంటనే పనులు పూర్తిచే యాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం, రిజిస్టర్లు పరిశీలించి తగు సూచనలు అందజే శారు. కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు బలరాం, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.24/2023
వల్లూరి లక్ష్మమ్మ ... వాది
Vs
సోమినేని బ్రహ్మయ్య మరియు వగైరాలు ... ప్రతివాది
టు,
D7: బండి కోటేశ్వరమ్మ W/o. వెంకటేశ్వర్లు, బండివారిపాలెం గ్రామం, వలేటివారిపాలెం, SPSR నెల్లూరుజిల్లా.
పై నెంబరు దావాలోని పరిహారం డిక్రీ కోరి మీ మీద వాది దాఖలు చేసియుండుట వలన మీరు స్వయంగా కానీ, మీ నుంచి సంపూర్ణ సంజా యిషీ పొందిన లాయరు ద్వారా కాని సదరు దావా ప్రత్యుత్తరములు చెప్పగలందుకు తే:05-11-2024దికి వాయిదా వేయబడియున్నది. కావున పై తేదీన ఉదయం 10.30 ని.లకు పై కోర్టు వారి మొదటి హాజరై మీ సంజాయిషీ తెలుపుకోవలసిందిగా మిమ్మల్ని ఆదేశించడమైనది. పై తేది యందు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షముందు పై దావాను తీర్మానించిందరు.
వాయిదా: 05-11-2024
శ్రీ టి.గోపాలకృష్ణమూర్తి
వాది తరపు న్యాయవాది
కందుకూరు

